www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 28-1-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 300 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: తదియ తె. 6.12 తదుపరి చవితి; నక్షత్రం: మఖ ఉ. 3.54 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా.12.55-2.43; దుర్ముహూర్తం: సా.4.35-5.20; అమృతఘడియలు: మ.1.12-3.00; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.05 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● ఆదివారం 28 జనవరి 2024



రెండేళ్ల కిందట ఓ వీడియో మెసేజ్ విడుదల చేశా. అప్పటికి మ్యాచ్‌లు గెలవక ఐదు నెలలు అయింది. దాంతో రిటైర్మెంట్ ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైందని భావించా. కానీ నాలో ఏదో శక్తి. దానికి పట్టుదల తోడై ఆ పయనం ఇప్పటిదాకా సాగింది. ఎబ్డెన్ రూపంలో అమోఘమైన భాగస్వామి లభించాడు. అతడి సహకారంతో ఈ ఘనత సాధించా. -బోపన్న

రోహన్ సాధించెన్!

డబుల్స్ చాంపియన్ బోపన్న ● పెద్ద వయస్సులో విజేతగా రికార్డు

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న రోహన్ బోపన్న ఎట్టకేలకు సాధించాడు. డబుల్స్‌లో చాంపియన్‌గా నిలవాలన్న అతని స్వప్నం 43 ఏళ్ల లేటు వయసులో సాకారమైంది. నరాలు తెగే ఉత్కంఠ నడుమ ఫైనల్ సాగినా ఈ వెటరన్ స్టార్ వెరవలేదు..పోరాట స్ఫూర్తికి మారుపేరైన రోహనే అంతిమంగా విజేతగా నిలిచాడు..ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ చాంపియన్‌షిప్ దక్కించుకోవడం ద్వారా పలు రికార్డులను సొంతం చేసుకున్నాడు..

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆసాంతం అదరగొట్టిన రోహన్ బోపన్న టోర్నీకి అద్భుత ముగింపునిచ్చాడు. ఆస్ట్రేలియా ఆటగాడు మాథ్యూ ఎబ్డెన్ జతగా బరిలోకి దిగిన బోపన్న..డబుల్స్ టైటిల్‌ను అందుకున్నాడు. శనివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో రెండో సీడ్ బోపన్న/ఎబ్డెన్ జోడీ 7-6 (0), 7-5తో ఇటలీ ద్వయం సిమోన్ బొలెలి/ఆండ్రియా వవసోరిపై విజయం సాధించింది. తద్వారా ఓపెన్ ఎరా (1968 నుంచి) పురుషుల విభాగంలో అత్యధిక వయస్సు (43 ఏళ్ల 329 రోజులు)లో గ్రాండ్‌స్లామ్ నెగ్గిన ప్లేయర్‌గా రోహన్ చరిత్ర సృష్టించాడు. ఈక్రమంలో జులియన్ రోజర్ (40 ఏళ్ల 270 రో.) పేరిట ఉన్న రికార్డును బద్దలుగొట్టాడు. అలాగే గ్రాండ్‌స్లామ్‌లో పురుషుల డబుల్స్ చాంపియన్‌గా నిలిచిన మూడో భారత ప్లేయర్‌గా బోపన్న మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. గతంలో లియాండర్ పేస్/మహేశ్ భూపతి పురుషుల్లో, సానియా మీర్జా మహిళల్లో గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించారు. ఇక బోపన్నకిది రెండో గ్రాండ్‌స్లామ్ కావడం విశేషం. డబ్రోవస్కీ (కెనడా)తో కలిసి 2017లో ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ టైటిల్‌ను గెలిచాడు. ఇక గంటా 39 ని. జరిగిన టైటిల్‌పోరులో ఒకే ఒక సర్వీస్ బ్రేక్ చోటుచేసుకోవడం గమనార్హం. రెండో సెట్ 11వ గేమ్‌లో 'లవ్' వద్ద వవసోరి తన సర్వీస్‌ను చేజార్చుకున్నాడు. నువ్వా..నేనా అన్నట్టు సాగిన మొదటి సెట్ టైబ్రేకర్‌కు వెళ్లింది. అయితే టైబ్రేకర్‌లో ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా రోహన్/ఎబ్డెన్ జోడీ జయకేతనం ఎగుర వేసింది. రెండో సెట్‌లో ఇటలీ ద్వయం మరింత పోరాడడంతో ఈ సెట్‌కూడా రసవత్తరంగా మారింది. కానీ అంతిమంగా రోహన్ జోడీనే విజయం వరించింది.

సోమవారం ప్రకటించే వరల్డ్ ర్యాంకింగ్స్ డబుల్స్ కేటగిరిలో రోహన్ బోపన్న నెం.1 ర్యాంక్‌కు చేరనున్నాడు. 43 ఏళ్ల వయస్సులో టాప్ ర్యాంక్ కైవసం చేసుకోనున్న ఆటగాడిగా మరో ఘనత సాధించనున్నాడు.

పురుషుల సింగిల్స్ ఫైనల్
మెద్వెదెవ్ X సిన్నర్
మ. 2 గం.నుంచి సోనీ నెట్‌వర్క్‌లో...



సబలెంక

సబలెంక రెండోసారి..

బెలారస్ భామ అరైనా సబలెంక మహిళల సింగిల్స్ టైటిల్‌ను వరుసగా రెండోసారి గెలిచింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో రెండో సీడ్ సబలెంక 6-3, 6-2తో 12వ సీడ్ జెంగ్ క్విన్‌వెన్ (చైనా)ను చిత్తు చేసింది. తొలి సెట్‌లో 5-1తో సబలెంక తిరుగులేని స్థితిలో నిలిచినా ఏడో గేమ్‌లో జెంగ్ కాసింత పోరాడింది. కానీ ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా సబలెంక ఆ సెట్‌ను నెగ్గింది. ఇక రెండో సెట్‌లో ముఖ్యంగా అద్భుతమైన సర్వీస్‌తో మరింత విజృంభించిన అరైనా..సెట్‌ను ఇంకా సునాయాసంగా నెగ్గింది.

దీప్ గ్రేస్ రిటైర్మెంట్



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ డిఫెండర్ దీప్ గ్రేస్ ఎక్కా అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. 2016 రియో, 2021 టోక్యో ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన 29 ఏళ్ల ఎక్కా పెనాల్టీ కార్నర్ స్పెషలిస్ట్‌గానూ పేరు తెచ్చుకుంది. 2011లో అరంగేట్రం చేసిన ఎక్కా 268 మ్యాచ్‌ల్లో 24 గోల్స్ చేసింది.

ఆస్ట్రేలియా లక్ష్యం 216

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా, వెస్టిండీస్ మధ్య రెండో టెస్ట్ (డే/నైట్) రసవత్తరంగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 13/1తో శనివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విండీస్ 193 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 22 రన్స్‌తో కలిపి మొత్తం 216 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ముందుంచింది. ఛేదనలో మూడో రోజు ఆట నిలిచే సమయానికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 60/2 స్కోరు చేసింది. విజయానికి ఆసీస్ ఇంకా 156 పరుగుల దూరంలో ఉంది.

అటూ..ఇటూ

పోప్ శతక పోరాటం ● రసవత్తరంగా తొలి టెస్టు

ఇంగ్లండ్‌కు 126 పరుగుల ఆధిక్యం

రెండో ఇన్నింగ్స్ 316/6 ● భారత్ మొదటి ఇన్నింగ్స్ 436



స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246 ఆలౌట్
భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి అండ్ బి) రూట్ 80; రోహిత్ (సి) స్టోక్స్ (బి) లీచ్ 24; గిల్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 23; రాహుల్ (సి) రెహాన్ (బి) హార్ట్‌లీ 86; శ్రేయాస్ (సి) హార్ట్‌లీ (బి) రెహాన్ 35; జడేజా (ఎల్బీ) రూట్ 87; భరత్ (ఎల్బీ) రూట్ 41; అశ్విన్ (రనౌట్) 1; అక్షర్ (బి) రెహాన్ 44; బుమ్రా (బి) రూట్ 0; సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 121 ఓవర్లలో 436 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-80, 2-123, 3-159, 4-223, 5-288, 6-356, 7-358, 8-436, 9-436, 10-436; బౌలింగ్: ఉడ్ 17-1-47-0; హార్ట్‌లీ 25-0-131-2; లీచ్ 26-6-63-1; రెహాన్ 24-4-105-2; రూట్ 29-5-79-4.
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (సి) రోహిత్ (బి) అశ్విన్ 31; డకెట్ (బి) బుమ్రా 47; పోప్ (బ్యాటింగ్) 148; రూట్ (ఎల్బీ) బుమ్రా 2; బెయిర్‌స్టో (బి) జడేజా 10; స్టోక్స్ (బి) అశ్విన్ 6; ఫోక్స్ (బి) అక్షర్ 34; రెహాన్ (బ్యాటింగ్) 16; **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 77 ఓవర్లలో 316/6; వికెట్ల పతనం:** 1-45, 2-113, 3-117, 4-140, 5-163, 6-275; **బౌలింగ్:** బుమ్రా 12-3-29-2; అశ్విన్ 21-3-93-2; అక్షర్ 15-2-69-1; జడేజా 26-1-101-1; సిరాజ్ 3-0-8-0.

1 ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు భారత బ్యాటర్లు (జైస్వాల్, రాహుల్, జడేజా) 80ల్లో అవుట్ కావడం ఇదే తొలిసారి.

2 టెస్టుల్లో రెండో ఉత్తమ ప్రదర్శన (4/79) కనబర్చిన రూట్. గతంలో భారత్‌పైనే 8 రన్స్‌కే ఐదు వికెట్లు తీశాడు.



ఒల్లీ పోప్ (148 బ్యాటింగ్)

ఆ క్యాచ్ పట్టి ఉంటే..

మూడో రోజు ఆటలో భారత బౌలర్లకు ఒల్లీ పోప్ కొరకరాని కొయ్యగా మారాడు. చూస్తుండగానే జట్టుకు భారీ ఆధిక్యం అందించే దిశగా దూసుకెళ్తున్నాడు. అయితే తను 110 రన్స్ వద్దే అవుట్ కావాల్సింది. జడేజా వేసిన ఇన్నింగ్స్ 64వ ఓవర్ మూడో బంతిని రివర్స్ స్వీప్‌తో ఫోర్ బాదాడు. తర్వాతి బంతిని సైతం అదే రీతిన ఆడగా బ్యాక్‌వర్డ్ స్క్వేర్‌లో అక్షర్ గాల్లోకి ఎగిరి అందుకునే ప్రయత్నం చేసినా బంతి అతడి చేతుల్లో నుంచి జారడంతో పోప్ బతికిపోయాడు.

హైదరాబాద్: తొలి ఇన్నింగ్స్‌లో భారత ఆధిక్యం 190.. బౌలర్ల ప్రతాపంతో ఇంగ్లండ్‌ను చుట్టేయడానికి ఈ మాత్రం స్కోరు సరిపోతుందిలే అని అంతా భావించారు. కానీ మైదానంలో జరిగింది వేరు.. పిచ్ బ్యాటింగ్‌కు అంతగా అనుకూలించకపోయినా.. ఒల్లీ పోప్ (148 బ్యాటింగ్) తన కెరీర్‌లోనే చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో అజేయ శతకం సాధించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్‌లో పట్టుదలగా ఆడి జట్టుకు 126 పరుగుల ఆధిక్యం అందించాడు. తద్వారా తమ జట్టు విజయంపైనా ఆశలు రేకెత్తిస్తూ మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చేశాడు. శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో 6 వికెట్లకు 316 పరుగులు సాధించింది. క్రీజులో పోప్‌తో పాటు రెహాన్ అహ్మద్ (16 బ్యాటింగ్) ఉన్నాడు. బెన్ డకెట్ (47), ఫోక్స్ (34), క్రాలే (31) పర్వాలేదనిపించారు. బుమ్రా, అశ్విన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఇక ఆదివారం ఆటలో కొత్త బంతితో భారత బౌలర్లు చెలరేగితేనే ఫలితం ఉంటుంది. అటు ఇంగ్లండ్ తమ ఆధిక్యానికి మరో 45-50 పరుగులు జోడిస్తే భారత్‌కు కష్టాలు తప్పవు. అంతకుముందు భారత్ ఓవర్‌నైట్ స్కోరు 421/7కు మరో 15 పరుగులే జత చేయగలిగింది. జడేజా (87), బుమ్రా (0)లను రూట్ ఒకే ఓవర్‌లో అవుట్ చేయగా, అక్షర్ (44)ను రెహాన్ దెబ్బతీశాడు. ఒక్క పరుగు కూడా చేయకుండానే ఈ వికెట్లన్నీ పడడం గమనార్హం. దీంతో జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 436 పరుగులకు ఆలౌటైంది. రూట్‌కు నాలుగు, రెహాన్, హార్ట్‌లీకి రెండేసి వికెట్లు దక్కాయి.

అదిరే ఆరంభం: తొలి గంటలోపే భారత్ ఇన్నింగ్స్‌ను ముగించిన ఇంగ్లండ్ 190 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. తిరిగి బజ్‌బాల్‌నే నమ్ముకున్న జట్టు వేగంగా పరుగులు సాధించింది. ఓపెనర్లు క్రాలే, డకెట్ స్వీప్ షాట్లతో చెలరేగి ఓవర్‌కు 5 రన్‌రేట్ చొప్పున మొదటి వికెట్‌కు 45 పరుగులు జోడించారు. క్రాలేను అశ్విన్ అవుట్ చేయగా.. డకెట్‌కు జత కలిసిన పోప్ భారత బౌలర్లను విసిగించాడు. రివర్స్ స్వీప్‌లతో స్పిన్నర్లపై ఒత్తిడి పెంచాడు. ఇక రెండో సెషన్‌లో ఇంగ్లండ్ తడబడడంతో నాలుగు వికెట్లు కోల్పోయింది. ఆరంభంలోనే డకెట్‌ను బుమ్రా బౌల్డ్ చేయడంతో రెండో వికెట్‌కు 57 బంతుల్లోనే 68 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే తన తర్వాతి ఓవర్‌లోనే రూట్ (2)ను సైతం ఎల్బీగా పెవిలియన్‌కు చేర్చాడు. బెయిర్‌స్టో (10) కెప్టెన్ స్టోక్స్(6) కూడా ఎలాంటి ప్రభావమూ చూపలేక వెనుదిరగడంతో ఇక ఇంగ్లండ్‌కు కష్టాలే అనిపించింది.

పోప్, ఫోక్స్ శతక భాగస్వామ్యం: 163/5 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడిన వేళ.. పోప్ మొండి పట్టుదలకు కీపర్ ఫోక్స్ నుంచి సహకారం అందింది. చెత్త బంతులను ఫోర్లుగా మలుస్తూ 48వ ఓవర్‌లో స్కోరును సమం చేశారు. వికెట్‌ను కాపాడుకుంటూనే ఆధిక్యాన్ని పెంచే ప్రయత్నం చేశారు. స్పిన్నర్లు జడేజా, అక్షర్ ఓవర్లలో పోప్ బౌండరీలతో పరుగులు రాబట్టాడు. 61వ ఓవర్‌లో పోప్ అద్భుత శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అయితే ఆరో వికెట్‌కు 112 పరుగుల భారీ భాగస్వామ్యం జత చేరాక ఫోక్స్‌ను అక్షర్ తక్కువ ఎత్తుతో వేసిన బంతితో బౌల్డ్ చేసి కాస్త రిలీఫ్ ఇచ్చాడు. అటు రెహాన్‌ను అండగా పోప్ తమ జట్టు ఆధిక్యాన్ని వంద దాటించడంతోపాటు స్కోరును సైతం 300కి చేర్చాడు. అదే ఆత్మవిశ్వాసంతో ఇద్దరూ మరో వికెట్ కోల్పోకుండా చక్కటి ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించారు.

ఖేలో ఇండియాలో తెలంగాణ హవా



నిషిక



తనిష్క్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ క్రీడాకారులు అదరగొడుతున్నారు. శనివారం చెన్నైలో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణ ప్లేయర్లు మూడు స్వర్ణాలు సాధించారు. తొలుత బాలుర ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో తనిష్క్ మురళీధర్ నాయుడు స్వర్ణం సాధించాడు. అనంతరం హైదరాబాద్ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ 800 మీటర్ల ఫ్రీ స్టయిల్‌లో పసిడితో మెరిసింది. ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ వాల్టింగ్ టేబుల్ విభాగంలో నిషిక అగర్వాల్ స్వర్ణం కొల్లగొట్టింది. ఓవరాల్ ఈ పోటీల్లో తెలంగాణ 9 స్వర్ణాలు సహా మొత్తం 15 మెడల్స్‌తో పతకాల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

రిథమ్ జోడీకి స్వర్ణం

ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్

కైరో (ఈజిప్ట్): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో రిథమ్ సంగ్వాన్ జోడీ భారత్‌కు తొలి స్వర్ణం అందించింది. శనివారం జరిగిన 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఫైనల్లో రిథమ్-ఉజ్వల్ మాలిక్ జంట 17-7తో అర్మేనియాకు చెందిన ఎల్మిరా-బెనిక్‌పై గెలిచింది. ఇక 10 మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్‌లో సోనమ్-అర్జున్ బబుటా జంట రజతం దక్కించుకొంది.

క్వార్టర్ ఫైనల్లో శ్రీజ



గోవా: వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ పోటీల్లో హైదరాబాద్ అమ్మాయి ఆకుల శ్రీజ క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించింది. శనివారం జరిగిన ప్రీక్వార్టర్స్ పోరులో శ్రీజ తనకంటే మెరుగైన ర్యాంకర్ డు హోయ్ కిమ్‌పై 3-1తో గెలిచింది. ఇక, మనికా బాత్రా, అర్చనా కామత్ నిష్క్రమించారు.

గుకేష్, ప్రజ్ఞానంద గేమ్ డ్రా

విజ్కాన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీలో ప్రజ్ఞానంద, గుకేష్ మధ్య గేమ్ డ్రాగా ముగిసింది. శనివారం జరిగిన 12వ రౌండ్ గేమ్‌లో 40 ఎత్తుల అనంతరం గుకేష్, ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నారు. దీంతో 12 రౌండ్ల నుంచి గుకేష్ 7.5 పాయింట్లతో సంయుక్తంగా టాప్‌లో ఉండగా.. ప్రజ్ఞానంద 7 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నాడు.

హైదరాబాద్ ఇన్నింగ్స్ గెలుపు

వరుసగా నాలుగో విజయం
అరుణాచల్‌తో రంజీ

హైదరాబాద్: తన్మయ్ అగర్వాల్ (181 బంతుల్లో 34 ఫోర్లు, 26 సిక్స్‌లతో 366) భారీ స్కోరుతో.. రంజీల్లో హైదరాబాద్ వరుసగా నాలుగో విజయాన్ని సొంతం చేసుకొంది. ప్లేట్ గ్రూప్‌లో అరుణాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 187 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆటకు రెండో రోజైన శనివారం ఓవర్‌నైట్ స్కోరు 529/1తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 615/4 వద్ద డిక్లేర్ చేసింది.443 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన అరుణాచల్ 256 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో అరుణాచల్ 172 రన్స్ చేసింది. కాగా, ట్రిపుల్ సెంచరీ చేసిన అగర్వాల్.. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఓ ఇన్నింగ్స్‌లో అత్యధికంగా 26 సిక్సర్లు బాదిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 2015లో న్యూజిలాండ్ క్రికెటర్ కొలిన్ మన్రో 23 సిక్స్‌లు కొట్టాడు.

బిజినెస్

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 74 శాతానికి జీఎంఆర్ వాటా

మలేషియా కంపెనీ నుంచి తాజాగా 11% వాటా కొనుగోలు
డీల్ విలువ రూ.830 కోట్లు

న్యూఢిల్లీ: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జీఎంఆర్ గ్రూప్ తన వాటాను మరో 11 శాతం పెంచుకుంది. దాంతో జీఎంఆర్ వాటా 63 శాతం నుంచి 74 శాతానికి పెరిగింది. మలేషియా ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ బెర్హాద్ (ఎంఏహెచ్‌బీ) గ్రూప్ నుంచి ఈ వాటాను 10 కోట్ల డాలర్లకు (రూ.830 కోట్లు) చేజిక్కించుకుంది. దీంతో హైదరాబాద్ విమానాశ్రయం నుంచి మలేషియా గ్రూప్ పూర్తిగా వైదొలిగినట్లయిందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ తెలిపింది. జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్)లో 11 శాతం వాటా కొనుగోలుకు సంబంధించి ఎంఏహెచ్‌బీ, అనుబంధ సంస్థ ఎంఏహెచ్‌బీ (మారిషస్) ప్రైవేట్ లిమిటెడ్‌తో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్) గత ఏడాది అక్టోబరు 25న షేర్ పర్చేజ్ ఒప్పందం కుదుర్చుకుంది. కాగా, హైదరాబాద్ విమానాశ్రయంలోని మిగతా 26 శాతం వాటాలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), తెలంగాణ ప్రభుత్వం చెరో 13 శాతం కలిగి ఉన్నాయి.

మజూరీ చార్జీలపై 50% తగ్గింపు: జోయాలుక్కాస్

హైదరాబాద్: ప్రముఖ జువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్.. వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా అన్ని రకాల జువెలరీపై మజూరీ చార్జీల్లో (వీ.ఏ) ఫ్లాట్ 50 శాతం తగ్గింపును ఇస్తున్నట్లు ప్రకటించింది. బంగారం, వజ్రాలు, ప్రీషియస్ స్టోన్స్, వెండి సహా విస్తృత శ్రేణి ఆభరణాలకు ఈ ప్రత్యేక ఆఫర్ వర్తిస్తుందని జోయాలుక్కాస్ తెలిపింది. వినియోగదారులకు సాటిలేని జువెలరీ షాపింగ్ అనుభవాన్ని అందించాలన్న ఉద్దేశంతో వీ.ఏపై 50 శాతం తగ్గింపును ప్రకటించినట్లు జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జోయ్ ఆలుక్కాస్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జోయాలుక్కాస్ షోరూమ్‌ల్లో ఫిబ్రవరి 18 వరకు ఈ ప్రత్యేక ఆఫర్ అందుబాటులో ఉంటుందని ఆయన వెల్లడించారు. అలాగే వినియోగదారులకు ప్రతి కొనుగోలుపై ఉచిత జీవిత కాలం నిర్వహణ, ఏడాది ఉచిత బీమా, బైబ్యాక్ హామీ సహా మరికొన్ని అదనపు ప్రయోజనాలను అందిస్తున్నట్లు జోయాలుక్కాస్ తెలిపింది.

Joyalukkas
World's favourite jeweller

ఫ్లిప్‌కార్ట్ బోర్డు నుంచి బిన్నీ బన్సల్ ఎగ్జిట్

న్యూఢిల్లీ: ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన బిన్నీ బన్సల్ కంపెనీ బోర్డు నుంచి వైదొలిగారు. దాంతో ఫ్లిప్‌కార్ట్‌లో బిన్నీ బన్సల్ 16 ఏళ్ల ప్రస్థానానికి తెరపడినట్లైంది. బన్సల్ కొద్ది నెలలక్రితమే ఫ్లిప్‌కార్ట్‌లో తనకున్న అతి స్వల్ప వాటాను విక్రయించాడు. అంతేకాదు, ఈ మధ్యనే ఆయన ఆప్‌డోర్ పేరుతో ఈ-కామర్స్ కంపెనీలకు ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్ అందించే స్టార్టప్‌ను ప్రారంభించారు. ఈ-కామర్స్ రంగంలోనే కొత్త స్టార్టప్ ప్రారంభించడంతో పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు దారితీయవచ్చన్న కారణంగానే బిన్నీ బన్సల్ ఫ్లిప్‌కార్ట్ నుంచి పూర్తిగా బయటికి వచ్చినట్లు తెలిసింది. కాగా, 2018లో ప్రపంచ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ ఫ్లిప్‌కార్ట్‌లో మెజారిటీ వాటాను 1,600 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది.

మధ్యంతర బడ్జెట్‌పై గంపెడాశలు



వృద్ధికే పెద్ద పీట వేయాలని ఇండియా ఇంక్ విజ్ఞప్తి

'వచ్చేది మధ్యంతర బడ్జెట్. ఈ బడ్జెట్‌లో అద్భుత ప్రకటనలు ఏమీ ఉండవు. కాబట్టి పెద్దగా ఆశలు పెట్టుకోకండి' అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే ప్రకటించారు. అయినా కార్పొరేట్ రంగం ఈ బడ్జెట్‌పైనా గంపెడాశలు పెట్టుకుంది. జీడీపీ వృద్ధి రేటును మరింత పరుగులు పెట్టించేందుకు పన్ను రాయితీలతో పాటు దేశీయ తయారీకి ప్రోత్సాహం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరిన్ని నిధులు, మరిన్ని సామాజిక సంక్షేమ పథకాలు ప్రకటించాలని కోరుతోంది. వచ్చే కొద్ది సంవత్సరాల్లో భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే 'మధ్యంతర' బడ్జెట్‌లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి కొన్ని చర్యలు తీసుకోకతప్పదని పారిశ్రామిక వర్గాల వాదన. పెట్టుబడులకు పెద్దపీట వేస్తూనే ద్రవ్య లోటు అదుపు తప్పకుండా చూడడం ఆర్థిక మంత్రి ముందున్న అతి పెద్ద సవాల్ అని పేర్కొన్నాయి.

మరిన్ని రంగాలకు పీఎల్ఐ

దేశంలో అధునాత తయారీ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక జాతీయ మిషన్ ఏర్పాటు చేయాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తన బడ్జెట్ కోరికల చిట్టాలో ప్రభుత్వాన్ని కోరింది. దీనికి తోడు దేశంలో భారీ ఉపాధి అవకాశాలకు దోహదం చేసే దుస్తులు, ఆటబొమ్మలు, పాదరక్షల తయారీ రంగాలకూ పీఎల్ఐ పథకం విస్తరించాలని విజ్ఞప్తి చేసింది. ఉత్పాదక వస్తువులు, రసాయనాల దిగుమతులను తగ్గించే పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరింది. మరో పారిశ్రామిక, వాణిజ్య సంఘాల సమాఖ్య ఫిక్కీ మాత్రం వచ్చే మధ్యంతర బడ్జెట్‌లో భౌతిక, సామాజిక, డిజిటల్ మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వ పెట్టుబడులు మరింత పెంచాలని కోరింది.

సుంకాల పోటు తగ్గించండి

భారత్‌లో తయారీ అని ఎంతగా మొత్తుకుంటున్నా, మన దేశంలో వైద్య పరీక్షల కోసం ఉపయోగించే పరికరాల్లో ఇప్పటికీ 60 శాతం దిగుమతులే శరణ్యం. ఈ దిగుమతులపై విధిస్తున్న సుంకాలతో వాటి దిగుమతి ఖర్చులు తడిచి మోపెడవుతున్నాయి. దేశీయ ఉత్పత్తి ఒక స్థాయికి చేరేవరకైనా ఈ సుంకాలను సముచిత స్థాయికి తగ్గించాలని మెడికల్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంటాల్) చైర్మన్ పవన్ చౌదరి ఆర్థిక మంత్రి సీతారామన్‌ను కోరారు. లేకపోతే సామాన్యుడికి సైతం చౌకగా వైద్య సేవలు అందించేందుకు ఉద్దేశించిన 'ఆయుష్మాన్ భారత్' వంటి ప్రభుత్వ పథకాలు నీరుగారి పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

మరిన్ని పన్ను ప్రోత్సాహకాలు.

కాగా ఈసారి బడ్జెట్లో పన్ను మినహాయింపు పరిమితి పెంపు, మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతు, దీర్ఘకాలిక పన్ను విధానంతో పాటు వినియోగం, పొదుపు పెంచేందుకు చర్యలను ప్రకటించవచ్చని విశ్లేషకుల అంచనా. అంతేకాదు, కార్పొరేట్ కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు, లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్స్ (ఎల్ఎల్‌పీ)పై సమానంగా పన్ను విధించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

జెన్ టెక్నాలజీస్ లాభంలో ఐదింతల వృద్ధి

జెన్ టెక్నాలజీస్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ మొత్తం ఆదాయం మూడింతల వృద్ధితో రూ.34.8 కోట్ల నుంచి రూ.102.26 కోట్లకు పెరిగింది. మరోవైపు నికర లాభం కూడా ఐదింతలు వృద్ధి చెంది రూ.7.58 కోట్ల నుంచి ఏకంగా రూ.31.66 కోట్లకు పెరిగింది. కాగా క్యూఐపీ ద్వారా రూ.1,000 కోట్ల వరకు నిధులను సమీకరించేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

29న బవేజా స్టూడియోస్ ఇష్యూ ప్రారంభం

కంటెంట్ ప్రొడక్షన్ స్టూడియో బవేజా స్టూడియోస్ లిమిటెడ్.. పబ్లిక్ ఇష్యూలో భాగంగా ఒక్కో షేరు ధరను రూ.170-180గా ఖరారు చేసింది. ఈ ఇష్యూ ఈ నెల 29న ప్రారంభమైన ఫిబ్రవరి 1న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూ.10 ముఖ విలువతో కూడిన 54 లక్షల ఈక్విటీ షేర్లను కంపెనీ జారీ చేయనుంది. ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో కంపెనీ తన షేర్లను లిస్ట్ చేయనుంది. ఈ ఇష్యూకి ఫెడెక్స్ సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా వ్యవహరించనుంది.

భారీగా పెరిగిన ఒలెక్ట్రా లాభం

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 22.28 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.12.97 కోట్లు)తో పోల్చితే లాభం 72 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.250.12 కోట్ల నుంచి రూ.334.65 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు కూడా రూ.232.82 కోట్ల నుంచి రూ.304.73 కోట్లకు పెరిగినట్లు కంపెనీ పేర్కొంది. కాగా కంపెనీ నాన్- ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్ చిల్లప్పగారి లక్ష్మీ రాజం రాజీనామాను డైరెక్టర్ల బోర్డు ఆమోదించిందని, ఇది శనివారం నుంచే అమల్లోకి వచ్చిందని తెలిపింది.

దొడ్ల డెయిరీ లాభంలో 17 శాతం వృద్ధి

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో దొడ్ల డెయిరీ రూ.746.8 కోట్ల రెవెన్యూపై రూ.43.6 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం 10.6 శాతం (రూ.675.4 కోట్లు) వృద్ధి చెందగా లాభం 16.8 శాతం పెరిగింది. సమీక్షా కాలలో దేశీయ వ్యాపారం రూ.700.7 కోట్లుగా ఉండగా అంతర్జాతీయ వ్యాపారం రూ.46.1 కోట్లుగా ఉంది. త్రైమాసిక కాలంలో రోజుకు సగటున 17.5 లక్షల లీటర్ల పాలను సేకరించగా సగటు విక్రయాలు రోజుకు 10.7 లక్షల లీటర్లుగా ఉన్నట్లు కంపెనీ పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ		విజయవాడ	540
హైదరాబాద్	540	విశాఖపట్నం	565
28 జనవరి		వరంగల్	542
చిత్తూరు	573	దజను గుడ్లు రూ.72	
గోదావరి	540		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	గోదావరి	111
వరంగల్	107	విజయవాడ	111
కరీంనగర్	107	గుంటూరు	112
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	112
కర్నూలు	107	చిత్తూరు	120
విశాఖపట్నం	108		

www.andhrajyothy.com

ANDHRAJYOTHI

ఆదివారం | 28-1-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price): Rs. 8.00 | సంపుటి (Volume): 21 | సంచిక (Issue): 300

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వరంగల్

ఓయూ సహా పది వర్సిటీలకు కొత్త వీసీలు

ఉన్నత విద్యా శాఖ నోటిఫికేషన్ జారీ.. దరఖాస్తుకు ఫిబ్రవరి 12 తుది గడువు

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాలకు కొత్త వైస్ చాన్స్‌లర్(వీసీ)లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పది యూనివర్సిటీల వీసీల భర్తీకి సంబంధించి ఉన్నత విద్యాశాఖ శని వారం ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన వారు ఫిబ్రవరి 12వ తేదీ లోగా తమ

మిగతా 11వ పేజీలో...



ఉన్నత విద్యా సంస్థల గ్రేడింగ్‌కు

న్యాక్ స్వస్తి

ఇక మీదట అక్రెడిటెడ్, నాన్ అక్రెడిటెడ్‌గా విభజన

12

నాటి బాణమే.. నేటి బల్లెం!

చంద్రబాబు అండ్ కోను పెత్తందార్లుగా పోల్చుతూ పేదలను మభ్యపెట్టి లబ్ధి పొందాలనుకున్న ఏపీ సీఎం జగన్‌కు ఇప్పుడు షర్మిల రూపంలో బెడద వచ్చిపడింది. ఆయన నైజాన్ని ఆమె పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. దీంతో ఆయన ఉలిక్కిపడుతు న్నారు. ప్రస్తుత ఎన్నికల రణక్షేత్రంలో అన్నాచెల్లెలు నేరుగా తలపడుతున్నారు. జగన్ నోటి నుంచి వస్తున్న ప్రతి మాటకు షర్మిల కౌంటర్ ఇస్తున్నారు.

పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే షర్మిల నేరుగా తనను ఎటాక్ చేస్తుందని జగన్ ఊహించలేదు. ముఖంలో అమాయకత్వాన్ని ప్రదర్శిస్తూ.. తాను మంచి చేస్తుంటే తన ప్రత్యర్థులందరూ ఏకమై తనని ఒంటరి వాడిని చేస్తున్నారని ప్రజలను నమ్మించి సానుభూతి పొందాలనుకున్న జగన్ ప్రయత్నాలకు షర్మిల గండికొడుతున్నారు.



కొత్త పలుకు

ఇవాళో, రేపో 'హూ కిల్డ్ బాబాయ్?' అని కూడా షర్మిల ప్రశ్నించవచ్చు. రక్తం పంచుకుని పుట్టిన తనకు జగన్ రెడ్డి చేస్తున్న ద్రోహాన్ని కూడా ఆమె పూసగుచ్చినట్టు వివరిస్తు న్నారు. దోచుకోవడం, దాచుకోవడం మినహా ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచనే జగన్‌కు లేదనీ, రాష్ట్రంలో అభివృద్ధి కనుమరుగైందనీ, తమ తండ్రి రాజశేఖరరెడ్డి పాలనకు, జగన్ రెడ్డి పాలనకు పోలికే లేదనీ షర్మిల తేల్చిపారేశారు.

వేట కుక్కల కంటే హీనమైన సోషల్ మీడియా సైన్యాన్ని, తనపై ఈగ వాలనివ్వని ఉన్మాద మూకను ఇప్పుడు రక్తం పంచుకు పుట్టిన షర్మిలపైకి ఉసిగొల్పారు. దీంతో ఆమె వ్యక్తిత్వ హననం ప్రారంభమైంది. షర్మిల వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ విమర్శలు చేయడం మొదలెట్టారు. ఆమె మొదటి పెళ్లి గురించి కూడా ప్రస్తావిస్తున్నారు.

జగన్ కిరాయి మూక తనపై విమర్శలకు స్వస్తి చెప్పని పక్షంలో మరిన్ని రహస్యాలను షర్మిల బయటపెట్టవచ్చు. రాజశేఖర రెడ్డి కుటుంబం చీలిపోవడానికి జగన్ రెడ్డి కారణం అంటూ అందుకు తన తల్లి విజయలక్ష్మి సజీవ సాక్ష్యం అని చెప్పడం ద్వారా ప్రత్యర్థుల నోళ్లను ఆమె మూయిస్తున్నారు.

2

వివేకా హత్య కేసు గురించి కూడా షర్మిల నోటి వెంట కొన్ని నిజాలు బయటకు రావొచ్చు. సోదరుడితో విభేదాలు ముదరడానికి ప్రధాన కారణం భారతీరెడ్డి అనే భావనలో షర్మిల, డాక్టర్ సునీత ఉన్నారు. వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డి అరెస్టు కాకుండా తప్పించుకోగలిగారంటే అందుకు భారతీరెడ్డి అండదండలే కారణమని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కడప లోక్‌సభ స్థానం నుంచి వివేకానంద రెడ్డి భార్యను కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీకి పెట్టాలని షర్మిల భావిస్తున్నారు.

పిల్ల పెండ్లికి తులం బంగారం



10

- కళ్యాణమస్తు, షాదీముబారక్‌లో నగదుతో పాటే
- బడ్జెట్‌ను రూపొందించాలని రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలన్నీ ఒకే ప్రాంగణంలో
- నియోజకవర్గ కేంద్రాల్లో స్థలాల్ని అన్వేషించండి
- డైట్, కాస్మెటిక్ చార్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు
- బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లో లబ్ధిదారుల పెంపు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల సమీక్షలో సీఎం



కుల గణనకు వేళాయె!

రాష్ట్రంలో కులాలవారీ లెక్క తీసేందుకు సర్కారు సిద్ధం

అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ ఆదేశం

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే తీర్మానం దిశగా అడుగులు

న్యాయ సలహాతో పకడ్బందీగా ముందుకెళ్లాలని నిర్ణయం

ఎస్సీ, ఎస్టీ, బీసీల్లోనూ తేలనున్న ఉప కులాలు.. వాటి జనాభా

1931లో నిజాం పాలనలో గణాంకాలు.. మళ్లీ ఇప్పుడే

తమ్ముడిగా భావించి.. సీఎంగా మద్దతిచ్చారు

సీనియర్ల ఎదుట రేవంత్ వ్యాఖ్య.. తెలంగాణను పునర్నిర్మిస్తాం

మూసీ పునరుద్ధరణలో భాగం కండి.. బిల్డర్ల సదస్సులో సీఎం

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చినట్లు.. కుల గణనకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమైంది. రాష్ట్రంలో త్వరలో కుల గణన చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం కుల గణన నిర్ణయానికి కట్టుబడి ఉందని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ప్రభుత్వం సూచించినట్లు తెలుస్తోంది. ఇందుకు ఎదురయ్యే ఇబ్బందులు, తలెత్తే సమస్యలు సహా అన్ని వివరాలను బడ్జెట్ సమావేశాల్లోపు అందజేయాలని నిర్దేశించినట్లు సమాచారం. బడ్జెట్ సమావేశాల్లోనే కుల గణన అంశాన్ని ప్రస్తావించి.. ఆ మేరకు తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు

మిగతా 10వ పేజీలో...

కాళేశ్వరంపై నిపుణుల కమిటీ

కేంద్ర జల సంఘం, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, రాష్ట్రంలోని సాగునీటి శాఖ ఇంజనీర్లతో ఏర్పాటు

లోతైన అధ్యయనం.. నివేదిక ఆధారంగా చర్యలు

కృష్ణా జలాలు, ప్రాజెక్టులపై త్వరలోనే అఖిలపక్షం

బీఆర్ఎస్ హయాంలో ఏం చేశారనేది చర్చిద్దాం

నీటిపారుదల శాఖపై సమీక్షలో సీఎం రేవంత్

10



(అమరావతి- ఆంధ్రజ్యోతి)

షర్మిల ఎఫెక్ట్...

దిమ్మ తిరిగి అమ్మ ఒడికి!

షర్మిల దెబ్బతో జగన్ మైండ్ బ్లాక్.. శరణు వేడుతూ విజయమ్మకు ఫోన్!

నువ్వే దిక్కంటూ వేడుకోలు.. అండగా ప్రచారానికి రావాలని విన్నపం

కాదంటే తనకు ఎన్నికల్లో ఓటమి, జైలు జీవితం తప్పవని గగ్గోలు

దీన వచనాలతో కరిగిన కన్నతల్లి.. ప్రచారానికి వచ్చేందుకు ఓకే!

చెల్లి షర్మిల కొట్టిన దెబ్బకు ఏపీ సీఎం వైఎస్ జగన్‌కు దిమ్మ తిరిగి అమ్మ గుర్తొచ్చింది. అన్యథా శరణం నాస్తి.. నువ్వే దిక్కంటూ శరణుజొచ్చేలా చేసింది. జనం ఈసడించుకుంటున్నా, ఓటమి ఖాయమని స్పష్టంగా తెలుస్తూనే ఉన్నా ఇన్నాళ్లూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ వచ్చిన జగన్‌కు చెల్లి షర్మిల కోలుకోలేని షాక్ ఇస్తున్నారు. పీసీసీ పగ్గాలు చేపట్టిన దగ్గరి నుంచి ఆమె రోజు రోజుకూ డోస్ పెంచుకుంటూ పోతున్నారు. జగన్ అవినీతిని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు దారుణమైన ఆయన నైజాన్ని ఆమె సూటిగా బయటపెడుతుండటంతో జగన్ కాళ్ల కింద భూమి కదులుతోంది. జగన్ నుంచి తాను ఏమీ ఆశించ లేదని, ఆయనను ఏదీ కోరలేదని, అది నిజం కాకుంటే ఆ మాట అమ్మ విజయలక్ష్మితో చెప్పించాలంటూ శుక్రవారం సవాల్ విసిరిన షర్మిల.. శనివారం మరింత డోస్ పెంచారు. వైఎస్సార్ పార్టీలో అసలు వైఎస్సారే లేరని ఆమె తేల్చిపారేశారు. వై అంటే వైవీ సుబ్బారెడ్డి, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే రామకృష్ణారెడ్డి (సజ్జల) అంటూ సరికొత్త అన్వయం చెప్పారు. దోచుకోవడం, దాచుకోవడమే జగన్ పనిగా మారిందని మొదలెట్టి, వైఎస్ పాలనకు, జగన్ పాలనకు అసలు పోలికే లేదంటూ షర్మిల సూటిగా సుత్తి లేకుండా చేస్తున్న వ్యాఖ్యలు జనంలోకి విస్తృతంగా వెళుతున్నాయి. ప్రజల గుండెలకు సూటిగా తాకుతున్నాయి. ముఖ్యంగా వైఎస్ అభిమానులు ఆమె మాటలను పూర్తిగా విశ్వసిస్తున్నారు. నాలుగేళ్లలో విపక్షాలు అన్నీ కలిపి చేసిన విమర్శలు ఒక ఎత్తైతే.. గత కొద్ది రోజుల్లో షర్మిల చేస్తున్న అటాక్ అంతకు ఎన్నో రెట్లు అధికంగా ప్రభావం చూపుతోంది. దీంతో జగన్‌కు కూసాలు కదిలినట్టై మైండ్ బ్లాక్

మిగతా 9వ పేజీలో...



తెలంగాణ భవన్‌కు ఆటోలో వెళ్తున్న కేటీఆర్

బీజేపీని గెలిపించేందుకు కాంగ్రెస్ డమ్మీలు

ఆ రెండు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయి

మోదీని ఎదుర్కొనేది ప్రాంతీయ పార్టీలే

మంత్రివర్గంలో మైనారిటీలు ఏరీ?: కేటీఆర్

ఆటోడ్రైవర్ల సమస్యలు తెలుసుకునేందుకు తెలంగాణ భవన్‌కు ఆటోలో ప్రయాణం

11

1న ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం

కేబినెట్‌లోకి కోదండ?

విద్యాశాఖను కేటాయించే అవకాశం

మంత్రివర్గ విస్తరణకు సీఎం కసరత్తు

ఫిబ్రవరి తొలి వారంలో ముహూర్తం

ఆరుగురికి చోటు.. 'మైనారిటీ'పై సందిగ్ధం

ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, ఆమీర్ నియామకానికి గవర్నర్ ఆమోదం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రొఫెసర్ కోదండరాం

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సారథి, టీజేఎస్ చీఫ్, ఎమ్మెల్సీగా నామినేట్ అయిన కోదండరాంను.. మంత్రివర్గంలోకి తీసుకునే ఆలోచనలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది. కీలకమైన విద్యాశాఖను ఆయనకు కేటాయించే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. బడ్జెట్ సమావేశాల్లోపు పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని విస్తరించేందుకు సీఎం కసరత్తు చేస్తున్నారని చెబుతున్నారు. ఈ నెలాఖరులోపు కసరత్తును పూర్తి చేసి ఆమోదం కోసం అధిష్ఠానానికి పంపనున్నారని తెలుస్తోంది. అధిష్ఠానం ఆమోదంతో ఫిబ్రవరి తొలి వారంలో ఆయన తన క్యాబినెట్‌ను పూర్తి స్థాయిలో విస్తరించనున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం సీఎం సహా కేబినెట్‌లో 12 మంది ఉన్నారు. మరో ఆరుగురికి విస్తరణలో చాన్స్ దక్కనుంది. కాగా, టీజేఏసీ చైర్మన్ హోదాలో తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన కోదండరాంను.. రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ దూరం పెట్టిన సంగతి తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌కు బేషరతు మద్దతు ప్రకటించిన కోదండరాంను పార్టీ అధికారంలోకి వచ్చిన

మిగతా 10వ పేజీలో...

తవ్వినకొద్దీ ఆస్తులు

- శివబాలకృష్ణకు బినామీ పేర్లతో ఫ్లాట్లు, కంపెనీలు
- రియల్టీలో హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ పెట్టుబడులు
- బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ 400 కోట్లు?
- రిమాండ్ రిపోర్టులో వివరాలు వెల్లడించిన ఏసీబీ
- బినామీ ఆస్తులు, ఇతర అధికారుల పాత్రపై ఆరా
- శివ బాలకృష్ణను కస్టడీకి తీసుకునే యోచన

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కలకలం రేపిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్, రెరా కార్యదర్శి శివబాలకృష్ణ కేసులో తవ్వినకొద్దీ అక్రమాస్తులు బయటపడుతున్నాయి. ఏయే కంపెనీలు, ఎవరెవరి వద్ద శివబాలకృష్ణ లంచాలు తీసుకుని అక్రమంగా అనుమతులు ఇచ్చారనే విషయాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇప్పటిదాకా బయటపడిన ఆస్తులు, పత్రాల ఆధారంగా శివబాలకృష్ణ కూడబెట్టిన ఆస్తుల విలువ.. మార్కెట్ ప్రకారం రూ.400 కోట్లకుపైనే ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నప్పటికీ, దానికి రెండింతలు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఫిర్యాదులతో శివబాలకృష్ణ నివాసం సహా 18 ప్రాంతాల్లో ఏసీబీ ఏకకాలంలో సోదాలు నిర్వహించిన



శివబాలకృష్ణ

మిగతా 9వ పేజీలో...

నేడు రాజీనామా.. ప్రమాణం!

బీజేపీ మద్దతుతో బిహార్ సీఎంగా 7వ సారి నితీశ్

- అమిత్‌షా, జేపీ నడ్డా హాజరయ్యే అవకాశం
- బీజేపీకి రెండు డిప్యూటీ సీఎంలు, స్పీకర్ పదవి
- నితీశ్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించింది..
- ఇండియా కూటమితో పొత్తు ఖతం: జేడీయూ
- ఖర్గే ఫోన్ చేసినా నితీశ్ మాట్లాడలేదు: జైరాం

న్యూఢిల్లీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు బీజేపీ మద్దతుతో ఏడోసారి బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా హాజరు కావచ్చని తెలుస్తోంది. 2022 ఆగస్టులో బీజేపీని వీడి ఆర్జేడీతో చేతులు కలిపి సీఎం పగ్గాలు చేపట్టిన నితీశ్ కుమార్ ఇప్పుడు.. ఆర్జేడీకి మొండిచేయి చూపి మళ్లీ బీజేపీతో కలువనున్నారు. ఈ మేరకు సీఎం పదవికి ఆదివారం ఉదయం ఆయన రాజీనామా చేసే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బిహార్‌లో జేడీయూను చీల్చి తనను పదవి నుంచి దించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారంతోనే ఆయన మళ్లీ బీజేపీ చెంతకు చేరుతున్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. నితీశ్ నేతృత్వంలో జేడీయూ ఎమ్మెల్యేలు పట్నాలో సమావేశమయ్యారు. మరోవైపు, ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఆయన నివాసంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, లోక్ జనశక్తి

మిగతా 12వ పేజీలో...



కేంద్ర మంత్రి అశ్విని చౌబేతో కలిసి ఆలయంలో పూజలు చేస్తున్న నితీశ్

ఎమ్మెల్యేకు రూ. 25 కోట్లు

బీజేపీ మా శాసనసభ్యులు ఏడుగురిని కొనాలని చూసింది

12

మద్యం స్కాంలో నన్ను అరెస్టు చేసి ఢిల్లీ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర: కేజ్రీ

'ఇండియా'లో ఆగని మంటలు.. మరింతగా అంతర్గత కుమ్ములాట

11 సీట్లే ఇస్తాం: అఖిలేశ్.. సీట్ల కోసమే కాంగ్రెస్ వల: డీఎంకే

సయోధ్య కుదరని పని: మమత.. ఐక్యతకు కృషి చేస్తున్నాం: ఖర్గే

సరిహద్దు వివాదాల పరిష్కారానికి

జాయింట్ సర్వే

అటవీ, గిరిజన, వ్యవసాయ శాఖలతో భేటీలో ధరణి కమిటీ అభిప్రాయం

రైతుబంధు పథకంపై సుదీర్ఘంగా ఆరా

రెవెన్యూ డేటానే కీలకం: వ్యవసాయ శాఖ

ధరణిలో మా భూములు మిస్సయ్యాయి..

పోర్టల్‌తో సంబంధం లేదు: అటవీశాఖ

వచ్చే వారం సర్వే, దేవాదాయ, వక్ఫ్‌బోర్డుతో ధరణి కమిటీ సమావేశం

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అటవీ, రెవెన్యూ సరిహద్దు భూముల వివాదాల పరిష్కారానికి జాయింట్ సర్వే తప్పనిసరి అని ధరణి కమిటీ అభిప్రాయపడింది. శనివారం సచివాలయంలో అటవీ, వ్యవసాయ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో ధరణి కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు అనేక అనుమానాలను

మిగతా 12వ పేజీలో...

ఆర్కే RK



కొత్తపలుకు

నాటి బాణమే.. నేటి బల్లెం!

తాడేపల్లి ప్యాలెస్ వణుకుతోంది. పులి మీద పుట్రలా ఎన్నికల ముంగిట ఈ తలపోటు ఏమిటా? అని కలవరపడుతోంది. అధికారం ఉపయోగించి చంద్రబాబును, ఆయన దత్తపుత్రుడిని ముప్పుతిప్పలు పెడుతున్నామని సంతోషిస్తున్న వేళ, ఇంటిపోరు తలపోటుగా మారుతోందని ఆవేదన చెందుతోంది. 2019 తర్వాత తాడేపల్లి ప్యాలెస్ ఇంతలా వణకడం ఇప్పుడే అని అంతఃపుర భోగట్టా. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఇంతలా కలవరపాటుకు గురిచేస్తున్నది మరెవరో కాదు.. ఆయన సొంత చెల్లి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలనే. తెలంగాణలో సొంత పార్టీ ఏర్పాటు చేసుకుని రాజకీయ రణక్షేత్రంలో తేలిపోయిన షర్మిల, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలోకి అడుగిడినా తమకు కలిగే నష్టం ఏమీ ఉండదని జగన్ అండ్ కో ఇప్పటిదాకా తలపోశారు. అయితే వారి అంచనాలకు భిన్నంగా షర్మిల ఇప్పుడు జగన్మోహన్ రెడ్డినే ప్రత్యేకంగా టార్గెట్ చేసుకుని విమర్శలు చేస్తున్నారు. చంద్రబాబు అండ్ కోను పెత్తందార్లుగా పోల్చుతూ పేదలను మభ్యపెట్టి లబ్ధి పొందాలనుకున్న జగన్‌కు ఇప్పుడు షర్మిల రూపంలో బెడద వచ్చిపడింది. ముఖ్యమంత్రి నైజాన్ని ఆమె పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. దీంతో ఆయన ఉలిక్కిపడుతున్నారు. ప్రస్తుత ఎన్నికల రణక్షేత్రంలో అన్నాచెల్లెలు నేరుగా తలపడుతున్నారు. జగన్ నోటి నుంచి వస్తున్న ప్రతి మాటకు షర్మిల కౌంటర్ ఇస్తున్నారు. దీంతో జగన్ శిబిరం ఆత్మరక్షణలో పడిపోయింది. తనకు వ్యతిరేకంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేతులు కలిపిన వేళ ఇంటిగుట్టు రచ్చకెక్కడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు. పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే షర్మిల నేరుగా తనను ఎటాక్ చేస్తుందని జగన్ ఊహించలేదు. ముఖంలో అమాయకత్వాన్ని ప్రదర్శిస్తూ.. తాను మంచి చేస్తుంటే తన ప్రత్యర్థులందరూ ఏకమై తనని ఒంటరి వాడిని చేస్తున్నారని ప్రజలను నమ్మించి సానుభూతి పొందాలనుకున్న జగన్ ప్రయత్నాలకు షర్మిల గండికొడుతున్నారు. అందరూ కాకపోయినా చాలామంది అనుకుంటున్నట్టు జగన్ మంచివాడు కాదనీ, రాజశేఖర రెడ్డి కుటుంబం చీలిపోవడానికి అతడే కారణమని షర్మిల తేల్చిపడేశారు. ఇవాళో, రేపో 'హూ కిల్డ్ బాబాయ్?' అని కూడా ప్రశ్నించవచ్చు. రక్తం పంచుకుని పుట్టిన తనకు జగన్‌రెడ్డి చేస్తున్న ద్రోహాన్ని కూడా ఆమె పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. దోచుకోవడం, దాచుకోవడం మినహా ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచనే జగన్‌కు లేదనీ, రాష్ట్రంలో అభివృద్ధి కనుమరుగైందనీ, తమ తండ్రి రాజశేఖరరెడ్డి పాలనకు, జగన్‌రెడ్డి పాలనకు పోలికే లేదనీ షర్మిల తేల్చిపారేశారు. ఆమె విమర్శల ప్రభావం ప్రజలపై ఎంత మేర ఉంటుంది? అధికార, ప్రతిపక్షాలలో ఎవరికి ఎక్కువ నష్టం చేస్తుందో తేలవలసి ఉన్నప్పటికీ ప్రస్తుతానికైతే జగన్‌కు మనశ్శాంతి లేకుండా పోయింది. మరోవైపు రానున్న ఎన్నికల్లో పార్టీ టికెట్ల తిరస్కరణకు గురైన ఎమ్మెల్యేలు ధిక్కార స్వరాలు వినిపిస్తున్నారు.

> “ దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా రికార్డులకు ఎక్కి కూడా తనను పేదల ప్రతినిధిగానే చెప్పుకోవడం మరో జగన్మాయ. గతంలో కమ్యూనిస్టు పార్టీలకు నాయకత్వం వహించిన పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి, మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావు వంటి వారు భూస్వాముల కుటుంబాల నుంచి వచ్చినప్పటికీ తమ ఆస్తులను పేదలకు పంచి వారి కోసం పోరాడారు. ఇప్పుడు ఈ నయా పేదల ప్రతినిధి అయిన జగన్మోహన్ రెడ్డి పేదల తరపున మాట్లాడుతూ అపర కుబేరుడిగా అవతరిస్తున్నారు. ఇది జగన్ మార్కు రాజకీయం. అందుకే తర తమ భేదం లేకుండా తన దారికి అడ్డు చెప్పే వారందరినీ పెత్తందారులుగా చిత్రించే పనిలో బిజీగా ఉంటారు. ఈ ఐదేళ్లలో పేదలకు జరిగిన మేలెంత? జగన్‌కు జరిగిన మేలెంతో లెక్కగట్టి నిగ్గు తేల్చితే అసలైన పెత్తందారుడు ఎవరో తేలిపోతుంది.

భారతి లండన్ టూర్ రద్దు!

షర్మిల రంగ ప్రవేశం చేసి అంతఃపుర రహస్యాలను బట్టబయలు చేస్తుండటంతో జగన్‌కు నిద్రపట్టని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. నిజానికి ముఖ్యమంత్రి భార్య భారతీరెడ్డి ఈ వారంలో లండన్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. అయితే పార్టీలో అంతర్గత పోరుకు తోడు అంతఃపుర రహస్యాలను కూడా షర్మిల పూసగుచ్చినట్టు చెబుతూ రావడంతో భర్త జగన్‌కు ఈ పరిస్థితులలో తోడుగా ఉండడం కోసం ఆమె తన పర్యటనను రద్దు చేసుకున్నారు. దీన్నిబట్టి షర్మిల ఎటాక్ ప్రభావం జగన్‌రెడ్డిపై తీవ్రంగానే ఉందని అర్థం చేసుకోవచ్చు. అధికార బలంతో ప్రత్యర్థులను కేసులలో ఇరికిస్తూ, కుట్రలు, కుయుక్తులతో ప్రతిపక్షాలపై దుష్ప్రచారం చేస్తూ ఇంతకాలం పబ్బం గడుపుతూ వచ్చిన జగన్, ఇప్పుడు తన సోదరే తన నిజ స్వరూపాన్ని విడమర్చి చూపిస్తూ రావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రత్యర్థుల ఆరోపణలకు, విమర్శలకు సమాధానం చెప్పలేని పరిస్థితి ఉన్నప్పుడు ఎదురుదాడి చేయడం వైఎస్ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు తండ్రి బాటలోనే జగన్మోహన్ రెడ్డి కూడా ఎదురుదాడినే ఎంచుకున్నారు. వేట కుక్కల కంటే హీనమైన సోషల్ మీడియా సైన్యాన్ని, తనపై ఈగ వాలనివ్వని ఉన్మాద మూకను ఇప్పుడు రక్తం పంచుకు పుట్టిన షర్మిలపైకి ఉసిగొల్పారు. దీంతో ఆమె వ్యక్తిత్వ హననం ప్రారంభమైంది. షర్మిల వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ విమర్శలు చేయడం మొదలెట్టారు. ఆమె మొదటి పెళ్లి గురించి కూడా ప్రస్తావిస్తున్నారు. ఆమె రెడ్డి ఎలా అవుతారని ప్రశ్నిస్తున్నారు. మంత్రులతో పాటు సజ్జల అండ్ కో కూడా రంగంలోకి దిగి ఆమెను తిట్టిపోస్తున్నారు. అయితే షర్మిల తనపై వచ్చిన విమర్శలకు బెదరకుండా జగన్మోహన్ రెడ్డి నైజాన్ని పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. గతంలో తాను ఎందుకు పాదయాత్ర చేయవలసి వచ్చిందో, ఎవరు కోరితే పాదయాత్ర చేశానో కూడా వివరిస్తూ భారతీరెడ్డి పాత్రను కూడా బయటపెడుతున్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్‌రెడ్డి ఎలా మారిపోయారో చెప్పుకొస్తున్నారు. గడచిన ఐదేళ్లలో తాను రెండే పర్యాయాలు తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లిన విషయాన్ని గుర్తుచేస్తూ, తాను ఏమీ ఆశించకుండానే జగన్‌రెడ్డి కోసం పనిచేశానని చెప్పారు. జగన్ కిరాయి మూక తనపై విమర్శలకు స్వస్తి చెప్పని పక్షంలో మరిన్ని రహస్యాలను ఆమె బయటపెట్టవచ్చు. రాజశేఖర రెడ్డి కుటుంబం చీలిపోవడానికి జగన్‌రెడ్డి కారణం అంటూ అందుకు తన తల్లి విజయలక్ష్మి సజీవ సాక్ష్యం అని చెప్పడం ద్వారా ప్రత్యర్థుల నోళ్లను ఆమె మూయిస్తున్నారు. షర్మిల తన ఇంటి పేరును వైఎస్‌గా చెప్పుకోవడాన్ని కూడా జగన్ మద్దతుదారులు ప్రశ్నిస్తున్నారు. దీంతో రాజశేఖర రెడ్డి బిడ్డగా తనకు ఆ హక్కు ఉందని, తన కుమారుడికి రాజశేఖర రెడ్డి స్వయంగా తన తండ్రి రాజారెడ్డి పేరు పెట్టిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి నుంచి తాను ఏమీ ఆశించలేదని, తాను ఏదైనా ఆశించి ఉంటే ఆ మాట తన తల్లి విజయలక్ష్మితో చెప్పించగలరా అని సూటిగా ప్రశ్నించడంతో జగన్ శిబిరం ఆత్మరక్షణలో పడిపోయింది. 'పులి కడుపున పులే పుడుతుంది' అంటూ తాను రాజశేఖర రెడ్డి వారసురాలినే అని చెప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. మొండితనం విషయంలో జగన్ కంటే షర్మిల రెండు ఆకులు ఎక్కువే చదివారు. అయితే అధికారం తోడు కావడంతో రాజశేఖర రెడ్డి కుటుంబంలో అత్యధికులు జగన్‌రెడ్డితోనే ఉన్నారు. షర్మిల ఒక రకంగా ఒంటరి వారు అయ్యారు. అయినా ఆమె అదరడం లేదు బెదరడం లేదు. తనపై షర్మిల విమర్శల పదును పెరగడంతో స్వయంగా జగన్‌రెడ్డి రంగంలోకి దిగి చంద్రబాబు తరఫున ఆమె కూడా స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయాలలో ఒక కుటుంబంలోని వాళ్లు, ఒకే రక్తం పంచుకు పుట్టిన వాళ్లు పరస్పరం తలపడటం కొత్త కాదు. అయితే ప్రస్తుత పరిస్థితి వేరు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగలిగారంటే అందుకు రాజశేఖర రెడ్డే కారణం. ఇప్పుడు షర్మిలను కాంగ్రెస్ పార్టీ ఆదరించి పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టినా అందుకూ రాజశేఖర రెడ్డే కారణం. వైఎస్ రాజశేఖర రెడ్డి బిడ్డలు కాకపోయి ఉంటే వీరిరువురూ ప్రస్తుతం ఈ పొజిషన్లలో ఉండేవారు కారు. ఈ నేపథ్యంలో అన్నాచెల్లెలి మధ్య పోరు ఆసక్తికరంగా మారింది. రాజశేఖర రెడ్డి మరణానంతరం జగన్‌రెడ్డి సానుభూతిని పోగేసుకొని కాంగ్రెస్ ఓటు బ్యాంకును హైజాక్ చేశారు. దీంతో తాము కోల్పోయిన ఓటు బ్యాంకును తిరిగి పొందడానికి కాంగ్రెస్ పార్టీ షర్మిలను చేరదీసింది. ఈ క్రమంలోనే దళిత క్రైస్తవులను ఆకట్టుకోవడం కోసం దళితులపై జగన్‌ది కపట ప్రేమ అని షర్మిల చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గం షర్మిల వైపు ఆకర్షితులు కాకుండా ఉండడం కోసం షర్మిల భర్త అనిల్ కుమార్ బ్రాహ్మణుడు అని, ఆమె ఇకపై ఎంత మాత్రం రెడ్డి కాబోరని జగన్ అనుకూల శక్తులు సరికొత్త లాజిక్‌ను తెర మీదకు తెచ్చాయి. 2019 ఎన్నికలకు ముందు జగన్ తరఫున ప్రచారం చేసి పెట్టిన షర్మిలను రెడ్డి కాదని ఎవరూ వేలెత్తి చూపకపోవడం గమనార్హం. రాజశేఖర రెడ్డి బిడ్డ అనే ప్రొజెక్ట్ చేశారు. ఆనాడు జగనన్న కోసం పనిచేసిన బాణం ఇప్పుడు పక్కలో బల్లెం అయ్యేసరికి ఆమె భర్త కుల నేపథ్యాన్ని తెర మీదకు తెచ్చారు. అవసరానికి అనుగుణంగా కులాలను వాడుకోవడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య. తన మేనత్తలు దళితులనే పెళ్లి చేసుకున్నారని చెబుతూ దళితులను బుట్టలో వేసుకొనే ప్రయత్నం చేశారు. దీనికి కౌంటర్‌గా దళితుడినే చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని పక్కన పెట్టుకొని తిరుగుతున్న జగన్.. దళితులకు ఆత్మబంధువు ఎలా అవుతారని షర్మిల ప్రశ్నిస్తున్నారు. క్రైస్తవుల ఓట్లను, ముఖ్యంగా దళిత క్రైస్తవుల ఓట్లను తిరిగి కాంగ్రెస్ పార్టీ వైపు తెచ్చుకోవడానికి షర్మిల భర్త బ్రదర్ అనిల్ సహజంగానే ప్రయత్నిస్తారు. ఈ కారణంగానే షర్మిల వల్ల రాజకీయంగా తనకు నష్టం జరుగుతుందని జగన్‌రెడ్డి ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల వేళ ప్రత్యర్థులు అందరూ ఒక్కటై జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా మోహరిస్తున్న వేళ అండగా ఉండాల్సిన సోదరి అంతఃపుర రహస్యాలను బయటపెడుతూ చికాకు పెట్టడాన్ని జగన్ శిబిరం జీర్ణించుకోలేకపోతున్నది. జగన్‌రెడ్డి స్వయంకృతాపరాధం వల్లనే ఈ పరిస్థితి వచ్చింది. తాను జైలులో ఉన్నప్పుడు తన కోసం కాలికి బలపం కట్టుకుని తిరిగిన సోదరి షర్మిలను అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయంగా ఆదరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. షర్మిలను రాజకీయంగా నిరోధించడంతో పాటు ఆస్తులను కూడా పంచి ఇవ్వకపోవడంతో అన్నాచెల్లెళ్ల మధ్య పూడ్చలేని అగాధం ఏర్పడింది. పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే, తన కుమారుడి నిశ్చితార్థానికి మర్యాద కోసం సోదరుడు జగన్‌ను షర్మిల ఆహ్వానించారు. అయితే ఆమె తన ఇంటికి వచ్చి ఆహ్వానిస్తే భారతీయ జనతా పార్టీ పెద్దలకు ఆగ్రహం వస్తుందని చెప్పి 'ఇంటికి రావొద్దు' అని చెల్లికి జగన్ చెప్పించారు. ఇంట్లోకి రానివ్వకపోతే గడప వద్దే ఆహ్వాన పత్రిక పెట్టి వెళ్లిపోతానని షర్మిల హెచ్చరించడం విదితమే.

> “ తమిళనాడులో కరుణానిధి–జయలలిత నాటి రాజకీయాల పట్ల మక్కువ పెంచుకున్న జగన్మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అదే ఒరవడి కొనసాగాలని కోరుకుంటున్నారు. ఇప్పటివరకు ఆయన హిట్ లిస్ట్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, రాధాకృష్ణ, రామోజీరావు మాత్రమే ఉన్నారు. ఇకపై ఈ జాబితాలో షర్మిల కూడా చేరతారు.



akbar

> “ రాజశేఖర రెడ్డి మరణానంతరం జగన్‌రెడ్డి సానుభూతిని పోగేసుకొని కాంగ్రెస్ ఓటు బ్యాంకును హైజాక్ చేశారు. దీంతో తాము కోల్పోయిన ఓటు బ్యాంకును తిరిగి పొందడానికి కాంగ్రెస్ పార్టీ షర్మిలను చేరదీసింది. ఈ క్రమంలోనే దళిత క్రైస్తవులను ఆకట్టుకోవడం కోసం దళితులపై జగన్‌ది కపట ప్రేమ అని షర్మిల చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గం షర్మిల వైపు ఆకర్షితులు కాకుండా ఉండడం కోసం షర్మిల భర్త అనిల్ కుమార్ బ్రాహ్మణుడు అని, ఆమె ఇకపై ఎంత మాత్రం రెడ్డి కాబోరని జగన్ అనుకూల శక్తులు సరికొత్త లాజిక్‌ను తెర మీదకు తెచ్చాయి. 2019 ఎన్నికలకు ముందు జగన్ తరఫున ప్రచారం చేసి పెట్టిన షర్మిలను రెడ్డి కాదని ఎవరూ వేలెత్తి చూపకపోవడం గమనార్హం. రాజశేఖర రెడ్డి బిడ్డ అనే ప్రొజెక్ట్ చేశారు. ఆనాడు జగనన్న కోసం పనిచేసిన బాణం ఇప్పుడు పక్కలో బల్లెం అయ్యేసరికి ఆమె భర్త కుల నేపథ్యాన్ని తెర మీదకు తెచ్చారు. తన మేనత్తలు దళితులనే పెళ్లి చేసుకున్నారని చెబుతూ దళితులను బుట్టలో వేసుకొనే ప్రయత్నం చేశారు. దీనికి కౌంటర్‌గా దళితుడినే చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని పక్కన పెట్టుకొని తిరుగుతున్న జగన్.. దళితులకు ఆత్మబంధువు ఎలా అవుతారని షర్మిల ప్రశ్నిస్తున్నారు.

కడప బరిలో సౌభాగ్యమ్మ?

మొత్తమ్మీద షర్మిల కుమారుడి నిశ్చితార్థానికి జగన్ దంపతులు తాడేపల్లి ప్యాలెస్ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. అయితే అక్కడ తమకు షర్మిల దంపతుల నుంచి సాదర స్వాగతం లభించలేదని జగన్ దంపతులు కినుకతో ఉన్నారు. ఇదంతా ఆ ఇంటి రామాయణం. ఇప్పుడు ఆ రామాయణమే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో చర్చనీయాంశం అవుతోంది. రాష్ట్ర రాజకీయాలలోకి షర్మిల ఎంట్రీ జగన్‌రెడ్డి భయపడుతున్నట్టుగా ఆయనకు నష్టం చేస్తుందా.. లేదా అన్నది వేచి చూడాలి. ఆ ఇంటి పోరు ఇకపై ఏ మలుపులు తిరుగుతుందో తెలియదు. వివేకానంద రెడ్డి హత్య కేసు గురించి కూడా షర్మిల నోటి వెంట కొన్ని నిజాలు బయటకు రావొచ్చు. సోదరుడితో విభేదాలు ముదరడానికి ప్రధాన కారణం భారతీరెడ్డి అనే భావనలో షర్మిల గానీ, డాక్టర్ సునీత గానీ ఉన్నారు. వివేకా హత్య కేసులో అవినాశ్ రెడ్డి అరెస్టు కాకుండా తప్పించుకోగలిగారంటే అందుకు భారతీరెడ్డి అండదండలే కారణమని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కడప లోక్‌సభ స్థానం నుంచి వివేకానంద రెడ్డి భార్యను కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీకి పెట్టాలని షర్మిల భావిస్తున్నారు. అవినాశ్ రెడ్డిని ఓడించే అవకాశం ఉన్నప్పుడే ఏ పార్టీ తరఫు నుంచైనా తన తల్లి సౌభాగ్యమ్మను పోటీ పెట్టడం మంచిదని, ఓడించే పరిస్థితి లేకపోతే పోటీకి దింపడం అనవసరం అని డాక్టర్ సునీత దంపతులు భావిస్తున్నట్టు తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి మరో నెల రోజులకు పైగా వ్యవధి ఉంది. ఆలోపు ఏం జరుగుతుందో తెలియదు. ప్రస్తుతానికైతే షర్మిల తన మిషన్‌లో కొంత మేర సఫలమయ్యారు. రాష్ట్ర విభజన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో నిస్తేజంగా ఉన్న కాంగ్రెస్ నాయకులలో, కార్యకర్తల్లో ఆమె కొంత కదలిక తీసుకురాగలిగారు. తెలంగాణలో తాజాగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున దాని ప్రభావం కూడా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది. అదే జరిగితే జగన్‌రెడ్డి ఓటు బ్యాంకుకు కొంతమేర గండిపడే అవకాశం ఉంది. ఈ కారణంగానే చంద్రబాబును అధికారంలోకి తేవడానికే షర్మిల రాష్ట్ర రాజకీయాలలోకి వచ్చారని జగన్ అండ్ కో కౌంటర్ ప్రచారానికి తెర లేపారు. ఈ ప్రచారాన్ని ప్రజలు నమ్మితే జగన్ ఓటు బ్యాంకు సేఫ్‌గానే ఉంటుంది. ప్రస్తుత పరిణామాలను తెలుగుదేశం పార్టీ కూడా నిశితంగా పరిశీలిస్తోంది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా షర్మిల దూకుడుగా వ్యవహరిస్తున్నందున కాంగ్రెస్ పార్టీ నిజంగానే పుంజుకొని జగన్ ఓటు బ్యాంకుతో పాటు ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకును కూడా చీల్చే ప్రమాదం ఉందా? అని ఆరా తీస్తోంది. జగన్‌రెడ్డి అధికారాన్ని కోల్పోయిన పక్షంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ బలపడే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి జగన్‌కు బీజేపీ అండదండలు పుష్కలంగా ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడటాన్ని బీజేపీ జీర్ణించుకోలేదు. రాష్ట్రంలో తాము పుంజుకోలేని పక్షంలో జగన్‌రెడ్డి అధికారంలో కొనసాగాలన్నది బీజేపీ పెద్దల అభిలాష. ఈ కారణంగా తెలుగుదేశం—జనసేన కూటమి కూడా కాంగ్రెస్ పార్టీతో అంటీ ముట్టనట్టుగానే ఉంటుంది. దీన్నిబట్టి ఇటు కుటుంబపరంగా అటు రాజకీయంగా కూడా షర్మిల ఒంటరి పోరాటం చేయాల్సి ఉంటుంది. తమిళనాడులో కరుణానిధి–జయలలిత నాటి రాజకీయాల పట్ల మక్కువ పెంచుకున్న జగన్మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అదే ఒరవడి కొనసాగాలని కోరుకుంటున్నారు. ఇప్పటివరకు ఆయన హిట్ లిస్ట్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, రాధాకృష్ణ, రామోజీరావు మాత్రమే ఉన్నారు. ఇకపై ఈ జాబితాలో షర్మిల కూడా చేరతారు. రక్తం పంచుకు పుట్టిన షర్మిలను కూడా పెత్తందారుల జాబితాలో చేర్చి తిట్టిస్తారు. తన మనసు దోచుకోవాలంటే తన ప్రత్యర్థులను దుర్భాషలాడటమే లక్ష్యంగా పనిచేయాలని జగన్‌రెడ్డి తన పార్టీ వారి వద్ద మొహమాటం లేకుండా చెబుతారు. ఎవరిని ఏ భాషలో తిట్టాలో కూడా తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు వెళతాయి. ఈ ఆదేశాలు పాటించని వారిలో కొందరికి ఇప్పుడు టికెట్లు నిరాకరిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జగన్‌నూ, విజయమ్మనూ తిట్టిపోసిన ప్రస్తుత మంత్రి బొత్స ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలతో ఎవరినైనా తిట్టడానికి ముందుంటున్నారు. జగన్ చల్లని చూపు తమపై ఉండాలంటే తప్పదు మరి అని బొత్స బాటలో మరికొందరు నడుస్తున్నారు.

> “ నిజానికి ముఖ్యమంత్రి భార్య భారతీరెడ్డి ఈ వారంలో లండన్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. అయితే పార్టీలో అంతర్గత పోరుకు తోడు అంతఃపుర రహస్యాలను కూడా షర్మిల పూసగుచ్చినట్టు చెబుతూ రావడంతో, జగన్‌కు ఈ పరిస్థితులలో తోడుగా ఉండడం కోసం భారతీరెడ్డి తన పర్యటనను రద్దు చేసుకున్నారు. దీన్నిబట్టి షర్మిల ఎటాక్ ప్రభావం జగన్‌రెడ్డిపై తీవ్రంగానే ఉందని అర్థం చేసుకోవచ్చు. అధికార బలంతో ప్రత్యర్థులను కేసులలో ఇరికిస్తూ, కుట్రలు, కుయుక్తులతో ప్రతిపక్షాలపై దుష్ప్రచారం చేస్తూ ఇంతకాలం పబ్బం గడుపుతూ వచ్చిన జగన్, ఇప్పుడు తన సోదరే తన నిజ స్వరూపాన్ని విడమర్చి చూపిస్తూ రావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రత్యర్థుల ఆరోపణలకు, విమర్శలకు సమాధానం చెప్పలేని పరిస్థితి ఉన్నప్పుడు ఎదురుదాడి చేయడం వైఎస్ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు తండ్రి బాటలోనే జగన్మోహన్ రెడ్డి కూడా ఎదురుదాడినే ఎంచుకున్నారు.

..అన్నిసార్లూ మోసం చేయలేం!

ఇదిలావుంటే, దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా రికార్డులకు ఎక్కి కూడా తనను పేదల ప్రతినిధిగానే చెప్పుకోవడం మరో జగన్మాయ. దళితులు, బడుగులు, పేదల తరఫున ఆ వర్గాలకు చెందినవారు ఎదగాల్సిన అవసరం లేదు.. మీ కోసం సంపన్నుడైన తాను ఉంటానని చెప్పుకొంటుంటారు. గతంలో కమ్యూనిస్టు పార్టీలకు నాయకత్వం వహించిన పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి, మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావు వంటి వారు భూస్వాముల కుటుంబాల నుంచి వచ్చినప్పటికీ తమ ఆస్తులను పేదలకు పంచి వారి కోసం పోరాడారు. ఇప్పుడు ఈ నయా పేదల ప్రతినిధి అయిన జగన్మోహన్ రెడ్డి పేదల తరఫున మాట్లాడుతూ అపర కుబేరుడిగా అవతరిస్తున్నారు. ఇది జగన్ మార్కు రాజకీయం. అందుకే తర తమ భేదం లేకుండా తన దారికి అడ్డు చెప్పే వారందరినీ పెత్తందారులుగా చిత్రించే పనిలో బిజీగా ఉంటారు. ఈ ఐదేళ్లలో పేదలకు జరిగిన మేలెంత? జగన్‌కు జరిగిన మేలెంతో లెక్కగట్టి నిగ్గు తేల్చితే అసలైన పెత్తందారుడు ఎవరో తేలిపోతుంది. ఒకరిని ఒకసారి మోసం చేయవచ్చు. అందరినీ కూడా ఒకసారి మోసం చేయవచ్చు. కానీ అందరినీ అన్నిసార్లూ మోసం చేయలేం. జగన్‌రెడ్డి విషయంలో కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. ప్రస్తుతానికి అన్నాచెల్లెలి మధ్య మొదలైన ఆటను గమనిద్దాం!



కర్ణాటక రాష్ట్రానికి చెందిన విద్యావేత్త డా. హెచ్.నరసింహయ్య మూఢనమ్మకాలు, దేవుడు పేరుతో జరుగుతున్న దోపిడీని ప్రతిఘటించి, ప్రజల్లో శాస్త్రీయస్పృహ పెంచడానికి విశేష కృషి చేసిన హేతువాది. సత్యసాయిబాబా మహిమలపై పోరాడిన వ్యక్తిగా ప్రసిద్ధుడు. ఆయన ఆత్మకథ 'హోరాటద హాది'ని 'పోరాటపథం' పేరిట **కోడీహళ్ళి మురళీమోహన్** కన్నడం నుంచి తెలుగులోకి అనువదించారు. అందులోని కొన్ని భాగాలివి.

నా బాల్యంలో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ మొదలైన జాతీయ నాయకులు నా ఆలోచనలను, విలువలను రూపొందించారు. నేను అన్నింటినీ గంభీరంగా తీసుకుంటాను. అందువల్లే నేను 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొనింది. శ్రీరామకృష్ణాశ్రమంలో రెండు సంవత్సరాలు ఉన్నప్పుడు స్వామీ వివేకానంద గారి "They alone live who live for others. The rest are more dead than alive. — పరుల కోసం ఎవరు బతుకుతారో వారిదే నిజమైన బతుకు. మిగిలినవారు జీవచ్ఛవాలు" అన్న సూక్తి నా మనసులో ముద్రపడింది. ఒకటి

రాహువే లేనప్పుడు రాహుకాలం ఎక్కడిది?

రెండు సంవత్సరాలు సావధానంగా ఆలోచించి అన్ని సాధక — బాధకాలను పరిగణనలోకి తీసుకుని పెళ్లి చేసుకోకూడదని అంతిమ నిర్ణయం తీసుకున్నాను. ఇది కూడా నేను తీసుకున్న అత్యంత ముఖ్య నిర్ణయాలలో ఒకటి.

పెళ్లి చేసుకోవాలి అనేది అత్యంత సహజమైన, బలమైన ఒత్తిడి. పెళ్లి చేసుకోకుండా ఉండాలి అంటే పెళ్లి చేసుకోవాలన్న ఒత్తిడికి సరితూగే అంతే బలమైన, ముఖ్యమైన ప్రయోజనం, లక్ష్యం జీవితంలో ఉండాలి. ఆలోచనలు అడ్డదిడ్డంగా పోకుండా వాటికి కళ్లెం వేసే ఎల్లప్పుడూ చేతినిండా పని. క్రమశిక్షణతో కూడిన జీవితం. ఏదైనా సాధించాలనే హఠం ఉండాలి. అప్పుడు ఆలోచనలు పక్కదారి పట్టే సంభవం తక్కువ అవుతుంది.

నేను పుట్టింది ఆదివారం నాడు. అయితే నా జీవితంలో ఆదివారమే లేదు అని వెనుక ఎక్కడో చెప్పాను. ఇది అక్షరాలా నిజం. ఇంతవరకూ నాకు ఏ ఆదివారమూ, సెలవురోజూ లేదు. నేను చేసే పని ఎక్కువ శ్రమతో కూడినదైనా నాకు ఎక్కువ సంతృప్తిని ఇస్తుంది. అయినా అప్పుడప్పుడూ ఒంటరితనం గుర్తుకు వస్తుంది. అయితే ఆ ఆలోచన కాలవ్యవధి చాలా కొంచెమే.


నేను మొదటి నుండీ స్వతంత్రంగా ఆలోచించే స్వభావాన్ని అభ్యాసం చేసుకుంటూ వచ్చాను; దేనినీ ప్రశ్నించకుండా ఒప్పుకోను. నేను మూఢనమ్మకాలను, మాయామంత్రాలను, జ్యోతిష్యాన్నీ కటువుగా విమర్శిస్తూ వచ్చాను. మాయలు, మూఢనమ్మకాల గురించి నా ఖచ్చితమైన అభిప్రాయాలను వెనుక చాలా వివరంగా చెప్పాను. జ్యోతిష్యం గురించి సంక్షిప్తంగా కొన్ని విషయాలను చెప్పడం ఉచితం అనిపిస్తుంది.

మనిషిపై గ్రహాల ప్రభావం ఉంది అనే నమ్మకంపై నిర్మించిన సౌధమే జ్యోతిష్యశాస్త్రం. జ్యోతిష్యం ప్రకారం తొమ్మిది గ్రహాలున్నాయి. ఆ తొమ్మిదిలో సూర్యుడు, చంద్రుడు, రాహువు, కేతువులు ఉన్నాయి. సైన్స్ ప్రకారం సూర్యుడు గ్రహం కాదు, ఒక నక్షత్రం. చంద్రుడు ఉపగ్రహం. రాహు కేతు గ్రహాలు లేనేలేవు. ఈ విషయాలన్నీ ఒక హైస్కూలు విద్యార్థికి తెలుసు. జ్యోతిష్కుల తొమ్మిది గ్రహాలలో నాలుగు తప్పుడు లెక్కాచారంతో కూడి ఉన్నాయి. దీనితో జ్యోతిష్యం కథ ముగిసింది కదా! దానికి పునాదే గట్టిగా లేకపోయింది. అందువల్ల దానిమీద కట్టిన జ్యోతిష్యం అనే సౌధం కుప్పకూలిపోయింది.

రాహువే లేనప్పుడు రాహుకాలం ఎక్కడ నుంచి వస్తుంది? రాహుకాలం చెడ్డది అనే భావన చాలామందిలో ఉంది. అది నిజమయితే రాహుకాలంలో బయలుదేరే బస్సులకు, రైళ్లకు, విమానాలకు ప్రమాదాలు జరగాలి. ప్రమాదాలకు రాహుకాలానికీ ఏ సంబంధమూ లేదు. జాతకాలు కూడా జ్యోతిష్యం ఆధారంగానే రచింపబడతాయి. పిల్లవాడు పుట్టినప్పుడు గ్రహాల స్థానం ఆధారంపై జాతకం రాస్తారు. ఆ జాతకంలో పిల్లవాని జీవితంలోని అన్ని విజయాలు, ప్రముఖ ఘట్టాలు కలిగి ఉంటాయి అనే నమ్మకం ఉంది. ఇది శుద్ధ అబద్ధం. విమానప్రమాదంలో చనిపోయే వందలాది మంది జాతకాలలో వారంతా ఇలాగే మరణిస్తారని ఏ జ్యోతిష్కుడూ రాయడానికి సాధ్యం కాదు. 1962లో అష్టగ్రహకూటమి వల్ల అనాహుతం జరుగుతుందని బొబ్బలు పెట్టిన జ్యోతిష్కుల భవిష్యత్తు మట్టి కరిచింది. జ్యోతిష్కులు చెప్పేది అస్పష్టం. గోడమీద పెట్టిన దీపం లాంటిది. ఒక్కొక్కసారి జ్యోతిష్యం కాకతాళీయంగా నిజం కావచ్చు. చెడిపోయిన గడియారం కూడా రోజుకు రెండుసార్లు సరియైన సమయాన్ని చూపుతుంది!

చాలామందికి జ్యోతిష్యంపై నమ్మకం ఎలా ఉందో అలాగే పూజాపునస్కారాల వల్ల వ్యక్తుల, సమాజ కళ్యాణం జరుగుతుందన్న నమ్మకమూ ఎక్కువగా ఉంది. స్వతంత్రంగా ఆలోచిస్తే వీటికి అర్థం లేదు. మనయొక్క ఏ కీర్తిప్రతిష్ఠలకు పూజాదికాలకు సంబంధం లేదు. ప్రపంచంలో లక్షలాది మంది చింతనాపరులూ దార్శనికులూ రాజకీయ నాయకులూ పూజ, ప్రార్థనల సహాయం లేకుండానే గణనీయమైన స్థానాలను గెలుచుకున్నారు. విశ్వవిఖ్యాత ఐన్‌స్టీన్, రసెల్ వంటివారికి ఇలాంటి నమ్మకాలకూ సంబంధమే లేదు. అజ్ఞేయవాది (Agnostic) జవహర్‌లాల్ నెహ్రూ 14 సంవత్సరాలు ప్రధానిగా ఉన్నారు. అలాగే నాస్తికులు జ్యోతిబసు సుదీర్ఘ కాలంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. వీరిద్దరూ ఎక్కువ సమయం అధికారంలో ఉండి రికార్డును సృష్టించారు. ఇలాంటి నిదర్శనాలు చాలా ఉన్నాయి.

> మనలో నిదర్శనానికన్నా ప్రదర్శనానికే ఎక్కువ విలువ. బంట్రోతు మొదలుకొని రాష్ట్రపతి వరకూ చాలామంది తమ తలనీలాలను దేవునికి సమర్పిస్తారు. తలలు బోడులు కావడానికన్నా తలపులు బోడులవుతున్నాయి. భయం, అహేతుకమైన భావనలే మూఢనమ్మకాల ఆస్తి.



ఇంకొక సహించరాని విషయం ఏమిటంటే దేవునికి వజ్రవైఢూర్యాలతోనూ, వెండి—బంగారు నగలతోనూ అలంకరించడం. దేవునికి ఇదంతా ఎందుకు? ఒక విచిత్రమైన విషయం ఏమిటంటే ఇలాంటి శ్రీమంతులైన దేవుళ్ల అమూల్యాభరణాలను మనం — మనుషులం కాపాడాలి. తనను తాను కాపాడుకోలేని దేవుడు మనలను ఎలా కాపాడుతాడు? మనల్ని మనమే కాపాడుకోవాలి.

విశ్వశాంతి కోసం యజ్ఞ యాగాదులను మన దేశంలో ఆచరిస్తారు. ప్రపంచంలోని అనేక దేశాలలో సుఖశాంతులున్నాయి. మన దేశంలోనే ఎప్పుడూ హింస, అశాంతి. అయినా విశ్వశాంతి పేరుతో వీలైనంత దోపిడీ, విలువైన వస్తువుల దహనం చెప్పలేనంతగా జరుగుతూనే ఉంది.

నదులలో, 'పవిత్ర'మైన నదులలో స్నానం చేస్తే పుణ్యం వస్తుంది అనేది మరొక మూఢనమ్మకం. సంవత్సరంలో కొన్ని రోజులు 'పవిత్ర' నదులలో స్నానం చేసి పుణ్యం మూటకట్టుకోవడానికి తొక్కిసలాట. గంగానది అత్యంత పవిత్రమైన నది అనే నమ్మకం చాలామందికి ఉంది. అయితే గంగానది వంటి కలుషితమైన నది మరొకటి లేదని శాస్త్రీయంగా నిరూపించబడింది. గంగానదిని మనమే శుద్ధి చేయవలసిన పరిస్థితి వచ్చింది. చర్మాన్ని కడిగితే ఖర్మం పోతుందా?

మనలో నిదర్శనానికన్నా ప్రదర్శనానికే ఎక్కువ విలువ. బంట్రోతు మొదలుకొని రాష్ట్రపతి వరకూ చాలామంది తమ తలనీలాలను దేవునికి సమర్పిస్తారు. తలలు బోడులు కావడానికన్నా తలపులు బోడులవుతున్నాయి. ఇలాగే చాలా మూఢనమ్మకాల ప్రస్తావనను శాస్త్రీయంగా విశ్లేషించడం అవసరం. భయం, అహేతుకమైన భావనలే మూఢనమ్మకాల ఆస్తి.

నేనిలాగే మూఢనమ్మకాలను, మాయలను, అర్థరహితమైన సంప్రదాయాలని విమర్శిస్తే చాలామందికి అనుమానం వచ్చి నాకు దేవునిపై నమ్మకం ఉందా? అని అడుగుతారు. చాలామంది తమ స్వార్థానికి దేవుణ్ణి ఉపయోగించుకుంటారు. ఇలాంటి లావాదేవీ దేవునిపై నాకు నమ్మకం లేదు. అయితే ఒక చైతన్యశక్తి ఉండవచ్చన్నది నా నమ్మకం. దేవుడు ఉన్నాడా లేడా అనే సమస్య శతాబ్దాల నుండి బుద్ధిజీవులను పీడిస్తోంది. ఎంత ఆలోచించినా ఈ సమస్యకు సమాధానం లభించలేదు. దేవుడు ఉన్నాడు లేదా లేడు అనేది నమ్మకం అవుతుంది. దేవుడు ఉన్నాడని శాస్త్రీయంగా నిరూపించడం సాధ్యం కాదు. అలాగే లేడు అని ధ్రువీకరించడం కూడా సాధ్యపడదు. అందువల్లే ప్రపంచంలోని అనేకమంది చింతనాపరులు, తత్వవేత్తలు, అజ్ఞేయతావాదులు దేవుడు ఉన్నాడని చెప్పరు. లేడనీ చెప్పరు. "దేవుడు, ఆత్మ మొదలైన వాటి గురించి చర్చించడం వ్యర్థం. అందువల్ల మంచిపని చేయి, మంచివాడివి కా — Do good and be good" అని బుద్ధుడు పదేపదే తన శిష్యులకు బోధించేవాడు. ఇది అత్యంత వ్యవహారికమైన Practical ఉపదేశం. దేవుడు లేకపోతే పోనీ మనుష్యుడు ఉన్నాడు కదా. అందువల్ల మన ధర్మానికి మనుష్యుడు కేంద్రబిందువు కావాలి. దేవునిపై నిజంగా నమ్మకం ఉంటే వారు చెడ్డపనులు చేయరాదు; లంచం పుచ్చుకోరాదు; కర్తవ్య ప్రజ్ఞతో ప్రామాణికంగా పనిచేయాలి.

* * *

స్వర్గం, మోక్షం ఉందో లేదో నాకు తెలియదు. వాటి గురించి నేను పట్టించుకోను. అవి ఉన్నా, నాకు స్వర్గమూ వద్దు, మోక్షమూ అక్కరలేదు. కోట్లాదిమంది ఈ ప్రపంచంలో కష్టనష్టాలతో బతుకుతున్నప్పుడు వారినంతా వదిలి నేను స్వర్గానికి వెళ్లాలన్న ఆశ నాకు లేదు. స్వర్గంలో చేయడానికి పనిలేదు. ఎదుర్కోవడానికి సమస్యలు లేవు. సవాళ్ళు లేవు. దివ్యపురుషులు లేరు అన్న తరువాత అక్కడ ఊరికే కూర్చుని ఏమి చేయాలి? పునర్జన్మ ఉంటే నాకు వచ్చే జన్మలో మంచి ఆరోగ్యాన్ని ఇచ్చి నిరంతరంగా పనిచేసే అవకాశం లభిస్తే చాలు, నాకు ఇంకేమీ అక్కరలేదు.

• డా. హెచ్.నరసింహయ్య



పంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే..

- ప్రత్యేక అధికారుల నియామకానికి సర్కారు నిర్ణయం
- జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు
- మంత్రి సీతక్క ప్రకటనతో స్పష్టం
- ఫిబ్రవరి 1తో ముగియనున్న పాలకవర్గాల గడువు

హనుమకొండ టౌన్, జనవరి 27: గ్రామ పంచాయతీల ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదు. మరో వారంరోజుల్లో (ఫిబ్రవరి 1) పంచాయతీల పాలకవర్గాల గడువు ముగుస్తున్నప్పటికీ ఎన్నికల నిర్వహణ దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఉంటే ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమ్మై ఉండేది. ఆ పరిస్థితి కనిపించడం లేదు. పంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించకూడదని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు అధికారిక సమాచారం. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఇప్పట్లో పంచాయతీ ఎన్నికలు జరిపే అవకాశం లేదని గురువారం ప్రకటన చేయడంతో ఎన్నికలు ఇప్పట్లో జరుగవని స్పష్టమైంది. ఎన్నికలపై నెలకొన్న గందరగోళ పరిస్థితికి మంత్రి సీతక్క ప్రకటనతో తెరపడినట్లు అయింది. కాగా, జడ్పీటీసీల పదవీ కాలం జులై మొదటి వారంతో ముగియనుంది. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల ఎన్నికలు ఒకే సారి నిర్వహించే అవకాశాలున్నట్లు సమాచారం.

ప్రత్యేక అధికారుల నియామకం

ఫిబ్రవరి 1వ తేదీతో పంచాయతీల పాలకవర్గాల గడువు ముగుస్తున్న విషయం తెలిసిందే. ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించకూడదని నిర్ణయించుకున్న ప్రభుత్వం.. ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయించినట్లు అధికారిక సమాచారం. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. జిల్లా పరిధిలో ఎన్ని పంచాయతీలున్నాయి? ఎంతమంది ప్రత్యేక అధికారులను నియమించాలనే సమాచారం సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. జిల్లా పంచాయతీ అధికారులు మండలస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఆయా శాఖల అధికారుల జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి నియామక ఆదేశాలు జారీ అయిన వెంటనే.. ప్రతీ పంచాయతీకి ఒక ప్రత్యేక అధికారిని నియమించేందుకు కసరత్తు చేస్తున్నట్లు అధికారిక సమాచారం. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి పంచాయతీల పాలన ప్రత్యేక అధికారులు చేతుల్లోకి వెళ్లనుంది.

ఆశవాహులకు నిరాశ

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమైన ఆశవాహులు నిరాశకు గురయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో సిట్టింగులతో పాటు నూతనంగా బరిలో నిలిచేందుకు నిర్ణయించుకున్న వారు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆరు మాసాలు గా పంచాయతీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం, ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు నిర్ణయించుకున్న వారు విందు రాజకీయాలు సైతం ప్రారంభించారు. రాష్ట్ర పగ్గాలు చేపట్టి మంచి ఊపుమీదున్న కాంగ్రెస్ పంచాయతీ ఎన్నికలు ఎలాగైనా నిర్వహిస్తుందనే ఆలోచనతో ఆశవాహులు ఆయా రాజకీయ పార్టీల ముఖ్య నేతల ప్రసన్నం చేసుకునే యత్నాలు సాగిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆశవాహులను నిరాశ పరిచింది.



ఆర్ట్స్ కళాశాల మైదానంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డేపల్లి, జనవరి 27: ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక పథకం ద్వారా కృషి చేయనున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. 58వ డివిజన్ వందఫీట్ల రోడ్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శనివారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణకుంభంతో అర్చకులు ఘనస్వాగతం పలికి స్వామివారి శేషవస్త్రాలను బహూకరించి సత్కరించారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి వెంట మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, కాంగ్రెస్ శ్రేణులు తాళ్లపల్లి రవీందర్, మండల సమ్మయ్య, కరాబు రాజేశ్వర్‌రావు, జనగాం శ్రీనివాస్‌గౌడ్, మట్టెపల్లి మోహన్, మేరీ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వాకర్స్ సమస్యలు పరిష్కరిస్తా..

సుబేదారి: ఆర్ట్స్ కళాశాల వాకర్స్‌కు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తానని, కళాశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఉదయం వాకర్స్‌తో కలిసి ఎమ్మెల్యే కాసపు వాకింగ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపిన వాకర్స్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆర్ట్స్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దొంతి తిరుపతిరెడ్డి, వాకర్స్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నేడు కేయూకు ఎమ్మెల్సీ కోదండరామ్ రాక



కేయూ క్యాంపస్, జనవరి 27: కేయూ దూరవిద్య కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు 'తెలంగాణ పునర్నిర్మాణం- దిశ దశ' అనే అంశంపై జరిగే రాష్ట్ర సదస్సుకు ఎమ్మెల్సీ కోదండరామ్ హాజరుకానున్నట్లు పూలే ఆశయ సాధన సమితి (పాస్) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో పాస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ, డాక్టర్ కె.రాజారామ్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. పూలే ఆలోచనలు పరులు, మేధావులు, ఉద్యమకారులందరూ పాల్గొనాలని కోరారు.

మేడారం జాతరకు వస్తా..

- 23న వచ్చి వనదేవతలను దర్శించుకుంటా..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- సీఎంను సన్మానించిన పూజారులు

ములుగు, జనవరి 27: మేడారం వనదేవతల మహాజాతరకు హాజరవుతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫిబ్రవరి 23న మేడారం వచ్చి సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుంటానని తెలిపారు. వనదేవతల వడ్డెలు (పూజారులు) సిద్ద బోయిన జగ్గారావు, కాక సారయ్య, కాక కిరణ్, చంద రఘుపతిరావు సీఎంను శనివారం కలిశారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి రాష్ట్ర సచివాలయంలో భేటీ అయ్యారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ, గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో జాతర పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎంను పూజారులు శాలువాతో సన్మానించారు. వనదేవతల పసుపు కుంకుమ, ప్రసాదాన్ని అందజేశారు. జాతరకు రావాలని ఆహ్వానించారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జాతర జరుగుతుండగా, వనదేవతలంతా గద్దెలపై కొలువున్న 23న మొక్కుల రోజున మేడారం వచ్చి దర్శనం చేసుకుంటానని రేవంత్‌రెడ్డి వారికి తెలిపారు.



సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మేడారం పూజారులు

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన శాశ్వత వసతులు కల్పించాలని, ప్రతీసారి పనులకు ఆటంకం కలిగిస్తున్న అటవీ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పూజారులు విజ్ఞప్తి చేశారు. మేడారం జాతరకు అనుబంధ దేవతలైన పగిడిద్దరాజు, గోవింద రాజులు ఉండే పూనుగొండ్ల, కొండాయిని మాత్రమే దేవాదాయ గుర్తింపును ఇచ్చిందని, బయ్యక్కపేట, దొడ్ల గ్రామాలలోని ఆలయాలను కూడా ఎండోమెంట్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. పుణ్యస్నానాల సమయంలో జంపన్నవాగులో ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతర జరిగే నాలుగు రోజుల్లో వనదేవతల గద్దెలపై పోలీసులు, మీడియా ప్రతినిధులు డ్రోన్ కెమెరాలు ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు 15 రోజుల ముందే బెల్లం, మద్యం, కొబ్బరికాయల దుకాణాలను కేటాయించాలని కోరారు.

వనదేవతలకు మొక్కులు

మేడారం, జనవరి 27: సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు మహాజాతర జరుగనున్న నేపథ్యంలో ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి, కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెలకు చేరుకుని మొక్కులు చెల్లించారు. సుమారు 30 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. కాగా, మేడారం మహాజాతరకు ఓ వ్యాపారి విరాళం ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన రాడికో లిక్కర్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ చంద్రారెడ్డి రూ. లక్ష 800 ఈవో రాజేంద్రం అందజేశారు.



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

టెన్త్ ఫలితాల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలుపాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 27: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌లో హాలులో వివిధ మండలాల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు రివిజన్ క్లాసులను నిర్వహించి వార్షిక పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి రోజు విద్యార్థుల హాజరుశాతాన్ని పర్యవేక్షిస్తూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సంవత్సరం పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేందుకు ఇప్పటినుంచే పకడ్బందీగా కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌హై, జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న జీడబ్ల్యూఎంసీ సిబ్బంది

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల తొలగింపు పర్వం

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 27: వరంగల్ మహానగర పాలక సంస్థ చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపు పర్వం కొనసాగుతోంది. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్మాణాలను బల్దియా అధికారులు కూల్చివేశారు. 42వ డివిజన్ వరంగల్ నాయుడు పెట్రోల్‌పంపు సర్వే నెంబరు 140లోని పల్లయ్యకుంట ప్రభుత్వ భూమిలో జరిగిన నిర్మాణాలను జీడబ్ల్యూఎంసీ, రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో తొలగించారు. 11వ డివిజన్ ములుగు రోడ్డులోని కాపువాడలో గుర్తించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

బిల్లుల చెల్లింపులను పరిశీలించిన కమిషనర్

హనుమకొండలోని యాదవనగర్, లోటస్ కాలనీ, విజయలక్ష్మీ, జవహర్ కాలనీల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల నాణ్యతతో పాటు బిల్లుల చెల్లింపు అంశాలను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ పరిశీలించారు. శనివారం ఆయన క్షేత్రస్థాయిలో నిర్మాణాల చూసి నాణ్యతను పరిశీలించారు.

నగరంలో సీఐటీయూ జాతీయ సమావేశాలు

- ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నిర్వహణ
- జనవరి 31న బహిరంగ సభ
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ వెల్లడి

కేయూ క్యాంపస్, జనవరి 27: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు జనవరి 31న నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు హనుమకొండలో జరు గుతాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. శనివారం జాతీయ సమావేశాల పోస్టర్‌ను కేయూలో జె.వెంకటేశ్, జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, జిల్లా ఆఫీసు బేరర్స్ గాదె ప్రభాకర్‌రెడ్డి, మెట్టు రవి, బొట్ల చక్రపాణి, వేల్పుల సారంగపాణి, పుల్లా అశోక్, ఎన్.రజిత విడుదల చేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, రాగుల రమేశ్ తదితరులు

ఈ సందర్భంగా జె.వెంకటేశ్ మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను, ఎంపీ చట్టం, విద్యుత్ సవరణ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు కనీస వేతనం రూ200 చెల్లించాలని అన్నారు. ధరల నియంత్రణ తదితర ప్రధాన సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త ఆందోళనలకు రూపకల్పన చేసేందుకు ఈ జాతీయ సమావేశాలలో హనుమకొండ వేదిక అవుతోందని తెలిపారు.

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ మాట్లాడుతూ... జనవరి 31న జాతీయ సమావేశాల సందర్భంగా వేయి స్తంభాల దేవాలయం నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు కార్మిక మహా ప్రదర్శన ఉంటుందని, అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభలకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఉద్యోగ, కార్మికవర్గాలు పాల్గొని సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అన్నారంలో ఉర్సు

- వైభవంగా ప్రారంభమైన ఉత్సవాలు
- ఆకట్టుకున్న కవ్వాలి.. గంధం ఊరేగింపు

పర్వతగిరి, జనవరి 27: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నారం షరీఫ్‌లోని యాకూబ్‌షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో మొదటి రోజు ముజావరు బోలేషావలి ఇంటివద్ద హైదరాబాద్ నుంచి వచ్చిన బృందం సభ్యులు కవ్వాలి ఆకట్టుకుంది. దర్గాను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఆవరణలో విడిది చేశారు. గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు నడుమ జెండా ఊరేగింపు తర్వాత సందల్ (గంధం) ఊరేగింపు నిర్వహించారు. గంధం ఊరేగింపు సందర్భంగా ఫకీర్ల విన్యాసాలు అలరించాయి. అనంతరం తెల్లవారు జామున దర్గాలో యాకూబ్‌షావలికి గంధం సమర్పించారు. పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు ఆధ్వర్యంలో 70మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా తగిన ఏర్పాట్లు చేశారు.

బందోబస్తును పరిశీలించిన ఈస్ట్‌జోన్ డీసీపీ

ఉర్సు ఉత్సవాల్లో ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు చేపట్టిన బందోబస్తును ఈస్ట్‌జోన్ డీసీపీ పి.రవీందర్, మామునూరు ఏసీపీ సతీష్‌బాబులు శనివారం పరిశీలించారు. గ్రామానికి వచ్చే మూడుదారుల్లో ఏర్పాటు చేసిన మూడు పార్కింగ్ ప్రదేశాలను సందర్శించి పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. దర్గాతో పాటు ప్రాంగణం, గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు బందోబస్తును పర్యవేక్షించాలన్నారు. దర్గా ఎదురుగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పలు శాఖల అధికారులతో సమీక్షించారు.

నేడు మహా అన్నదానం

ఉర్సు ఉత్సవాల సందర్భంగా రెండో రోజు భక్తులకు మహా అన్నదానం నిర్వహించనున్నట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా తెలిపారు. సాయంత్రం 7గంటలకు దర్గాకు చెందిన సత్రంలో అన్నదానం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.



విద్యుద్దీపాలతో అలంకరించిన దర్గా

నర్సింగ్ శిక్షణకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

హనుమకొండ రూరల్, జనవరి 27: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ కింద జపాన్‌లో నర్సింగ్ సిబ్బంది శిక్షణ, నియామకం కోసం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోందని 22 నుంచి 30 యేళ్ల వయస్సుగల బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం, ఏఎన్ఎం, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హైదరాబాద్ విద్యానగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్ ట్రెయినింగ్ సెంటర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8919047600, 9573945684, 6302292450 లలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా ప్రొఫెసర్ వెంకయ్య



కేయూ క్యాంపస్, జనవరి 27: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా కేయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. వెంకయ్య గతంలో జంతుశాస్త్ర విభాగాధిపతిగా, బీవోఎస్ బోర్డు ఆఫ్ చైర్మన్‌గా, కేయూ క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, అడ్మిషన్ల డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా పనిచేశారు.

ఆటోను ఢీకొట్టిన లారీ - నలుగురికి గాయాలు


ప్రమాదంలో క్షతగాత్రులు

కురవి, జనవరి 27 : కురవి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆటోను లారీఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం. మాధవాపురం గ్రామానికి అరూరి వెంకన్న తన కుటుంబసభ్యులతో కలిసి ఆటోలో మహబూబాబాద్‌లో ఓ శుభకార్యంకు వెళ్తున్నారు. ఆటో కురవి వద్దకు చేరుకోగానే మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపు వెళ్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారి బాబు అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. మరో చిన్నారి భానుతేజకు చేయి విరిగింది. అరూరి ఉపేంద్ర, అరూరి వెంకన్న, అనిల్‌లకు గాయాలయ్యాయి. ఎస్సై గోపి ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కస్నాతండాలో నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, జనవరి 27 : మండలంలోని కస్నాతండా వద్ద శనివారం నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లంతో పాటు 50 కిలోల పటికను పట్టుకున్నట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కస్నాతండా క్రాస్‌రోడ్డు వద్ద సమ్మక్క-సారలమ్మ గద్దెల సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ నెంబర్‌ప్లేట్ లేని ఆటోను గుర్తించినట్లు చెప్పారు. దానిని తనిఖీ చేయగా అందులో నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్‌చేసి, ఇందుకు బాధ్యులైన బోరింగ్‌తండాకు చెందిన మోహన్, నాగేష్‌ను అదుపులోకి తీసుకోగా, కురవి మండలం లింగ్యాతండాకు చెందిన వెంకటేష్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

యువతిని మోసగించిన యువకుడిపై కేసు నమోదు

కొత్తగూడ, జనవరి 27: పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ధర్నా చేసిన ఘటన కొత్తగూడ మండలంలో శనివారం జరిగింది. యువతి (28)ని మోసగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు జల్లెల ప్రశాంత్ పెళ్లి చేసుకుంటానని మూడేళ్లుగా ప్రేమించాడు. కాగా, ఆ యువతిని వివాహం చేసుకోవడానికి యువకుడు నిరాకరించాడు. దీంతో ప్రశాంత్ ఇంటి ఎదుట ఆ యువతి శనివారం బైఠాయించింది. పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేసింది. కాగా, పోలీస్‌స్టేషన్‌లో ప్రశాంత్‌పై యువతి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

మరో ఐదేళ్లు ఉచిత బియ్యం

● ఈ నెల నుంచి ఉచిత పంపిణీ కొనసాగింపు ● ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9.57 లక్షల మందికి లబ్ధి

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద రేషన్‌కార్డుదారులకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ కొనసాగింపు మళ్లీ ఈనెల నుంచి మొదలు కానున్నది. వచ్చే ఐదేళ్లవరకు ఇది కొనసాగుతుంది. ఉచిత బియ్యం పంపిణీకి అవసరమైన బియ్యంకోటా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చేరింది. పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉచిత బియ్యం పంపిణీని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్లపాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో నిరుపేదలు, అట్టడుగువర్గాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బియ్యం పంపిణీ ఈనెల నుంచి మళ్లీ అమలులోకి తీసుకువస్తూ గత ఉత్తర్వులు జారీ చేసింది. కొవిడ్-19 మహమ్మారి వ్యాప్తి సమయంలో పీఎంజీకేవై పథకాన్ని 2020 మార్చిలో కేంద్రం ప్రారంభించింది. కరోనా లాక్‌డౌన్ తర్వాత పేదలను ఆదుకోవడం కోసం, వారి జీవనోపాధికి ఆసరగా నిలిచేందుకు ఈ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది.

పలుమార్లు పొడిగింపు

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ (పీఎంజీకేఏవై) ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మొదటి, రెండో దశల కింద ఉచిత బియ్యం పంపిణీని 2020 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు అమలు చేశారు. ఆతర్వాత మూడో దశను మే నుంచి 2021 జూన్ వరకు పొడిగించారు. నాలుగోదశను 2021 జూలై నుంచి 2021 నవంబర్ వరకు, ఐదోదశను 2022 మార్చి వరకు, ఆరో దశను 2022 డిసెంబర్ వరకు, ఏడో దశను గత 2023 డిసెంబర్ వరకు కొనసాగించారు. ఇప్పుడు తాజాగా 2024 జనవరి



మరో ఐదేళ్లపాటు కొనసాగిస్తారు. ఈ పథకానికి అయ్యే ఖర్చును రాష్ట్రాలతో సంబంధం లేకుండా కేంద్రమే భరిస్తోంది. 2022 డిసెంబరు 31న ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (పీఎంజీకెవై)ని జాతీయ ఆహార భద్రతాచట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ)లో కేంద్రం విలీనం చేసింది. దీంతో అప్పటినుంచి ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) ఉన్న లబ్దిదారులందరికీ ఉచిత రేషన్ బియ్యం పథకాన్ని కొనసాగిస్తోంది.

9.57 లక్షల మందికి లబ్ధి

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 9,57446మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. కేంద్ర నిర్ణయంతో ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. ఆహార భద్రత కార్డుదారులకు యూనిట్‌కు 6కిలోల చొప్పున, అంత్యోదయ కార్డుదారులకు 35కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్డుదారులకు జనవరి నెలలో 19,290.47 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. ఈబియ్యాన్ని ఈనెలలో పంపిణీ చేస్తారు.

అన్ని రేషన్ కార్డులకు..

అన్నపూర్ణ, అంత్య యోజన కార్డుదారులు, ఆహార భద్రతాకార్డు కలిగిన కుటుంబాలకు అన్ని రేషన్‌షాపులలో ఉచితంగా అందిస్తారు. కొవిడ్ మహమ్మారి సమయంలో విధించిన అదనపు నిబంధనలను కూడా తొలగించారు. కేంద్ర ప్రభుత్వం కొవిడ్‌కంటే ముందు రేషన్‌కార్డు ఉన్న వారికి కిలో బియ్యాన్ని సబ్సిడీ ధరతో రూ.1-3 వరకు అందించేది. ఐదు కిలోల చొప్పున ఒక్కొక్కరికి కేటాయించేది. అలాగే అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కుటుంబాలకు 35 కిలోల బియ్యాన్ని పంపిణీ చేసేది. అయితే ఈ స్కీమ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి కేంద్రం ఒక్క పైసా కూడా తీసుకోకుండా పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది.

ఉచిత బియ్యం పక్కదారి

ఈ ఉచిత బియ్యాన్ని రెండేళ్లుగా కార్డుదారులు అందరూ తీసుకోవడం లేదు. 70 నుంచి 80 శాతం కార్డుదారులు మాత్రమే ప్రతీ నెల తీసుకుంటున్నారు. మిగిలిన 20 నుంచి 30 శాతం కార్డుదారులు తమ కార్డులు రద్దుకాకుండా ఉండేందుకు రెండు నెలలకోసారి తీసుకుంటున్నారు. పదిశాతం మంది కార్డుదారులు ఈ ఉచిత బియ్యాన్ని కిలో ఒక్కంటికి రూ.8 నుంచి రూ.10లకు రేషన్‌షాపు డీలర్లకే విక్రయిస్తున్నారు. మిగిలిన 20శాతం కుటుంబాలు కిరాణం, ఇడ్లీ బండ్లు, చిరువ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.


పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

హనుమకొండ క్రైం, జనవరి 27: సుబేదారి పీఎస్ పరిధిలోని వడ్డెపల్లిలో అక్రమంగా విక్రయిస్తున్న బెల్టుషాపుపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు చేశారు. ఈ దాడులలో రూ.74వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెపల్లిలోని పెసరు రాజ్‌కుమార్ అనే వ్యక్తి కొద్దిరోజులుగా ఇంటినే అడ్డాగా చేసుకుని బెల్టుషాపు నడిపిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో శనివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ఇంట్లో డంప్ చేసిన వివిధ బ్రాండ్లకు సంబంధించిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పట్టుకున్న మద్యాన్ని సుబేదారి పోలీసులకు అప్పగించారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీతారాంనాయక్ తదితరులు

జర్నలిస్టులు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

మాజీ ఎంపీ సీతారాంనాయక్

వడ్డెపల్లి, జనవరి 27: సామాజిక స్పృహ కలిగిన జర్నలిస్టులు ప్రజాస్వామ్యాన్ని పరక్షించాలని ప్రముఖ బంజారా నేత, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించినన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బానోతు వెంకన్న, జిల్లా అధ్యక్షుడు గుగులోతు హుస్సేన్ నాయక్, కార్యదర్శి దేవేందర్ నాయక్, జర్నలిస్టులు అంతడుపుల శ్రీనివాస్, రేజనాల శ్రీనివాస్, శోభన్‌బాబు, మాడ నర్సయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


విద్యుదాఘాతంతో దగ్ధమైన ఇల్లు

పరకాల, జనవరి 27: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన పరకాల పట్టణంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల పట్టణానికి చెందిన నేరెళ్ల పరశురాంకు చెందిన ఇంట్లో ఫ్రిడ్జి ప్లగ్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున మంటలు లేచాయి. ఇది గమనించిన చుట్టుపక్కల ప్రజలు స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వెంటనే చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటి వరకే ఇంట్లో ఉన్న ఫ్రిడ్జితో పాటు ఇంటి పైకప్పు, ఇంట్లోని సమాన్లతోపాటు డబ్బులు మంటల్లో కాలిపోగా, రూ. 2 లక్షల వరకు ఆస్థి నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.

శివనగర్‌లో భారీ చోరీ

15 తులాల బంగారం, 25 తులాల వెండి, 45వేల నగదు అపహరణ

ఖిలావరంగల్, జనవరి 27: వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతం శివనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం రాత్రి భారీ చోరీ జరిగింది. శనివారం ఉదయం ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం. వరంగల్ రైల్వే స్టేషన్ శివనగర్ ఎదురుగా ఉన్న ఇంట్లో వ్యాపారం (బాటర్ బాటిల్ అమ్మకం) పూజారి రవి-శ్రీలత దంపతులు ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులుండగా, వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. రవికి అనారోగ్యం కారణంగా దంపతులు మూడు రోజుల క్రితం వైద్యపరీక్షల నిమిత్తం రాజస్థాన్‌కు వెళ్లారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 15తులాల బంగారం, 25తులాల వెండి, 45వేల నగదు అపహరించారు. బంగారం, వెండి, నగదు కలిపి సుమారు కోటి రూపాయల దొంగతనం జరిగినట్లు తెలిపారు. శనివారం ఉదయం రవి తమ్ముడి భార్య ఇంట్లోని చెట్లకు నీళ్లు పట్టే క్రమంలో ఇంటికి వేసిన తాళాన్ని పగలకొట్టి ఉండడం చూసి, మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారమిచ్చింది. పూజారి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విషయాన్ని పోలీసులు రవి కుటుంబానికి సమాచారమిచ్చారు. వారి చెప్పిన దాని ప్రకారం చోరీ అంచనా వేశారు. కేసును సీఐ సురేష్ దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పర్వతగిరి, జనవరి 27 : మండలంలోని దౌలత్‌నగర్‌లో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.వీరన్న, ఆర్గనైజర్ పిండి కొమురయ్యలు క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, సర్పంచ్ కొల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మొదటి రోజు 13 జట్లు పాల్గొన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు బండి వెంకటేశ్వర్లు, పిండి మల్లికార్జున్, కత్తుల శ్రీనివాస్, నల్గొండ సూర్యప్రకాష్, ఎస్సెమ్సీ చైర్మన్ బొమ్మెర సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు విశ్వ విజేతలుగా ఎదగాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

ఘనంగా ఏకశిల పాఠశాలల వార్షిక వేడుకలు

హసన్‌పర్తి, జనవరి 27: విద్యార్థులు విశ్వ విజేతలుగా ఎదగాలని, మారుతున్న పోటీ ప్రపంచంలో తమ గమ్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా కోరారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి వద్ద గల ఏకశిలా టెక్నో స్కూల్‌లో శనివారం ఏకశిలా పాఠశాలల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఏ రంగంలోనైనా గొప్ప వక్తులుగా తయారవుతారన్నారు. ఉన్నత స్థానానికి చేరి నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగినప్పుడే కీర్తించబడుతారన్నారు.

అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.డి. అబ్దుల్‌హై మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో తరగతి గది పాత్ర ప్రధానమైనదన్నారు. విద్యార్థులను సక్రమమైన పద్ధతిలో, క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఏకశిలా విద్యా సంస్థల ద్వారా విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో 10/10 జీపీఏ, సీబీఎస్ఈలో 485 మార్కులు సాధించిన విద్యార్థులకు ఏకశిలా జూనియర్ కళాశాలలో ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏకశిలా విద్యాసంస్థల డైరెక్టర్లు గౌరు సువిజారెడ్డి, బేతి కొండల్ రెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ దినేష్‌రెడ్డి, బేతి శైలజ, స్వప్నరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు



ఆత్మకూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

పెద్దాపురంలో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి..

ఆత్మకూరు తహసీల్దార్‌కు వినియోగదారుల మండలి ఫిర్యాదు

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరుగుతోందని వియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, సంయుక్త కార్యదర్శి నల్లా రాజేందర్ శనివారం ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌వోసీ (నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్)లు లేకుండా మైనింగ్ సంస్థలు బ్లాక్‌గ్రానైట్‌ను తీస్తున్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్దాపురం మైనింగ్ సంబంధించి ఎన్‌వోసీలు దొరకడం లేదని అధికారులు చెబుతున్నారని తెలిపారు. సర్వే నెంబరు 584/1లో రెండు మైనింగ్ సంస్థలు మైనింగ్ శాఖ చేసుకున్న అగ్రిమెంట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఇప్పటికీ రెండు సంస్థలు పర్యావరణ నిబంధనలు అతిక్రమించిందువల్ల న్యాయస్థానాలు జరిమానా విధించాయని, లోకాయుక్తలో విచారణ జరుగుతున్నదని తెలిపారు. అయినా కూడా నిబంధనల ప్రకారం మైనింగ్ నిర్వహించకపోవడంపై రెవెన్యూశాఖ ఇకనైనా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సర్వే నెంబరు 584/లో 2008 నుంచి మైనింగ్ జరుగుతున్న క్రమంలో అక్కడ ఉన్న గుట్ట అతి పెద్ద బిలంగా మారిపోయి స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అనంతరం ధరణి పోర్టల్‌కు సంబంధించిన ఫిర్యాదులను తహసీల్దార్‌కు ఇచ్చారు.

వైద్యం కోసం సాయం చేయండి..


మాట్లాడుతున్న నాగరాజు, మౌనిక

వడ్డెపల్లి, జనవరి 27: తమ కుమారుడి వైద్యం కోసం సహాయం చేయాలని ములుగు జిల్లా చల్వాయి గ్రామానికి చెందిన నాగరాజు, మౌనిక దంపతులు వేడుకుంటున్నారు. ఈ మేరకు హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. త కుమారుడు లక్ష్మణ్ ఇటీవల ఆడుకుంటూ కిందపడడంతో తలకు తీవ్ర గాయాలై ఫిట్స్ రావడం ప్రారంభం అయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే హనుమకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. లక్ష్మణ్‌కు వెంటిలేటర్‌పై వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోజుకు రూ.55 నుంచి 60వేల వరకు ఖర్చు అవుతోందని చెప్పారు. ప్రయివేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తాము కుమారుడి వైద్య ఖర్చులు భరించే స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ముందుకొచ్చి తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టేందుకు ఆర్థిక సహకారం అందించాలని నాగరాజు, మౌనిక వేడుకుంటున్నారు. ఫోన్‌పే నంబర్ 8008994920కు ఆర్థికసాయం పంపించాలని వారు కోరారు.



ఆంధ్రజ్యోతి HANUMAKONDA CITY

ఆదివారం 28 జనవరి 2024

హనుమకొండ సిటీ

• హనుమకొండ • కాజీపేట • హసన్‌పర్తి • ఐనవోలు • ధర్మసాగర్ • వేలేరు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రవీందర్

కాజీపేట, జనవరి 17: కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో శనివారం స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ రూ 5 లక్షల జనరల్ ఫండ్‌తో పలు అభివృద్ధి ప్రారంబపు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ నిధులతో కమిటీ హాల్ కాంపౌండ్, సీసీ రోడ్ ప్యాచ్ వర్క్‌లు చేపడుతామన్నారు. మరో రెండు రోజుల్లో ఎస్సీ కాలనీ ఎలక్ట్రిక్ పోల్స్ సైతం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మేరుగు రాజయ్య, డాక్టర్ పి.శ్రవణ్, దాడబోయిన వీరస్వామి, మాచర్ల జయాకర్, బండారి సురేందర్, రవికుమార్, కుమ్మరి స్వామి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాళోజీ కళాక్షేత్రం పనులను వేగంగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 27: కాళోజీ కళాక్షేత్రం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం పనులపై కుడా అధికారులు, నిర్మాణ పనులు చేపడుతున్న ఏజెన్సీ ప్రతినిధులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడిటోరియం, హాల్, ఇతర భవన నిర్మాణ పనుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, కుడా అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రెసా క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్



ట్రెసా క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్

హనుమకొండ రూరల్, జనవరి 27: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ట్రెసా ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ గనిపాక రాజ్‌కుమార్, కార్యదర్శి ఇర్ఫాన్, ఏవీ భాస్కర్, రియాజోద్దీన్, జగన్‌మోహన్‌రెడ్డి, కె.సత్యనారాయణ, ఫణికుమార్, అబిద్ అలీ, గౌరిశంకర్, విశ్వనారాయణ, జ్యోతి వరలక్ష్మీదేవి, సురేశ్‌కుమార్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ పోటీల్లో ప్రథమ స్థానం



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మసాగర్, జనవరి 27: చెకుముకి టాలెంట్ పోటీలలో పెద్దపెండ్యాల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినట్టు ప్రధానోధ్యాయుడు రాజేందర్ శనివారం తెలిపారు. ఇటీవల జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ధర్మసాగర్ బాలుర పాఠశాలలో మండలస్థాయి చెకుముకి టాలెంట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పెద్దపెండ్యాల పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి పథమ బహుమతిని కైవసం చేసుకొని జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మండల స్థాయి ద్వితీయ స్థానంలో శాయిపేట్ పాఠశాల విద్యార్థులు, తృతీయ స్థానంలో దేవునూర్ విద్యార్థులు గెలుపొందారు. ఈ సందర్భంగా పెద్దపెండ్యాల విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



బస్‌స్టేషన్ ఎదుట తెల్లవార్లు నడుస్తున్న పాన్‌షాప్



రోడ్డుపై విచ్చలవిడిగా ఆగిన ఆటోలు

ప్రైవేట్ వ్యాపారుల ఇష్టారాజ్యం

హనుమకొండ బస్‌స్టేషన్‌లో విచ్చలవిడిగా షాపుల నిర్వహణ

ఆటోలకు బస్‌స్టేషన్ రోడ్డే అడ్డా

పట్టించుకోని ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు

సుబేదారి, జనవరి 27: హనుమకొండ బస్‌స్టేషన్ చుట్టుపక్కల ప్రైవేట్ వ్యాపారుల ఇష్టారాజ్యం నడుస్తోంది. బస్‌స్టేషన్ నుంచి హనుమాన్ టెంపుల్ మీదుగా హనుమకొండ చౌరస్తాకు వెళ్లే రోడ్డు పక్కనే ఆర్టీసీ అధికారుల అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు పాన్‌షాపులు, టీ స్టాల్స్ నడుపుతున్నారు. దీంతో ఆర్టీసీకి నెలకు రూ.50,000 వరకు అద్దె చెల్లించి షాపులు నడుపుకునే వారికి తీవ్ర నష్టం జరుగుతోందని పలువురు వ్యాపారులు అంటున్నారు. మున్సిపల్ అధికారులు బస్‌స్టేషన్ ప్రాంగణంలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బస్‌స్టేషన్ అధికారులకు అద్దె చెల్లించే వ్యాపారులు అంటున్నారు.

నిత్యం ఇదే తంతు..

బస్‌స్టేషన్ ప్రాంగణంలో రెండు, మూడు పాన్‌షాపులు అర్ధరాత్రి నుంచి తెల్లవార్లు నడుస్తున్నాయి. ఈ విషయంపై ఆర్టీసీ అధికారులు కానీ, పోలీసులు కానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు పోలీసులు మామూళ్ల తీసుకుని పాన్‌షాపుల నిర్వాహకులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయడం లేదని, దీంతో విచ్చలవిడిగా వ్యాపారం చేసుకుంటున్నారని అంటున్నారు.

ఆటోలకు రోడ్డే ఆటోస్టాండ్

ఆటోలు నిత్యం బస్‌స్టేసన్ రోడ్డు మీదే ఉంటున్నాయి. దీంతో ఆటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడ ఆటోలు ఆపుతుండడంతో ఆటుగా ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి రోడ్లపై ఆటోలు నిలిపి ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆటుగా వెళ్లే ప్రయాణికులు కోరుతున్నారు.

గంజాయి విక్రయదారుడి అరెస్ట్



గంజాయి విక్రయదారుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి, జనవరి 27: అక్రమంగా గంజాయిని విక్రయించడానికి వచ్చిన వ్యక్తిని శనివారం సాయంత్రం హసన్‌పర్తి పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన పిట్టల రాజు గంజాయి సరఫరా చేస్తుంటాడు. హుజురాబాద్, కరీంనగర్, హనుమకొండ చుట్టు పక్కల ప్రాంతాలకు గంజాయిని సరఫరా చేస్తుంటాడు. శనివారం పిట్టల రాజు హసన్‌పర్తిలో గంజాయిని విక్రయించడానికి ఆర్టీసీ బస్సులో వస్తు న్నాడు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ గోపి తన సిబ్బందితో హసన్‌పర్తి బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆర్టీసీ బస్సులో వచ్చిన పిట్టల రాజు హసన్‌పర్తి బస్టాండ్‌లో దిగగానే పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. వెంటనే పోలీసులు అత డిని పట్టుకుని సోదా చేయగా 2 కిలోల గంజాయి ప్యాకెట్ లభ్యమైంది. వెంటనే అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసుకుని, రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ ర్యాలీ

కాజీపేట, జనవరి 27: ప్రపంచ ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా శనివారం కాజీపేటలో ఎలక్ట్రీషన్స్ జెండా ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. చౌరస్తా నుంచి డీజిల్‌కాలనీ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సిరిల్ లారెన్స్ మాట్లాడుతూ.. ఎలక్ట్రీషియన్స్‌లు పనులు చేసేటప్పుడు జగ్రత్త వహించాలన్నారు. ప్రతీ ఒక్కరు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. బి.శేషాద్రి, సీహెచ్ భాస్కర్, జె.కుమార్, డి.సురేశ్‌కుమార్, రిజ్వాన్, గోపితోపాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపార అభివృద్ధిలో పెటెంట్లు కీలకం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ జీబీ రెడ్డి

కేయూ క్యాంపస్, జనవరి 27: వ్యాపార అభివృద్ధిలో పేటెంట్స్ హక్కులు కీలకమని హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ జీబీరెడ్డి అన్నారు. కేయూ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రభుత్వ ఈఎఫ్ఎస్‌టీ విభాగం సంయుక్తంగా శనివారం కేయూ సెనెట్ హాల్‌లో ఐపీఆర్ సెల్ నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జీబీరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మేధో సంపత్తి హక్కులు ప్రతీ రంగానికి అవసరమన్నారు. కేయూ ఫార్మసీ అధ్యాపకులు అన్ని రంగాల్లో ముందున్నారని చెప్పారు. ఈ సమావేశంలో వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరాధ్యకు కేవీ ప్రిన్సిపాల్ అభినందనలు



కేంద్రియ విద్యాలయలో నృత్యకారిణి ఆరాధ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుభాషిణి

మడికొండ, జనవరి 27: కాజీపేట మండలం కడిపికొండలోని కేంద్రియ విద్యాలయలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆరాధ్య ఈ నెల 24న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన కూచిపూడి నృత్యప్రదర్శనలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచింది. గిన్నిస్ రికార్డులో చోటు సాధించిందని విద్యాలయ ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ప్రిన్సిపాల్ ఆరాధ్యకు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.



డీవైఎఫ్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్

హనుమకొండ రూరల్, జనవరి 27: సమాజంలోని నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ సూచించారు. కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన డీవైఎఫ్ఐ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, కార్యదర్శి డి.తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, నాయకులు సముద్రాల అనిల్, శివరాత్రి కరుణాకర్, సతీష్ కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రేమ విఫలమవడంతో మనస్తాపం

పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి

వరంగల్‌లో విషాదం



ముంజ అఖిల (ఫైల్)

వరంగల్ సిటీ, జనవరి 27: ప్రేమ విఫలమై ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ముంజ అఖిల (19) ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖిలావరంగల్ మండలంలోని పెరుకవాడలో శనివారం చోటు చేసుకుంది. మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి తల్లి ముంజ కోమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముంజ కోటి, కోమల దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కోటి గతంలోనే మృతిచెందగా తల్లి కోమల కూలి పనిచేసుకుంటూ పిల్లల్ని చదివిస్తోంది. అఖిల నగరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొంతకాలంగా అఖిల ఓ యువకుడిని ప్రేమిస్తోంది. వీరి ప్రేమ విఫలమవడంతో దీంతో మనస్తాపం చెందిన అఖిల శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి కోమల ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు.

ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీలు రద్దు

కాళోజీ జంక్షన్, జనవరి 27: తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ కమిటీలన్ని రద్దు చేస్తున్నట్లు తాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమల్ల రవికుమార్, కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి దార సూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్స్ యూనియన్‌ను మరింత బలోపేతం చేయడం కోసం కమిటీలన్ని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే సీనియర్ నాయకులు, ఆటో డ్రైవర్లను సంప్రదించి నూతన కమిటీల ఏర్పాటుకు సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కామర్స్ అధ్యాపకులకు రిపోర్టు రైటింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్, జనవరి 27: కేయూ పరిధిలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అధ్యాపకులకు శనివారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమినార్ హాల్‌లో రిపోర్టు రైటింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. కామర్స్ బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు హాజరై అధ్యాపకులకు కామర్స్ విభాగంలో రిపోర్టు రైటింగ్‌పై మాట్లాడారు. కామర్స్‌కు మంచి భవిష్యత్ ఉందన్నారు. మంచి నైపుణ్యాలు పెంచుకుని ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సాధించాలని చెప్పారు. గ్రూప్ డిస్కషన్ ఇంటర్వ్యూ, ప్రాజెక్టు రిపోర్టుపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహచారి మాట్లాడారు. ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై అర్జంట్ ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి మాట్లాడారు. నైపుణ్యాలుంటేనే విద్యార్థికి తన డిగ్రీ విలువ పెరుగుతుందని చెప్పారు. బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో న్యూఎడ్యుకేషన్ పాలసీలో వస్తున్న మార్పులపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రగతి, కటకం ఫణీంద్ర, ఏఆర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్ష



మాట్లాడుతున్న అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్

హనుమకొండ రూరల్, జనవరి 27: ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్షను హంటర్‌రోడ్‌లోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో నిర్వహించారు. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గణితం నిత్యజీవితంలోనూ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. గణితాన్ని చిన్నతనంలో అలవర్చుకుంటే చాలా సులభంగా ఉంటుందన్నారు. గణిత ప్రతిభ పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, డాక్టర్ అడ్లూరి నరసింహామూర్తి, రామేశ్వర్‌రావు, గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు తవుటం భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేశ్, పుల్లూరు మల్లికార్జున్, రఘురాం, కంది శ్రీనివాస్‌రెడ్డి, కందగట్ల సురేశ్, ఆనంద్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఆడపిల్లకి స్వాగతం పలుకుతున్న డీడబ్ల్యువో మధురిమ

అవనికి ఆడపిల్లలను ఆహ్వానిద్దాం..

డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ మధురిమ

మడికొండ, జనవరి 27: ఆడపిల్లలను ధరణిలోనికి స్వాగతిద్దాం అని డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.మధురిమ అన్నారు. గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లో శనివారం బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నూతనంగా జన్మించిన ఆడపిల్లలకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీడబ్ల్యువో మధురిమ మాట్లాడుతూ.. సృష్టిలో సగ భాగం అయిన ఆడపిల్లలను బాగా చూసుకోవాలన్నారు. ఆడపిల్లల సంరక్షణపై జాగ్రత వహించాల్సిన అవసరం ఉందన్నారు. సుకన్య సమృద్ధి యోజన పథకం కింద డబ్బులు పొదుపు చేయాలని సూచించారు. ఆడపిల్లలపై వివక్ష చూపకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ బాలురతో సమానంగా పెంచాలన్నారు. కార్యక్రమంలో మడికొండ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, స్వర్ణలత, హైమావతి, అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, శారద, రజిత, మంజుల, జ్యోతి, స్వరూప, రాజ్యలక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ తిరుమల్‌రావు

ఎస్‌వీఎస్‌లో అంతర్జాతీయ సదస్సు

భీమారం, జనవరి 27: భీమారంలోని ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో శనివారం అరికాన్-2024 పేరుతో రెండురోజుల అంతర్జాతీయ సదస్సు ఎస్‌వీఎస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అధ్యక్షతన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిట్స్‌పిలాని ప్రొఫెసర్ చిత్తరంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ప్రపంచంలో కృత్రిమ మేథస్సు, కొత్త ఆవిష్కరణను తెలియజేశారు. అదే విధంగా విద్యార్థులు, ప్రొఫెసర్ ప్రతిరోజు కాలానికి అనుకూలంగా మేథస్సును పెంచుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ తిరుమల్‌రావు మాట్లాడుతూ.. తమలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడంతోపాటు సమాజానికి ఉపయోగపడే పరిశోధన పత్రాలను సమర్పించాలన్నారు.

ఈ సదస్సులో వివిధ దేశాల నుంచి సుమారు 400 మంది పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సదస్సుకు కన్వీనర్‌గా డాక్టర్ సూర్యకాంత్ తోర, వక్తగా ప్రొఫెసర్ రోమన్ అత్రి (యూఎస్ఏ), ప్రొఫెసర్ ఎడ్వర్డ్ జే (యూఎస్ఏ)లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్ సెక్రటరీ అనూప్, డాక్టర్ ఇవి.రావు, డాక్టర్ హర్షిణి, ప్రిన్సిపాల్, డైరెక్టర్స్, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఆర్ ఎస్ఐ రమేష్‌కు ఘన సన్మానం



ఎస్ఐ రమేష్ దంపతులను సన్మానిస్తున్న పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు

హనుమకొండ స్పోర్ట్స్, జనవరి27: పోలీస్ శాఖలో ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవా పతకం సాధించిన హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన జి.రమేష్‌ను శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం హనుమకొండ 4వ డివిజన్ రెడ్డికాలనీలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఆర్ ఎస్ఐ రమేష్ దంపతులను రమేష్‌తోపాటు సంఘ సభ్యులు గజమాలతో సన్మానించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నరేందర్, మహేందర్, బత్తుల మహేష్, గంజి రాజేందర్, శ్రీనివాస్, రాజు, నవీన్, శ్రీధర్, సురేష్, పాల్గొన్నారు.

హడుప్సా స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ప్రారంభం



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఇన్‌స్పెక్టర్ జి. వేణు

కాజీపేట, జనవరి 27: హనుమకొండ డిస్ట్రిక్ట్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (హడుప్సా) ఆధ్వర్యంలో శనివారం తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కాలేజీలో స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మడికొండ ఇన్‌స్పెక్టర్ జి.వేణు, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చేర్మన్ తాళ్ల మల్లేశం, బన్సాల్ కాలేజీ అధినేత వి.వెంకటరమణరెడ్డి హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌లను ప్రారంభించారు. వీరిని క్రీడాకారులు గౌరవ వందనంతో ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మడికొండ ఇన్‌స్పెక్టర్ జి.వేణు మాట్లాడుతూ.. ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. విద్యార్థులు క్రీడల్లో జాతీయస్థాయిలో ఎదగడానికి పాఠశాల స్థాయి నుంచే ఎదగాలన్నారు. అనంతరం తాళ్ల మల్లేశం మాట్లాడుతూ.. హడుప్సా నిర్వహించే ఎలాంటి కార్యక్రమాలకైనా తన సహకారం ఉంటుందన్నారు. అనంతరం కబడ్డీ, ఖో-ఖో, పరుగుపందెం, క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో 1220 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హడుప్సా జిల్లా అధ్యక్షుడు వర్ధమాను జనార్దన్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ, కోశాధికారి డి.శంకర్, స్పోర్ట్స్ కన్వీనర్ బి.వెంకట్‌రెడ్డి, అర్.షణ్ముకాచారి, తాళ్ళ వంశీ, టి.బుచ్చిబాబు, ఎస్. శ్రీనివాసరెడ్డి, ఎం.సంతోష్‌రెడ్డి వివిధ పాఠశాలల కరస్పాండెంట్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం

ఐనవోలు, జనవరి 27: ఐనవోలు దేవస్థానం మాజీ ఛైర్మన్, నందనం కర్షక సేవా సహకార సంఘం (సొసైటీ) డైరక్టర్ వడిచర్ల శ్రీనివాస్ ఇటీవల మృతిచెందింది తెలిసిందే. సొసైటీ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డైరక్టర్లు అందరూ కలిసి బాధిత కుటుంబానికి రూ.1లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేశారు. శనివారం శ్రీనివాస్ కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ చందర్‌రావు, మేటి చిరంజీవి, మాదారపు సంపత్‌రావు, చింత బాబు, బొమ్మినేని బుచ్చిరెడ్డి, రాజారపు కుమార్, పూజారి రాంచందర్, బీరు పద్మ, కలకోట ఎలేంద్ర, సర్పంచ్ జన్ను కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న చైర్మన్ రవీందర్‌రావు, డైరెక్టర్లు



ఎన్నో లాభాలిచ్చే పద్మాసనం

యోగాలో ఒక ముఖ్యమైన ఆసనం- పద్మాసనం. ఒకప్పుడు చిన్నపిల్లల చేత ఈ ఆసనాన్ని తప్పనిసరిగా వేయిస్తూ ఉండేవారు. ఈ ఆసనం వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు ఎంతో మేలు జరుగుతుంది. యోగా నేర్చుకోవాలనుకొనే వారందరికీ పద్మాసనం ఒక తొలి మెట్టు. ఈ పద్మాసనం వల్ల కలిగే ఆరోగ్యపరమైన లాభాలేమిటో చూద్దాం.


- మోకాళ్లు, పిరుదులు, చేతి మణికట్లలో ఈ ఆసనం వల్ల కదిలికలు ఏర్పడతాయి. దీని వల్ల రక్తప్రసరణ బాగా పెరుగుతుంది. నెప్పులు తగ్గుతాయి.
- వెన్ను నెప్పి ఉన్నవారికి ఈ ఆసనం ఎంతో ఉపకరిస్తుంది. వెన్నెముక చుట్టూ ఉన్న కండరాలను ఈ ఆసనం బలోపేతం చేస్తుంది. నిలబడినప్పుడు శరీరం నిటారుగా ఉండేడట్లు చేస్తుంది.
- పద్మాసనం వేసి కూర్చొన్నప్పుడు మన ఉచ్ఛ్వాస నిశ్వాచాలలో మార్పు ఏర్పడుతుంది. ఊపిరి క్రమబద్ధీకరణ జరిగినప్పుడు మనసు ప్రశాంతంగా మారుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.
- ధ్యానం చేసేవారు ఆ ఆసనంలో కూర్చుని.. ధ్యానం చేయాలి. అప్పుడే సరైన ఫలితాలు లభిస్తాయి.
- యోగశాస్త్రం ప్రకారం- ఈ ఆసనంలో కూర్చుని ధ్యానం చేయటం వల్ల శరీరంలో ఉన్న శక్తికేంద్రాలు, చక్రాలు ఉత్తేజితమవుతాయి.
- బీపీ సమస్య ఉన్నవారు ప్రతి రోజు ఒక అరగంట ఈ ఆసనంలో కూర్చుంటే బీపీ సమస్య తగ్గుతుంది. ఇదే విధంగా నరాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఇది ఎంతో ఉపకరిస్తుంది.
- రుతుస్రావ సమస్యలున్న మహిళలకు ఇది చాలా ఉత్తమమైన ఆసనం.

ఆసనాన్ని ఎలా వేయాలి?

నేల మీద కూర్చుని.. కుడి అరికాలిని ఎడమ తొడపైన.. ఎడమ అరికాలిని కుడి తొడపైన ఉంచాలి. వెన్ను నిటారుగా ఉంచి కూర్చోవాలి. చూపుడు వేలు, బొటకన వేళ్లను ఒక దానితో మరొకటి కలపాలి. అరిచేతులను ఆకాశంవైపు పెట్టాలి. ఊపిరిపై ధ్యాస పెట్టాలి. దీర్ఘ శ్వాస తీసుకొని ఐదు సెకన్లు బిగపెట్టి శ్వాసను వదిలివేయాలి.

సండే సెలబ్రిటీ

ఆ మందలింపు అభినందనలా అనిపించింది



'మజిలీ'లో హీరో లవర్ చనిపోయుంటుంది. ఆమెకు ఓ కూతురుంటుంది. ఆ అమ్మాయికీ... వాళ్ల అమ్మ గురించి, వాళ్ల ప్రేమ గురించి వివరించి చెబుతాడు హీరో ఫ్రెండ్ జాంటీ. ఆ పాత్ర చేశాడు **సుహాస్**. అప్పటికి తన పేరు ఎవరికీ పెద్దగా తెలియదు. కానీ ఆ సన్నివేశంలో చాలామంది అతనిలో హీరోను చూశారు. ఛాయ తక్కువైనా ఏదో తెలియని ఆకర్షణ. పెద్దగా ఎత్తు లేకపోయినా అద్భుతమైన గొంతు. కొన్ని కథలకు అతికినట్టు సరిపోయే బాడీ లాంగ్వేజ్. అనుకున్నట్టే హీరోగా తొలి చిత్రం 'కలర్‌ఫొటో'తో హిట్ కొట్టేశాడు. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్'తో మరో హిట్ తన ఖాతాలో వేసుకోవాలనుకుంటున్న సుహాస్‌తో 'నవ్య' ముచ్చట్లు.

ఏంటి? హ్యాట్రిక్‌కి రెడీ అయ్యారా?

అది జనం చేతిలో ఉందండీ. మంచి కథ. తప్పకుండా హిట్ అవుతుందని అనుకుంటున్నాను.

మీ పాత్ర ఎలా ఉంటుంది?

కొత్తగా ఉంటుంది. ఇది కవలలైన అక్కాతమ్ముళ్ల కథ. ఓ పుట్టినరోజు వారిద్దరి జీవితంలో అనూహ్యమైన మార్పుకు కారణమవుతుంది. అదేంటనేది తెరపైనే చూడాలి. నేపథ్యం కొత్తగా ఉంటుంది.

విభిన్నమైన కథల్ని ఎంచుకుంటున్నారు. జడ్జిమెంట్ మీదేనా? వెనక అదృశ్యశక్తి ఉందా?

లేదండీ. పూర్తిగా జడ్జిమెంట్ నాదే. నా సర్కిల్ పెద్దది. నా ఫ్రెండ్సే నా డైరెక్టర్లు. యూట్యూబ్‌లో షార్ట్‌ఫిల్మ్స్ చేసే రోజుల నుంచి మేం కలిసే ఉన్నాం. వాళ్లలో కొందరికి డైరెక్టర్ కావాలని ఆశ. నేను హీరో అయ్యాను కదా.. వాళ్లందర్నీ దర్శకుల్ని చేసే పనిలో ఉన్నాను. (నవ్వుతూ)

స్నేహితులందరూ మంచి దర్శకులవుతారని గ్యారంటీ ఉందా?

తప్పకుండా అవుతారు. నా స్నేహితుల గురించి నాకు తెలుసు. ఇప్పటి వరకూ నేను చేసిన కథలు వాళ్లవే. చేయబోతున్న కథలు కూడా వాళ్లవే. అన్నీ అద్భుతంగా ఉంటాయి.

బయట నిర్మాతలకు దొరకనంత బిజీ అయిపోయారని బయట టాక్..?

నిజమేనండీ. ఉన్న కమిట్‌మెంట్లు పూర్తవ్వడానికే రెండుమూడేళ్లు పట్టేలా ఉంది. లైన్లో మొత్తం ఎనిమిది సినిమాలున్నాయి. నిర్మాతలు కూడా రెడీగా ఉన్నారు. బయట కథలు వింటే వాళ్లు ఊరుకోవడం లేదు. ఏంచెయ్యమంటారు? అందుకే, ముందు ఓ రెండుమూడు సినిమాలు పూర్తి చేసేసి, తర్వాత వినడం మొదలుపెడతా.

ఇంత బిజీని ముందు ఊహించారా?

అస్సలు లేదండీ. తెరపై కనిపిస్తే చాలని అనుకున్నాను. హీరో ఫ్రెండ్ వేషాలు వచ్చినప్పుడు తెగ సంబరపడిపోయా. తెరపై నన్ను నేను చూసుకున్నప్పుడు సాధించేశానని గర్వపడిపోయా. ఇప్పుడు ఏకంగా హీరోనే అయిపోయా. అంతా కలలా ఉంది.

ఎలా ఎదగాలనుకుంటున్నారు? స్టార్‌గానా? నటుడిగానా?

నటుడిగానే. నాకు నటన అంటే పిచ్చి. విభిన్న పాత్రలు చేయాలి. జన హృదయాల్లో నిలిచిపోవాలి. అందుకే 'హిట్ 2'లో విలన్‌గా కూడా చేశాను. ఆ పాత్రకు అభినందనలతోపాటు అవార్డులు కూడా వచ్చాయి.

'హిట్ 2'లో విలన్‌గా మిమ్మల్నెలా అనుకున్నారు?

అదేకదా డెస్టినీ. డైరెక్టర్ శైలేష్ నాకు మంచి ఫ్రెండ్. పైగా ఆ సినిమా ప్రొడ్యూసర్ నాని అన్న. తను చేయమన్నాడు చేసేశాను. అది నా కెరీర్‌లో ప్రత్యేకమైన సినిమా.

> మళ్లీ విలన్‌గా చేయమంటే చేస్తారా? తప్పకుండా చేస్తాను. హీరోగానే చేస్తానని గిరిగీసుకుని కూర్చునే రకంకాదు నేను. నాకు భేషజాలేం లేవు. కేరక్టర్ నచ్చితే చాలు.

అమ్మానాన్న ఎలా ఫీలవుతున్నారు?

చాలా సంతోషిస్తున్నారు. వాళ్లు విజయవాడలో ఉంటారు. మాది విజయవాడ. అప్పుడప్పుడు ఖాళీ చూసుకొని వెళ్తావుంటా. మొన్న వినాయక చవితికి వెళ్లా. 'రేయ్ నువ్వు పదేపదే రాకు. నీవల్ల వినాయకచవితి చందా పెంచేశారు. వంద రూపాయలిచ్చేవాళ్లం. ఇప్పుడు వేలకువేలు అడుగుతున్నారు' అంటూ సున్నితంగా మందలించారు. అది నాకు మందలింపులా అనిపించలేదు. అభినందనలా అనిపించింది.

రెమ్యునరేషన్ భారీగా పెంచేశారా?

అన్యాయమండీ. నా పరిధి ఏంటో నాకు తెలుసు. నామీద ఎంత ఖర్చు పెట్టొచ్చో అంతకు పైసా కూడా బడ్జెట్ పెరగనివ్వను. అందుకు తగ్గట్టే పారితోషికం కూడా తీసుకుంటాను. నిర్మాతల్ని ఇబ్బందిపెట్టే టైప్ కాదు నేను. (నవ్వుతూ)

తండ్రి అయినట్టున్నారు..?

అవును. మొన్ననే బాబు పుట్టాడు. అదో గమ్మత్తయిన ఫీలింగ్. ఇన్నాళ్లూ నేను ఒకళ్ల కొడుకుని. ఇప్పుడు నాకు ఒక కొడుకు. పెద్దరికం వచ్చేసినట్టుంది.

మీది లవ్ మ్యారేజా?

అవును. డిగ్రీ చదువుతున్న రోజుల్లో ఇష్టపడ్డాం. కెరీర్ మీద నమ్మకం కుదరగానే పెళ్లి చేసేసుకున్నాం. ఇంట్లోవాళ్లు కూడా పెద్ద ఇబ్బంది పెట్టలేదు. తేలిగ్గానే ఒప్పేసుకున్నారు.

బ్యాగ్రౌండ్ లేకుండా ఈ స్థాయికి వచ్చారు కదా? ఏవైనా అవమానాలు ఎదురయ్యాయా?

పెద్దవాళ్లు ఎప్పుడూ పద్ధతిగానే ఉంటారు. కింది స్థాయివాళ్ల దగ్గరే ఎవరికైనా ఇబ్బందులు వచ్చేది. అందరిలాగే నేనూ ఇబ్బందుల్నీ, చిన్న చిన్న అవమానాలనూ ఎదుర్కొన్నాను. కానీ వాటిని సీరియస్‌గా తీసుకోలేదు. నా దగ్గర అలా బిహేవ్ చేసినవాళ్లు కనిపిస్తే.. నేనే పలకరిస్తాను. చెడ్డవాళ్లెవరూ ఉండరు. నా కెరీర్ ఈ స్థాయిలో ఉందంటే అందరి సహకారం వల్లే కదా.

• నరసింహ బుర్రా

భరద్వాజీయం

అంతా దాడికి సిద్ధమైన సమయంలో...

తెలుగు చిత్ర పరిశ్రమ మద్రాసు నుంచి హైదరాబాద్‌కు వచ్చే క్రమంలో చిత్రవిచిత్ర సంఘటనలు చోటుచేసుకున్నాయి. 1955లో 'రోజులు మారాయి' వంద రోజుల వేడుక కోసం నగరానికి వచ్చిన సందర్భంలో రామకృష్ణ ప్రసాద్ గారు ఇక్కడ స్టూడియో కడదాం అనుకున్నారు. సీవీఆర్ ప్రసాద్ గారు, నాన్న తమ్మారెడ్డి కృష్ణమూర్తి గారు వచ్చి 'సారథి స్టూడియోస్' కోసం స్థలం చూశారు. ఆ వెంటనే కొన్ని ఫ్లోర్స్‌తో స్టూడియో ప్రారంభించారు. స్టూడియో అభివృద్ధి పనులు సాగుతున్న సమయంలో అక్కినేని నాగేశ్వరరావు గారు కొన్ని కారణాలవల్ల మద్రాసు నుంచి వచ్చేసి... హైదరాబాద్‌లోనే సినిమా చేస్తానన్నారు. దాంతో 'సారథి స్టూడియోస్' బాగా బిజీ అయిపోయింది. ఆ తరువాత ఎన్టీ రామారావు గారు కూడా ఇక్కడకు వచ్చేశారు. అప్పటికి అన్ని క్రాఫ్ట్స్ అందుబాటులోకి రాలేదు. మన ఫిలిం చాంబర్ లాంటివన్నీ మద్రాసులోనే ఉండేవి. అయితే హైదరాబాద్‌లో తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా ఇక్కడ 'ఏపీ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్' బ్రాంచ్ ఒకటి పెట్టాం. వాస్తవానికి 1940ల్లోనే ఆంధ్రాలో ఫిలిమ్ చాంబర్ ఏర్పాటైంది. అయితే హైదరాబాద్‌లో 'తెలంగాణ స్టేట్ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్' అని వేరే ఉండేది. ఆ తరువాత జరిగిన పరిణామాల్లో 'ఏపీ చాంబర్' ఇక్కడకు మారింది. అలాగే మద్రాసులోని 'తెలుగు చిత్ర నిర్మాతల మండలి'ని కూడా హైదరాబాద్‌కు తీసుకువచ్చాం. దానికి దాసరి నారాయణరావు గారు అధ్యక్షుడిగా, కేఎస్ రామారావు గారు కార్యదర్శిగా, నేను ఉపాధ్యక్షుడిగా ఉండేవాళ్లం.

ఈ తరుణంలో.. అంటే 1992-93 ప్రాంతంలో మేం అనుకున్నాం... 'పరిశ్రమ అంతా ఇక్కడే ఉన్నప్పుడు... మద్రాసు నుంచి నియంత్రణ ఎందుకు' అని. అప్పటికి దాసరి గారు, ఇంకా చాలామంది హైదరాబాద్‌కు రాలేదు. ఆయన అప్పటికే ఇక్కడ చాలా చిత్రాలు తీశారు. అయితే మద్రాసు నుంచి వచ్చి వెళుతుండేవారు. స్థానికంగా స్థిరపడిన వారితోనే పని చేద్దామనే ఆలోచనతో వీబీ రాజేంద్ర ప్రసాద్ గారు అధ్యక్షుడిగా ఒక కమిటీ ఏర్పాటు చేసి, 'తెలుగు ఫిలిమ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్' అని ఇక్కడ పెట్టాం.

అప్పుడు 'ఆలిండియా ఫిలిమ్ ఎంప్లాయీస్ కాన్ఫడరేషన్' అని ఉండేది. మద్రాసుతో పాటు ముంబయి, కోల్‌కతా, బెంగళూరుల్లో మాత్రమే దీని శాఖలు పని చేసేవి. అయితే తెలంగాణలోని ఫెడరేషన్‌ను వాళ్లు గుర్తించలేదు. దాంతో హైదరాబాద్‌లో కూడా మద్రాసు నుంచి వచ్చిన వర్కర్లే పని చేయాలని వాళ్లు అప్పుడు పట్టు పట్టారు. ఏదో పంచాయతీ నడుస్తూ ఉండేది. 'ముప్పై శాతం మేము... మిగిలింది మీరు' అన్నట్లు ఏవో చర్చలు జరుగుతుండేవి. జూనియర్ ఆర్టిస్టులు ఇక్కడే ఉండేవారు. ఫైటర్స్ డ్యాన్సర్లు అక్కడ. వాళ్లు ఇక్కడివారిని చేయనిచ్చేవారు కాదు. ఆ సమయంలోనే మేం ఈ నిర్మాతల మండలి ఏర్పాటు చేశాం. అది మద్రాసులోని కొంతమంది పెద్దలకు కోపం తెప్పించింది. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ... హైదరాబాద్‌లో తీసే సినిమాలకు తమ వర్కర్స్‌నే పెట్టుకోవాలనే డిమాండ్‌తో... 'సౌంతిండియన్ ఫిలిమ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్' సమ్మెకు పిలుపునిచ్చింది. దాంతో ఇక్కడ షూటింగ్‌లన్నీ ఆగిపోయాయి. దాసరి గారి 'మాయాబజార్' షూటింగ్ మద్రాస్‌కు మారింది. కె.విశ్వనాథ్ గారు కమల్‌హాసన్‌తో తీస్తున్న 'శుభ సంకల్పం' కేరళకు, రాఘవేంద్రరావు గారి 'పెళ్లి సందడి' కర్ణాటకకు వెళ్లాయి. నాలాంటి చిన్నచిన్నవాళ్లం ఇక్కడే చేయాలనుకున్నాం. అయితే అక్కడి నుంచి టెక్నీషియన్లు ఎవరూ రాకూడదన్నారు. ఇక్కడేమో పూర్తిస్థాయిలో టెక్నీషియన్స్ లేరు. అప్పుడు నేను 'కూతురు' తీస్తున్నాను. ఉన్న టెక్నీషియన్స్‌తోనే చేసుకొంటూ పోయాను.

ఇలా నడుస్తుండగా... ఒక రోజు శ్యాంప్రసాద్‌రెడ్డికి ఫోన్ చేశాను. 'ఏమయ్యా... మనం ఇంతమంది ఇక్కడ ఉండి, షూటింగ్‌లు ఆపేస్తుంటే చేతగానివాళ్లలా ఊరుకోవాలా' అని తనతో అన్నాను. దాంతో సురేశ్‌బాబుకు ఫోన్ చేసి ఏంచేద్దామని శ్యాం అడిగాడు. అలా నేను, శ్యాం, సురేశ్‌బాబు, వెంకట్ అక్కినేని.. నలుగురం కలిసి సంప్రతింపుల కోసం మద్రాసు వెళ్లడం... రావడం జరుగుతోంది. ఆ క్రమంలో ఒక విమానంలో నిర్మాతలు, దర్శకులు, నటులు... 130 మందిని అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చాం. బాలకృష్ణ గారు కూడా అందులో ఉన్నారు. కొంత విజయం... కొంత అపజయంలా సాగుతున్నాయి మా ప్రయత్నాలు. ఒకే రోజు 'అన్నపూర్ణ స్టూడియో'లో 14 సినిమాలు ప్రకటించాం. నాగార్జున, వెంకటేష్, రాజశేఖర్ తదితర హీరోలతో పాటు స్థానికంగా ఉండే నటులతో క్లాప్ కొట్టాం. నేను, శివనాగేశ్వర రావు, కృష్ణవంశీ తదితరులం కలిసి తలా రెండు సినిమాలు అన్నట్లు హడావుడి చేశాం. అయితే తదనంతర పరిణామాల నేపథ్యంలో వాటిల్లో ఏ సినిమా ముందుకు వెళ్లలేదనుకోండి. ఏదేమైనా దానివల్ల మద్రాసులో సమ్మెవల్ల ఇక్కడ షూటింగ్‌లు సజావుగా సాగడానికి ఏంచేయాలి? ఎలా చేయాలి అనే ఆలోచన మొదలైంది. నేను, సురేష్‌బాబు, అక్కినేని వెంకట్, శ్యాంప్రసాద్ కలిసి నెలకు పైగా మద్రాసులోనే మకాం పెట్టి, రోజూ దాసరి ఇంటికి వెళ్లి, ఆయనతో చర్చించేవాళ్లం. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత గారి ఇంటికి కూడా వెళ్లాం. ఫిలిమ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వాళ్లతో కూడా సమావేశమయ్యాం. చాంబర్ ఆఫ్ కామర్స్‌ను కలిశాం. అందరూ అక్కడి వర్కర్స్‌కే మద్దతునిచ్చారు.

ఈ సమస్యకు పరిష్కారం ఇలా కాదనుకుని, చివరకు ఒక రాజీ మార్గానికి వచ్చాం. అదేంటంటే... వాళ్లు ఇక్కడి ఫెడరేషన్ తీసేయమన్నారు. సరేనని చెప్పి... వేరే పేరుతో ఒక సొసైటీలాగా పెట్టి, ఫెడరేషన్‌లోని వారందరినీ అందులో చేర్పిద్దామని అనుకున్నాం. అదే సమయంలో కోట శ్రీనివాసరావు గారు నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఆయన ఇంటి ఎదురుగానే మా ఆఫీస్ ఉండేది. ఆయన రోజూ నా దగ్గరకు వచ్చి... 'నేను దీక్షకు దిగుతా' అని బెదిరిస్తుండేవారు. ఒకరోజు ఉప్పలపాటి నారాయణరావు గారు కూడా మా ఆఫీసులో ఉన్నారు. కోట గారు అలా అనగానే... 'చేసేయ్ బాబాయ్' అన్నాం. ఏదో సరదాగా అన్నాం కదా అనుకొంటే.. కోట గారు నిజంగానే వెళ్లిపోయి దీక్షకు కూర్చున్నారు.

అప్పటికి ఆయన నిరాహార దీక్ష మొదలుపెట్టి ఆరు రోజులైంది. ఏడో రోజుకు అది తీవ్ర రూపం దాల్చింది. పెద్ద సమావేశం జరుగుతోంది. దాసరి గారు, చిరంజీవి గారు తదితర పరిశ్రమ పెద్దలందరూ ఆ సమావేశంలో ఉన్నారు. బయట నేను, ఫెడరేషన్ వర్కర్స్. వాతావరణం వేడిగా ఉంది. వర్కర్లు ఆవేశంతో ఊగిపోతున్నారు. భౌతిక దాడికి సిద్ధమవుతున్నారు. 'అరగంట చూద్దాం. ఈలోపు వాళ్లు హైదరాబాద్‌కు మారడానికి ఒప్పుకోకపోతే మీరు చెప్పినట్టే చేద్దాం' అని చెప్పాను. రోడ్డుకు అటూ ఇటూ కార్లు బారులు తీరాయి. అందులో మనకు మద్దతునిచ్చేవి... ఇవ్వనివీ ఉన్నాయి. డ్రైవర్లను పిలిచి మనకు మద్దతుగా ఉన్న కార్లన్నిటినీ పక్కకు తీసేయమన్నాను. తీసేశారు. మిగిలిన కార్లను పగలగొట్టడమో... తగలబెట్టడమో... ఏదో చేయడానికి మానసికంగా అందరూ సిద్ధమైపోయారు. నేను ఓకే అనేశాను. వీళ్లు బయలుదేరుతున్నారు. సరిగ్గా అదే సమయంలో దాసరి గారు, చిరంజీవి గారు బయటకు వచ్చారు... 'సమస్య పరిష్కారమైంది' అంటూ! దాంతో వీళ్లను హడావుడిగా ఆపేసి, కోట గారికి నిమ్మకాయ రసం ఇచ్చి, దీక్ష విరమింపజేశాం. మా సూచనలకు అనుగుణంగా, అంతా కలిసి పని చేసేలా ఒక నిర్ణయం తీసుకున్నారు. అలా అప్పటికి ఆ సమస్య పరిష్కారమైంది.

• **తమ్మారెడ్డి భరద్వాజ**, దర్శకనిర్మాత



అపజయాలొచ్చినా.. నడక ఆపను!

తొంభయ్యవ దశకంలో బాలీవుడ్‌లో పేరు తెచ్చుకున్న నటి 'రవీనా టాండన్'. ఆ మధ్య 'కేజీఎఫ్-2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రవీనా ఇపుడు వెబ్‌సిరీస్‌లతోనూ పాపులర్ అవుతోంది. ఆమె గురించి కొన్ని విశేషాలు..

ఇటీవలే 'కర్మ కాలింగ్' అనే వెబ్‌సిరీస్‌లో రవీనా టాండన్ నటించింది. ఆమె చేసిన ఇంద్రాణి పాత్రకు జనాలు ఫిదా అవుతున్నారు. దీంతో రవీనా టాండన్ మళ్లీ ఆమె కెరీర్ గాడిలో పడిందంటున్నారు కొందరు. రవీనా మాత్రం 'ఇదో మంచి కథ. వెబ్‌సిరీస్‌లతో మరిన్ని వైవిధ్యమైన కథలు చెప్పవచ్చు. ఈ ప్లాట్‌ఫామ్‌లో మంచి స్కోప్ ఉంది. ముఖ్యంగా కథానాయికలకు మంచి ఫుల్ లెంగ్త్ ఉన్న క్యారెక్టర్స్ దొరుకుతాయి. ఇదో గొప్ప అవకాశం' అంటోంది రవీనా.



అలా మా నాన్న వల్ల..

ఆ మధ్య కేజీఎఫ్-2 లో ప్రధాన మంత్రి పాత్రలో పవర్‌ఫుల్‌గా నటించింది. ఆమాటకొస్తే రవీనా కెరీర్‌లో ఒడిదుడుకులు ఉన్నా పట్టించుకోలేదు. చిన్న పాత్రలు చేసింది. 'అపజయాలకు భయపడను. నాకంటూ మంచి క్యారెక్టర్ వచ్చే వరకూ వెతుకుతా. చిన్నప్పుడు మానాన్న చెప్పేవాడు.. 'ఒక పిల్లవాడు కిందపడినా.. నడిచే వరకూ నడుస్తాడు. అలా పోరాటం చివరి వరకూ చేయాలని'. అందుకే నేను నడక ఆపను. వచ్చిన మంచి పాత్రలను ఎంచుకుంటా.

సోషల్ మీడియాతో సంతోషం..

సల్మాన్‌ఖాన్ జోడీగా 'పత్థర్ కే ఫూల్' చిత్రంతో 1991 సంవత్సరంలో బాలీవుడ్‌లోకి అడుగెట్టింది రవీనా. తొలి చిత్రానికే ఫిల్మ్‌ఫేర్ అవార్డు గెలుచుకుంది. 'క్షత్రియ', 'దిల్‌వాలే', 'జమానా దివానా', 'కీమత్- దే ఆర్ బ్యాక్', 'బడే మియాన్ చోటే మియాన్', 'పరదేశీ బాబు', 'దావన్'.. ఇలా హిందీ చిత్రాలతో మెప్పించింది. ఇటీవల ఓ ఆంగ్ల పత్రిక 'మీతో పాటు జూహీ చావ్లా, శిల్పా శెట్టి, మాధురీ దీక్షిత్.. లాంటి వారు ఉండేవారు. మీ తోటి నటులతో గొడవలు ఉన్నాయంట కదా?' అని అడిగితే రవీనా ఇలా చెప్పుకొచ్చింది.. 'ఆ రోజుల్లో అంటే 1990లో మ్యాగజైన్స్ ఎక్కువగా ఉండేవి. గాసిప్స్ ఎక్కువ రాసేవారు. మేమంతా స్నేహితులం. తోటి నటీమణులతో కలిసి నటించేదాన్ని. అయితే అప్పుడు మేం పుకార్లను ఆపలేకపోయాం. ఇప్పుడలా కాదు.. సోషల్ మీడియా ఉండటం ఎంతో సంతోషం. గొప్పగా అనిపిస్తుంది. పాతవాళ్లం అంతా ఇన్‌స్టాతో టచ్‌లో ఉంటాం. సల్మాన్, మాధురి.. ఇలా ఎవరిని కలిసినా ఫొటో దిగి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తాం. ఇక్కడ ప్రూఫ్ ఉంది. అలా పుకార్లకు తావు లేదు. ఇప్పుడే చాలా బావుంది..ఈ విషయంలో' అంటుంది రవీనా టాండన్.

సహనం అలా వచ్చింది..

'నా భర్త అనిల్ తడాని వల్ల ఈ స్టెబిలిటీ వచ్చింది. ఇంత సైలెంట్‌గా ఉన్నానంటే ఆయన ఆలోచనల ప్రభావమే. ఇకపోతే అమ్మ అయ్యాక.. ఎవరికయినా సహనం వస్తుంది. నాకూ అంతే! నా కూతురు, కొడుకు ఆలోచనలు, ఆశయాలు అనుగుణంగా సమయం కేటాయించాను. అందుకే సినిమాల విషయంలో శ్రద్ధ తీసుకోలేకపోయా. వారితో కలసి వెకేషన్స్‌కు వెళ్లటం, స్కూల్ ఫంక్షన్స్‌కు అటెండ్ అయ్యేదాన్ని. అయితే వారితో గడిపిన క్షణాలు అమూల్యమైనవి. రెండూ బ్యాలెన్స్ చేయటం కష్టమే కదా! ఇప్పుడిప్పుడే కాస్త సమయం దొరుకుతోంది. ఎందుకంటే పిల్లలు పెద్దవారయ్యారు కాబట్టి. ఫిల్మ్‌ఫేర్, జాతీయ అవార్డులు వచ్చాయి. పద్మశ్రీ లాంటి ఉన్నత పురస్కారం గతేడాది అందుకున్నా. ఓ నటిగా ఇలాంటి అవకాశాలు, అదృష్టం దొరుకుతుంది అనుకుంటా. ఏదేమైనా ఇతరుల మీద ఆధారపడకూడదు. ఆత్మవిశ్వాసంతో యువత పని చేయాలి' అంటుంది రవీన టాండన్.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/6I2DLBfలో చదవండి.

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/6sUv9kgలో చదవండి.


CHADALAVADA BROTHERS
PRESENTS
GRAND RELEASE
FEB 2ND
TRAILER
OUT NOW
ధీర
SRI VENKATESWARA FILMS
RADHAMADHAVI FILMS
#DHEERAMOVIE
/STTVFILMS


FEB
2
2024
GRAND RELEASE
WORLDWIDE
BUNNY VAS & VENKATESH MAHA
PRESENT
అంబాజీపేట
మ్యారేజి బ్యాండు
DHEERAJ MOGILINENI
DUSHYANTH KATIKANENI


మీ జీతాలతో మా జీవితాలు మార్చండి
GLOBAL FILMS
KATHA VEERANDHA
FEBరవరి
2nd
టాకీస్ ల కలుద్దాం
బూట్ CUT
బాలరాజు
MD. PASHA
SREE KONETI


ఫిబ్రవరి
2న
విడుదల
TEENA SREE CREATIONS
PRODUCER M NAGA MUNEIAH (MUNNA)
CO - PRODUCERS NANDIPATI SRIDHAR REDDY KONDRASI UPENDER
STORY - SCREENPLAY - DIALOGUES - DIRECTION MUNI SAHEKARA
MECHANIC
మెకానిక్
TROUBLE SHOOTER


PRIMESHOW ENTERTAINMENT
SRI CHAITANYA PRESENTS
తొంభై రెండు సంవత్సరాల తెలుగు సినిమా
సంక్రాంతి రికార్డుల చరిత్ర తిరగరాసిన హనుమాన్
॥ జై శ్రీరామ్ ॥
3RD
WEEK
PRASANTH VARMA CINEMATIC UNIVERSE
హను-మాన్
PRODUCED BY K NIRANJAN REDDY
WRITTEN & DIRECTED BY PRASANTH VARMA
TELUGU HINDI MARATHI TAMIL KANNADA MALAYALAM ENGLISH SPANISH KOREAN CHINESE JAPANESE


PRE GAME EVENT
TOMORROW
FEBRUARY
2ND
RELEASE
WORLDWIDE
GAME ON


VALENTINES WEEK RELEASE
MILLION DOLLAR STUDIOS
A MARUTHI TEAM PRODUCT
A SKN RELEASE
TRUE
LOVER
TEASER FROM TOMORROW
think music



విద్యార్థినికి బహుమతి ఇస్తున్న మంత్రి సీతక్క, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ చైర్మన్ నారా భువనేశ్వరి

నాకు రాజకీయ జీవితం ఇచ్చింది చంద్రబాబునాయుడే: సీతక్క

మొయినాబాద్ రూరల్, జనవరి 27: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చారని రాష్ట్ర మహిళ, శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఎన్టీఆర్ విద్యా సంస్థల ద్వారా ఎన్టీఆర్ ట్రస్ట్ ఎందరో నిరుపేదలకు విద్య అందిస్తోందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా గండిపేటలోని ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం ఏర్పాటైన ఎన్టీఆర్ పాఠశాల అంచెలంచెలుగా ఎదిగినందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. నిరుపేదలు, మహిళలు, విద్యార్థుల కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. గండిపేటలోని ఎన్టీఆర్ పాఠశాలకు తనకు చాలా అనుబంధం ఉందని చెప్పారు. తమ ప్రాంతానికి చెందిన ఎందరో నిరుపేద పిల్లలకు చంద్రబాబునాయుడు సహకారంతో ఎన్టీఆర్ పాఠశాలలో ఉచిత విద్య అందించానని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ చైర్మన్ నారా భువనేశ్వరి మాట్లాడుతూ మహిళలను శక్తిమంతులుగా తయారు చేయడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. నిరుపేదలకు విద్య అందించాలనే సంకల్పంతో ఎన్టీఆర్ పాఠశాల స్థాపించామని, తమ విద్యాసంస్థలో చదువుకున్న వారు నేడు ఉన్నతస్థాయిలో ఉన్నారని వెల్లడించారు. ఇక, వివిధ అంశాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీతక్క, భువనేశ్వరి బహుమతులు అందజేశారు.

బిమ్మ తిరిగి అమ్మ ఒడికి!

(మొదటి పేజీ తరువాయి)

అవుతున్న పరిస్థితి. షర్మిలను కట్టడి చేయడానికి, తన సోషల్ మీడియాను, పార్టీ నేతలను ఆయన మొదట ఉసిగొల్పారు. ఇది ఆమెను మరింత రెచ్చగొట్టినట్టయి.. ఇంకా డోస్ పెంచేలా చేసింది. ఇప్పుడిక ఆమె ఇంకెన్ని అంతఃపుర రహస్యాలను బయటపెడతారోనన్న భయం జగన్‌కు అరికాళ్లలోంచి వణుకు పుట్టేలా చేసింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు జగన్‌కు తన భవిష్యత్తు ఏంటో కళ్ల ముందు సాక్షాత్కరించేలా చేశాయి. ఇక తల్లి విజయలక్ష్మి విషయానికొస్తే.. ఒక దశలో తనను జగన్ ఈసడించుకొని, ఇంటి నుంచి తరిమేసినంత పనిచేయడంతో ఆమె కూతురు షర్మిల వద్దే ఉండిపోయారు. పార్టీ గౌరవాధ్యక్షురాలి పదవి నుంచి ఆమెతోనే రాజీనామా చేయించిన ఘన చరిత్ర జగన్‌ది. చివరికి ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు కూడా చెప్పలేని స్థాయిలో జగన్ ద్వేషం పెంచుకున్నారు. అవసరార్థం పొడిపొడిగా మాట్లాడటం వినహా ఆమెను ఈ మధ్య కాలంలో తల్లిగానే చూడలేదని చెప్పవచ్చు. అలాంటి జగన్‌కు షర్మిల దెబ్బతో తల్లి గుర్తొచ్చింది. ఇన్నాళ్లూ 'రాక్షసులు, మారీచులతో పోరాడుతున్న మీ బిడ్డను ఆశీర్వదించండంటూ' ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ వచ్చిన జగన్‌కు.. షర్మిల దెబ్బతో తాను మళ్లీ విజయమ్మ బిడ్డను అన్న విషయం గుర్తొచ్చింది. అమ్మా.. నువ్వే శరణం అంటూ విజయలక్ష్మికి ఫోన్ చేసి ప్రాథేయపడినట్టు విశ్వసనీయ సమాచారం. "పరిస్థితి ఏమీ బాలేదు. ప్రజా వ్యతిరేకత అనే అగ్నికి చెల్లి షర్మిల ఆజ్యం పోస్తోంది. నేను ఓడిపోతే జైలుకెళ్లాల్సి వస్తుంది. కేసుల్లో కచ్చితంగా శిక్ష పడే అవకాశం ఉంది. అదే జరిగితే మళ్లీ ఎప్పటికి బయటికొస్తానో తెలియదు. నా జీవితం జైలుకే అంకితమైపోతుంది. నువ్వు రావాల్సిందే.. నన్ను ఆదుకోవాల్సిందే" అని ఆమెను బతిమలాడుకున్నట్లు తెలిసింది. ఎప్పుడూ పెడసరంగా మాట్లాడే జగన్.. ఇలా దీన వచనాలు వల్లించడం, ఆయన స్వరంలో వినిపించిన ఆందోళనతో ఆమెకు పరిస్థితి అర్థమైంది. మరీ ముఖ్యంగా జైలు జీవితం గురించి చెప్పిన మాటలతో ఆమె మనసు కరిగింది. ఇన్నాళ్లూ ఎన్ని వేధింపులకు గురిచేసినా కొడుకుని వదులుకోలేం గదా అన్న ఉద్దేశంతో జగన్‌కు సాయం చేసేందుకు ఆమె ముందుకొచ్చినట్టు సమాచారం. జగన్ కోరిన విధంగా ఆయనకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించేందుకు ఆమె అంగీకరించినట్లు తెలిసింది.

షర్మిల వారించినా..

జగన్‌తో విభేదాల నేపథ్యంలో ఇన్నాళ్లూ విజయలక్ష్మి.. తన బిడ్డ షర్మిల వైపే ఉన్నారు. తెలంగాణలో షర్మిల పార్టీ పెట్టినప్పుడు ఆమె వెన్నంటే ఉన్నారు. కొన్ని సందర్భాల్లో షర్మిలకు మద్దతుగా రోడ్డెక్కారు కూడా. కానీ ఇప్పుడు కొడుకు శోకాలు చూసి ఆమె కరిగిపోవడాన్ని షర్మిల తీవ్రంగా వ్యతిరేకించినట్టు సమాచారం. తనకు పూర్తిగా అన్యాయం చేసి, ఎన్నో అవమానాల పాల్జేసిన జగన్ నైజాన్ని తాను ప్రజల ముందుంచుతుంటే.. తల్లి జగన్‌కు మద్దతుగా రాష్ట్రంలో పర్యటించి, ప్రచారం చేయడం సరికాదని ఆమె అభ్యంతరం చెప్పినట్లు తెలిసింది. షర్మిల కాదంటున్నా.. కొడుకు దీన స్థితి దృష్ట్యా తాను అండగా నిలువక తప్పదని భావిస్తున్నానని విజయలక్ష్మి తన సన్నిహితుల వద్ద పేర్కొన్నట్టు సమాచారం. మొత్తం మీద రానున్న రోజుల్లో జగన్‌కు వ్యతిరేకంగా చెల్లి, అనుకూలంగా తల్లి రాష్ట్రంలో పర్యటించబోతున్నారన్న మాట! తన కుమారుడికి మరో అవకాశం ఇవ్వాలని, పదవీ భిక్ష పెట్టాలంటూ గతంలో మాదిరి బైబిల్ చేతబట్టుకొని విజయలక్ష్మి మరోసారి ప్రజల్లోకి రాబోతున్నారని స్పష్టమవుతోంది!

వైసీపీలో వైఎస్సార్ లేరు!



నెల్లూరు/ఒంగోలు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): "వైసీపీలో వైఎస్సార్ లేరు. వై అంటే వైవీ సుబ్బారెడ్డి, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే సజ్జల రామకృష్ణారెడ్డిగా పార్టీ మారింది. ఆ ముగ్గురే నడిపిస్తున్నారు. సొంత వాళ్లు అనుకుని నాడు 3,800 కి.మీ.మేర పాదయాత్ర చేశా. వైసీపీ జెండాను భుజాన వేసుకొని ఊరూరా తిరిగా. రక్తాన్ని చెమటగా మార్చి పనిచేశా. అలాంటి నాపై వైసీపీ నేతలు ముప్పేట దాడి చేస్తున్నారు" అని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. "రాజశేఖరరెడ్డి వారసుడినంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెట్టావు. ఆయన ఆశయాలు ఒక్కటైనా నెరవేర్చావా? ప్రజాప్రయోజనాలను పట్టించుకోకుండా వైఎస్సార్ తీవ్రంగా వ్యతిరేకించే బీజేపీకి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టావు" అని జగన్‌పై నిప్పులు చెరిగారు. శనివారం నెల్లూరు, ఒంగోలు ప్రాంతాల్లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో షర్మిల పాల్గొన్నారు. వైఎస్సార్ పాలనకు, జగన్ పాలనకు నక్కకు నాగలోకానికీ ఉన్నంత తేడా ఉందన్నారు. రూ.8 లక్షల కోట్ల అప్పు తెచ్చిన జగన్ ఆ నిధులు ఏం చేశారని ప్రశ్నించారు. రూ.70 వేల కోట్ల విలువజేసే గంగవరం పోర్టును రూ.600 కోట్లకే అదానీకి రాసిచ్చేశారని, ఇంతకన్నా అన్యాయం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. గంగవరం పోర్టును అభివృద్ధి చేసేందుకే రూ.600 కోట్లకు అమ్మేశామని చెబుతున్న సజ్జల రామకృష్ణారెడ్డికి కొంచెమైనా సిగ్గుందా? అని ప్రశ్నించారు.

అ'క్రమబద్ధీకరణ'లను రద్దుచేయాలి: రియల్టర్స్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): హైదరాబాద్, నగర శివారు ప్రాంతాల్లో జీవో 59 పేరుతో గత ప్రభుత్వ హయాంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములను దొడ్డిదారిన పెద్దలకు క్రమబద్ధీకరించిన వ్యవహారాలకు సంబంధించి విచారణ చేపట్టాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. అక్రమాలు నిర్ధారణైతే క్రమబద్ధీకరణలను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంస్థ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం 'అంతులేని అక్రమబద్ధీకరణ' శీర్షికతో ఆంధ్రజ్యోతి వార్తా కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. జీవో 59పై ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తా కథనం అక్షరసత్యమని నారగోని అన్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు పరిపూర్ణ కన్నుమూత

- 'భక్తప్రహ్లాద' సినిమాలో బాల ప్రహ్లాద పాత్రధారణ



హైదరాబాద్ సిటీ, జనవరి27(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధురాలు, తొలితరం వామపక్ష విద్యార్థి సంఘం నాయకురాలు, రచయిత్రి నంబూరి పరిపూర్ణ(92) ఇకలేరు. బెంగుళూరులోని పెద్దకుమారుడి వద్ద ఉంటున్న ఆమె శుక్రవారం రాత్రి చనిపోయారు. పరిపూర్ణ జీవిత సహచరుడు దివంగత భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు దాసరి నాగభూషణరావు. పరిపూర్ణ ఏడవ ఏట నుంచే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య పోరాట సభలు, సమావేశాలలో దేశభక్తిగీతాలు ఆలపించారు. బ్రిటీష పాలకులకు వ్యతిరేకంగా కృష్ణాజిల్లా కేంద్రంగా సాగిన 'ఆకలి యాత్రలు' లాంటి నిరసన కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించారు. జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి జైలుకెళ్లారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలోనూ క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. చిన్నతనం నుంచి సంగీత, నాటక రంగాలలో అభినివేశం కలిగిన పరిపూర్ణ 1941నాటి 'భక్తప్రహ్లాద' సినిమాలో బాల ప్రహ్లాద పాత్రలో నటించారు. మద్రాసు రేడియో బాలగాయనిగా అనేక దేశభక్తి పాటలు ఆలపించారు.

టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కోలకు కొత్త డైరెక్టర్లు

- నోటిఫికేషన్ జారీకి ఆయా సంస్థలకు ప్రభుత్వ ఆదేశం

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలోని టీఎస్ ట్రాన్స్‌కో, టీఎస్ జెన్‌కోలకు కొత్త డైరెక్టర్లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నియామక ప్రక్రియ చేపట్టాలని, నోటిఫికేషన్ జారీకి చర్యలు తీసుకోవాలని ఆయా సంస్థలను ఆదేశించింది. ఈ మేరకు టీఎస్ ట్రాన్స్‌కో, టీఎస్ జెన్‌కోకు విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. టీఎస్ ట్రాన్స్‌కో జేఎండీ సి.శ్రీనివాసరావు, డైరెక్టర్లు జి.నర్సింగ్‌రావు(ప్రాజెక్ట్స్), ఇ.జగత్‌రెడ్డి(ట్రాన్స్‌మిషన్), జె.సూర్యప్రకాష్(లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్), బి.నర్సింగ్‌రావు(గ్రిడ్ ఆపరేషన్స్), జెన్‌కో డైరెక్టర్లు సీహెచ్ వెంకట్‌రాజం(హైడల్), ఎం.సచ్చిదానందం(ప్రాజెక్ట్స్), ఎస్.అశోక్‌కుమార్(హెచ్‌ఆర్), బి.లక్ష్మయ్య(థర్మల్), ఎ.అజయ్(సివిల్), టీఆర్‌కే రావు(కమర్షియల్ అండ్ ఫ్యుయెల్) నియామకాల్లో అప్పటి ప్రభుత్వం నిబంధనలు పాటించలేదని సర్కారు తెలిపింది. అందువల్ల ఆయా స్థానాలను కొత్తవారితో భర్తీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

రెండుచోట్ల వీగి.. మరోచోట నెగ్గి

- ఉమ్మడి నల్లగొండ జిల్లా మునిసిపాలిటీల్లో డ్రామా
- కౌన్సిలర్ గైర్హాజరుతో సూర్యాపేటలో..
- కోరం లేకపోవడంతో ఆలేరులో వీగిన తీర్మానాలు
- కోదాడలో నెగ్గిన అవిశ్వాసం

సూర్యాపేట, యాదాద్రి, ఆలేరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు మునిసిపాలిటీలకు శనివారం నిర్వహించిన అవిశ్వాస తీర్మానాల్లో ఒకటి నెగ్గగా, రెండు వీగాయి. సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై మొత్తం 32 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వగా, చివరి నిమిషంలో ఒక కౌన్సిలర్ వెనక్కి తగ్గడంతో తీర్మానం వీగింది. ఆలేరు మునిసిపాలిటీ చైర్మన్ పస్పరి శంకరయ్యపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగింది. చైర్మన్‌పై అవిశ్వాసం కోరుతూ మొత్తం 8మంది సభ్యులు సంతకాలు చేసి, కలెక్టర్‌కు విన్నవించగా, శనివారం అవిశ్వాస తీర్మానంపై జరిగిన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మునిసిపాలిటీలో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా, ఐదుగురు కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారు. చైర్మన్‌తోపాటు మిగతా ఆరుగురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగినట్లు ఆర్డీవో ప్రకటించారు. కోదాడ మునిసిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, వైస్‌చైర్మన్ వెంపటి పద్మలపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మొత్తం కౌన్సిలర్లు 35మంది ఉండగా, ఎక్స్‌అఫీషియో సభ్యులు ఒకరు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్ ఒకరు మృతి చెందగా, మరో సభ్యురాలు అవిశ్వాస తీర్మానానికి హాజరుకాలేదు. దీంతో 35 మందిలో 32 మంది హాజరుకాగా, వారిలో 29మంది చేతులెత్తి అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలకడంతో చైర్‌పర్సన్ శిరీష తన పదవి కోల్పోయారు.

పాలమూరులో నెగ్గిన అవిశ్వాసం

మహబూబ్‌నగర్, జనవరి 27 : పాలమూరు మునిసిపాలిటీలో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బీఆర్ఎస్‌కు చెందిన ప్రస్తుత చైర్మన్ కోరమోని నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్‌లపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెట్టిన అవిశ్వాసానికి అనుకూలంగా సభ్యులు మద్దతు తెలిపారు. దీంతో వారం రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అవిశ్వాసాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కౌన్సిలర్లను శిబిరాలకు తరలించాయి. శనివారం కాంగ్రెస్ సభ్యులతో పాటు అవిశ్వాసానికి మద్దతు ఇస్తున్న బీఆర్ఎస్ అసంతృప్త కౌన్సిలర్‌లు, బీజేపీ, ఎంఐఎం సభ్యులు క్యాంప్ నుంచి నేరుగా మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మొత్తం 49 మంది సభ్యులున్న మునిసిపాలిటీలో 35 మంది ఓటింగ్‌కు హాజరుకాగా, బీఆర్ఎస్‌కు చెందిన 14 మంది గైర్హాజరయ్యారు. ఎక్స్‌అఫీషియో సభ్యులైన ఎమ్మెల్యేతో కలుపుకొని 36 మంది సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేయడంతో చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాజీలు కావాల్సి వచ్చింది. అయితే, ఎన్నికల కమిషన్ గెజిట్ విడుదల చేసిన తరువాతే నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సంబంధించిన ఎన్నిక నిర్వహించనున్నారు.



వేములవాడ రాజన్నకు తొలి మొక్కులు

- తరలివస్తున్న సమక్కసారలమ్మ భక్తులు
- దేవస్థానంలో కొనసాగుతున్న రద్దీ

సిరిసిల్ల/వేములవాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లకోసారి వచ్చే మేడారం సమక్క, సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు తొలిమొక్కులను వేములవాడ రాజన్నకు చెల్లిస్తారు. ఫిబ్రవరిలో జరిగే మేడారం మహాజాతర కంటే ముందే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి రావడం తరతరాలుగా ఆనవాయితీగా వస్తోంది. తొలి మొక్కుగా రాజన్నను దర్శించుకోవడంతోపాటు వేములవాడలోని బద్దిపోచమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. ఆ తర్వాతే మేడారం సమక్కసారలమ్మల దీవెనలకు తరలివెళ్తారు. వేములవాడ రాజన్నను ఇతర గ్రామ దేవతలకు తండ్రిగా భావించి ఇక్కడికి దర్శనాలకు వస్తుంటారు. రెండేళ్లకోసారి మాఘమాస పౌర్ణమి ఘడియల్లో మేడారం జాతర జరుగుతుంది. జాతరకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ భక్తుల్లో ఎక్కువ శాతం మంది ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకుంటారు. ఇందుకోసం వేములవాడ దేవస్థానంలో అధికారులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు వేశారు. ఇతర మౌలిక సదుపాయలు కల్పించారు. ప్రధానంగా ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు స్వామివారి నిరంతర దర్శనానికి ఏర్పాట్లు చేశారు. కాగా శనివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. బాలాత్రిపురాసుందరీదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమపూజ, కళాభవన్‌లో స్వామివారి నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతం వంటి ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. రద్దీ మరింత పెరుగుతుండడంతో శని, ఆది, సోమవారాల్లో స్వామివారి గర్భాలయ ప్రవేశాన్ని రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆది, సోమవారాల్లో స్వామివారి గర్భాలయంలో అభిషేక పూజలకు భక్తులను అనుమతించబోమని వెల్లడించారు.

లేడీస్ హాస్టల్‌లోకి ఆగంతకులు

సికింద్రాబాద్ పీజీ కాలేజీలో ఘటన.. అర్ధరాత్రి కిటికీ పగలగొట్టి చొరబడిన ముగ్గురు దుండగులు

- విద్యార్థినుల కేకలతో ఇద్దరు పరార్
- ఒకడిని బంధించిన అమ్మాయిలు
- భద్రత పెంచాలంటూ నిరసన





పట్టుబడిన దుండగుడు శ్రీకాంత్, దుండగుల చొరబాటుపై విద్యార్థుల నిరసన

బేగంపేట, బోయిన్‌పల్లి, తార్నాక, హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీ లేడీస్ హాస్టల్‌లోకి శుక్రవారం అర్ధరాత్రి ముగ్గురు దుండగులు చొరబడి కలకలం సృష్టించారు. కిటికీ పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఆ సమయంలో పలువురు విద్యార్థినులు నిద్రపోతుండగా, కొందరు చదువుకుంటున్నారు. ఒక్కసారిగా కిటికీలోనుంచి వచ్చిన వ్యక్తులను చూసి వారు తీవ్ర భయాందోళనకు గురై కేకలు వేశారు. కొందరు విద్యార్థినులు ధైర్యం చేసి.. ముగ్గురు దుండగులలో ఒకడిని పట్టుకొని బంధించారు. 100 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెద్ద ఎత్తున విద్యార్థినులు అక్కడికి చేరుకోవటంతో మిగిలిన ఇద్దరు దుండగులు పరారయ్యారు. పట్టుకున్న వ్యక్తిని పోలీసులు విచారించగా.. అతడి పేరు శ్రీకాంత్ అని, సమీపంలోని వాటర్ వర్క్స్ కార్యాలయంలో నీళ్ల ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, పారిపోయిన ఇద్దరి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. దుండగుల చొరబాటు నేపథ్యంలో విద్యార్థినులు శనివారం పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసనకు దిగారు. హాస్టల్‌లో తమకు రక్షణ కరువైందని, హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని అక్కడకు చేరుకుని ప్రిన్సిపాల్ రవికుమార్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ పికెట్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పటంతో విద్యార్థినులు నిరసన విరమించారు. ఓయూలోని పలు విద్యార్థి సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. విద్యార్థి సంఘాల నాయకులు శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఓయూ వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

బీఆర్ఎస్ నేతదే సెక్యూరిటీ ఏజెన్సీ

ఉస్మానియా వర్సిటీని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తే పేరిట రెండేళ్ల క్రితం 20 ఏళ్లుగా వర్సిటీలో విధులు నిర్వరిస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని నిర్దాక్షిణ్యంగా తొలగించారు. రూ.ఆరేడు వేల వేతనంతో పని చేసే ఆ సిబ్బందిని తొలగించి నెలకు రూ.19,500 వేతనంతో ఇతర రాష్ట్రాలకు చెందిన రిటైర్డ్ ఆర్మీ సిబ్బందిని ఓ ఏజెన్సీ ద్వారా నియమించారు. పలు ఏజెన్సీలు టెండర్లలో పోటీ పడితే బీఆర్ఎస్‌కు చెందిన ఓ నేతకు కాంట్రాక్టు కట్టబెట్టడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఆ ఏజెన్సీ సెక్యూరిటీని గాలికి వదిలేసిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రిటైర్డ్ ఆర్మీ సిబ్బందిని నియమిస్తామన్న ఏజెన్సీ.. అది పాటించకుండా, అరకొరగా సెక్యూరిటీని పెడుతోందని, వారికి చాలా తక్కువ చెల్లింపులు చేస్తోందని ఆరోపణలున్నాయి. దీంతో వర్సిటీ భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

తవ్వేన కొద్దీ ఆస్తులు!

(మొదటి పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. కాగా, ఈ సోదాల్లో పెద్దమొత్తంలో స్థిర, చర ఆస్తులు బయటపడినట్లు రిమాండ్ రిపోర్టులో ఏసీబీ పేర్కొంది. మొత్తం 45 పేజీలతో రిమాండ్ రిపోర్టును కోర్టుకు సమర్పించింది. దీని ప్రకారం.. బాలకృష్ణ నివాసముంటున్న పుప్పాలగూడలోని సెక్రటేరియట్ కాలనీ ఆదిత్య ఫోర్ట్‌వ్యూ విల్లాలో 50 స్థిర, చరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. రూ.99 లక్షల నగదు, నాలుగు కార్లు, బంగారు ఆభరణాలు, ఖరీదైన వాచీలను సీజ్ చేశారు. బాలకృష్ణకు నాలుగు బ్యాంకు ఖాతాలు బినామీల పేర్లతో ఉన్నట్లు గుర్తించారు. మేడ్చల్ జిల్లా ఫిర్జాదిగూడలో పెంట రమాదేవి, రాయదుర్గం మైహోం బూజాలో డింగరి కిరణ్ ఆచార్య, హనుమకొండ భవానీనగర్‌లో సింగరాజు ప్రమోద్‌కుమార్, మాదాపూర్ సాహితి సుముఖి ఆర్బిట్ అపార్ట్‌మెంట్, హబ్సిగూడ వీవీ నగర్‌లో కొమ్మిడి సందీప్‌కుమార్ రెడ్డి పేరుతో ఉన్న ఫ్లాట్లు, బాచుపల్లి శిల్ప ఆర్‌వీ ధరిస్త్రా అపార్ట్‌మెంట్‌లో సత్యనారాయణ మూర్తి పేర్లతో ఉన్న ఫ్లాట్లను గుర్తించినట్లు రిమాండ్ రిపోర్టులో వివరించారు. ఇవే కాకుండా.. పలు రియల్ ఎస్టేట్ సంస్థల్లోనూ శివబాలకృష్ణ పెట్టుబడులు పెట్టి బినామీల పేర్లతో నిర్వహిస్తున్నట్లు ఏసీబీ అధికారులు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. బినామీలను పూర్తిస్థాయిలో విచారించడంతోపాటు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న శివబాలకృష్ణను కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని విచారించాలని భావిస్తున్నారు.

వాచీల ఖరీదు రూ.32 లక్షలు...

శివబాలకృష్ణ ఇల్లు, కార్యాలయంతోపాటు ఇతర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన సమయంలో రూ.99.60 లక్షల నగదు, బంగారు ఆభరణాలతోపాటు ఎక్కువగా ఇంపోర్టెడ్ వాచీలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వాచీల విలువ రూ.32.38 లక్షలకు పైనే ఉంటుందని అంచనా వేశారు. అయితే ఈ వాచీలన్నీ వివిధ పనులకు ఇతరుల నుంచి బహుమతులుగా స్వీకరించినట్లుగా అనుమానిస్తున్నారు. వీటితోపాటు రూ.51 లక్షలు విలువ చేసే నాలుగు కార్లు, నాలుగు వేర్వేరు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.58 లక్షలు బ్యాలెన్స్‌ను గుర్తించారు. వేర్వేరు బ్యాంకుల్లో లాకర్స్‌ను గుర్తించిన అధికారులు కుటుంబ సభ్యుల సమక్షంలో వాటిని తెరిచేందుకు సిద్ధమవుతున్నారు. సోదాల్లో మొత్తం రూ.8.26 కోట్లు విలువైన బంగారం, వెండి, గృహోపకరణాలు స్వాధీనం చేసుకున్నట్లు రిమాండ్ రిపోర్టులో ఏసీబీ పేర్కొంది. 155కు పైగా డాక్యుమెంట్లు, ఎల్ఐసీ బాండ్స్, 20 ఐటీ రిటర్న్స్‌కు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. డాక్యుమెంట్ల ఆధారంగా.. శివబాలకృష్ణతో అంటకాగిన వారు, ఆయా పనుల్లో ఆయనకు సహకారం అందించి ఎక్కడికక్కడ ఫైళ్లు క్లియర్ చేసిన వారిపైనా ఏసీబీ దృష్టి సారించింది. శివబాలకృష్ణ బినామీలపై కూడా దృష్టి సారించారు. అతని సోదరుల ఇళ్లు సహా హిమాయత్‌నగర్‌లో బంధువుల ఇళ్లను తనిఖీ చేశారు. కీలక డాక్యుమెంట్స్, బ్యాంక్ పాస్ బుక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అవినీతి వెనుక కేటీఆర్: చనగాని

తార్నాక: హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అవినీతి వెనుక మాజీ మంత్రి కేటీఆర్, ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్ ఉన్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన విచారణలో శివబాలకృష్ణతో పాటు మరింత మంది అవినీతి తిమింగళాలు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. విలువైన భూములను హస్తగతం చేసుకోవాలనే ఉద్దేశంతోనే కేటీఆర్ ఢిల్లీలో ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్‌కుమార్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చి అవినీతికి తెగబడ్డారని ఆరోపించారు. కేటీఆర్‌కు దమ్ముంటే 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనపై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు.

అనుమతులు సాధ్యం కాదంటూనే..!

భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల సందర్భంలో.. అడ్డంకులున్నాయని, సాధ్యం కాదని తొలుత చెప్పడం, ముడుపులు ముట్టజెప్పగానే అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం శివబాలకృష్ణ స్టయిల్‌గా చెబుతుంటారు. ముడుపులతో ఆయన ఇంటి వద్దకు చేరితే సాంకేతిక అంశాలన్నీ అడ్డు తొలగి అనుమతులు వస్తాయని అంటున్నారు. హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా ఐదేళ్లకు పైగా కొనసాగినా.. ఆయన మాసబ్ ట్యాంక్‌లోని డీటీసీపీ బిల్డింగ్ నాలుగు అంతస్తులో ఉన్న తన కార్యాలయం నుంచే విధులు నిర్వర్తించారు. ముడుపుల వ్యవహారాలను మాత్రం పుప్పాలగూడలోని ఆదిత్యఫోర్ట్ వ్యూ నుంచే చక్కబెట్టారనే ఆరోపణలున్నాయి.

(మొదటిపేజీ తరువాయి)

కుల గణనకు వేళాయె!

విశ్వసనీయంగా తెలిసింది. కాగా, దేశవ్యాప్తంగా వివిధ సామాజిక వర్గాల వారీగా ఎన్ని కులాలు ఉన్నాయి!? వాటి ఉప కులాలు ఎన్ని!? వాటిలో ఉన్న మొత్తం జనాభా ఎంత!? అన్న దానికి ఇప్పటికీ స్పష్టమైన గణాంకాలేవీ లేవు. ఈ నేపథ్యంలో, బీసీల సంఖ్య తేల్చడమే లక్ష్యంగా కుల గణనకు బిహార్ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దీనికి అత్యున్నత న్యాయస్థానం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో, ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాలు కుల గణనకు ముందుకొచ్చాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కూడా తాము అధికారంలోకి వస్తే కుల గణన జరుపుతామని హామీ ఇచ్చింది. కర్ణాటక, తెలంగాణ సహా వివిధ రాష్ట్రాల ఎన్నికల సమయంలో ఈ అంశాన్నే ప్రముఖంగా ప్రస్తావించింది. కర్ణాటకలో ఇప్పటికే ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రారంభమవ్వగా.. తాజాగా తెలంగాణ ప్రభుత్వం కూడా కుల గణనకు పచ్చజెండా ఊపింది. కులాలు.. వాటిలో ఉప కులాలు.. మొత్తం జనాభా తదితర వివరాలను ఈ ప్రక్రియలో నమోదు చేస్తారు. నిజానికి, కుల గణనకు ఇప్పటికీ 1931 గణాంకాలపైనే ఆధారపడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం వరకూ ఇవే ఆధారం. అప్పట్లో హైదరాబాద్ రాష్ట్రంగా ఉండగా.. కులాలవారీగా జనాభా ఎంతో తేల్చారు. 1931 తర్వాత మళ్లీ ఇప్పుడే కులగణనపై అడుగులు ముందుకు పడుతున్నాయి.

తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వేలోనూ..

తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి ప్రభుత్వం 2014 ఆగస్టు 19న 'సమగ్ర కుటుంబ సర్వే' నిర్వహించిన విషయం తెలిసిందే. అందులో రాష్ట్రంలో ఉన్న మొత్తం కుటుంబాలు, జనాభా లెక్కలను పూర్తిస్థాయిలో తేల్చారు. కానీ, కులాల విషయంలో స్పష్టత రాలేదు. ఇందుకు కారణం.. కులాల స్థానంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ అనే వివరాలను మాత్రమే నమోదు చేయడమే. ఎస్సీలు 18 శాతం, ఎస్టీలు 10, ఓసీలు 21 శాతం ఉండగా, బీసీలు 51 శాతం ఉన్నట్టు అందులో గుర్తించారు. అసలు సర్వే వివరాలను కూడా అప్పటి ప్రభుత్వం ప్రకటించలేదు. ఇక, జనాభా లెక్కల్లో కూడా ఎస్సీ, ఎస్టీల జనాభా ఎంతనే వివరాలు నమోదవుతున్నాయి తప్పితే వాటిలోనూ ఉప కులాలు ఏవీ? వాటి జనాభా ఎంతనే వివరాలు నమోదు కావడం లేదు. ఇప్పుడు కుల గణనతో అన్ని కులాల్లోనూ ఉప కులాలు, వాటి జనభాకు సంబంధించిన పూర్తి వివరాలు బయటకు రానున్నాయి. తద్వారా, రిజర్వేషన్లతోపాటు ఆయా కులాల అభ్యున్నతికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వాలకు అవకాశం చిక్కుతుంది.

న్యాయ సలహా తీసుకుని ముందుకు..

కుల గణన.. ఆ వివరాల వెల్లడి అంత ఈజీ కాదు. బిహార్లో కుల గణన వివరాలు వెల్లడించిన తర్వాత అక్కడి ప్రభుత్వం తీవ్ర ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చింది. పలు వివరాల్లో ప్రభుత్వానికి అనువుగా ఉండే అంశాలు, కులాల లెక్కలను మాత్రమే వెల్లడించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో ఆ విషయం సుప్రీం కోర్టుకు వెళ్లింది. ఈ నేపథ్యంలో, ఇప్పటికే కుల గణన చేపట్టిన పలు రాష్ట్రాలు అవలంబించిన విధానాలు, ప్రక్రియ పూర్తయిన తరువాత వచ్చిన ఇబ్బందులు, బిహార్ సర్కారు సుప్రీం కోర్టుకు వెళ్లడానికి కారణాలను బేరీజు వేయాలని తెలంగాణ సర్కారు భావిస్తోంది. అందుకే, న్యాయ సలహాలు తీసుకుని పకడ్బందీగా వ్యవహరించాలని నిర్ణయించింది.

లోకం తీరు





పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, సురేఖ, శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం, మేడారం పూజారులు

మేడారం జాతర పోస్టర్ ఆవిష్కరణ

ములుగు, జనవరి 27: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర పోస్టర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దేవాదాయ, గిరిజన సంక్షేమ శాఖల ఉన్నతాధికారుల సమక్షంలో ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మేడారం వడ్డెలు (పూజారులు) సిద్దబోయిన జగ్గారావు, కాక సారయ్య, కాక కిరణ్, చంద రఘుపతిరావు మంత్రి సీతక్కతో కలిసి సీఎంను సచివాలయంలో కలిశారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగే జాతరకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా 23న వనదేవతలను దర్శించుకుంటానని సీఎం రేవంత్ వారికి చెప్పారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించండి

» మంత్రి తుమ్మలకు ఆది శ్రీనివాస్, కేకేల విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర చేనేత, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం వారు మంత్రి తుమ్మలను కలిశారు. బతుకమ్మ చీరల తయారీని సిరిసిల్ల చేనేతకు ఇవ్వాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించడంతోపాటు మహిళలకు బతుకమ్మ పండుగ చీరలను గతంలో కంటే నాణ్యమైనవి అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం వారు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, పోలీసులు తదితర యూనిఫామ్‌లకు సంబంధించిన కాంట్రాక్టులను చేనేత కార్మికులకు ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

1న మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణం

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ ఫిబ్రవరి 1న ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కేసీఆర్ ఈసారి గజ్వేల్, కామారెడ్డిల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయగా.. కామారెడ్డిలో ఓడిపోయి, గజ్వేల్‌లో గెలిచారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. డిసెంబరు 9న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో చాలామంది నూతన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ రోజు విగిలిపోయినవారు 12న అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ రెండు సందర్భాల్లో కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. తన ఫామ్ హౌస్‌లో కింద పడడంతో తుంటి ఎముక విరిగి ఆస్పత్రిపాలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1న ఆయన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

ప్రాజెక్టులు పూర్తికాకముందే కూలిపోతున్నాయి

» కేసీఆర్ హయాంలోని నిర్మాణాలపై కోమటిరెడ్డి ఎద్దేవా

నల్లగొండ టౌన్, జనవరి 27: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నిర్మాణం పూర్తికాకముందే కూలిపోతున్నాయని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నల్లగొండ జిల్లా ముషంపల్లిలో అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నాణ్యత కంటే కమీషన్లపైనే దృష్టిపెట్టిందని విమర్శించారు. అందువల్లే ఒక్క ప్రాజెక్టు కూడా నాణ్యంగా లేదని ఆరోపించారు. ప్రజాధనాన్ని వృథా చేసిన ఆ పార్టీ నాయకులు తమకు నీతులు చెప్పడం ఏంటని మండిపడ్డారు. సాగర్‌లో నీరు లేకపోవడంతో, శ్రీశైలం సొరంగ మార్గం ద్వారా నీటిని తరలించేందుకు రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టుకు రూ.1500కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించారన్నారు. ఈ పనులు నేటికీ అసంపూర్తిగా ఉన్నయాని, మూడేళ్లలో సొరంగ మార్గం పూర్తి చేసి ప్రతీ ఎకరాకు సాగు నీరు అందిస్తామన్నారు. రూ.510కోట్లతో సాగర్ ప్రధాన కాల్వ లైనింగ్ పనులకు, రూ.310కోట్లతో డిస్ట్రిబ్యూటరీల పనులకు నెలలోపు టెండర్ పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.

కాళేశ్వరంపై నిపుణుల కమిటీ

3 బ్యారేజీలపై లోతుగా అధ్యయనం.. ఆ కమిటీ నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు: సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నాణ్యతపై నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. బ్యారేజీల పటిష్ఠత, కుంగిపోయిన పిల్లర్ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో లోతుగా, సంపూర్ణంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగానే ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సచివాలయంలో శనివారం ఆయన నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. కేంద్ర జల సంఘం, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణులతోపాటు రాష్ట్రంలోని ఇరిగేషన్ ఇంజనీర్లతో ఈ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం నిర్దేశించారు. రెండు, మూడు రోజుల్లోనే వీరందరితో మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని, తనతోపాటు ఇరిగేషన్ మంత్రి కూడా ఆ సమావేశంలో పాల్గొంటామని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి కుంగిన పిల్లర్లను రిపేర్లు చేయిస్తే సరిపోతుందా.. లేదా ఉన్నవి తొలగించి కొత్తవి కట్టాలా!? కొన్నింటిని రిపేర్లు చేసి మరి కొన్నింటిని కొత్తగా నిర్మిస్తే సరిపోతుందా!? తదితర అంశాలపై ఈ కమిటీతో సమగ్రంగా అధ్యయనం చేయిస్తామని తెలిపారు. "గతంలో అధికారంలో ఉన్న వాళ్లు చేసిన తప్పులతో ఇప్పటికే తెలంగాణకు భారీ నష్టం వాటిల్లింది. లక్షన్నర కోట్లతో చేపట్టిన భారీ ప్రాజెక్టు రిపేర్లకు ఎనిమిది, పది వేల కోట్లు అవసరమైతే ఆలోచించవద్దు. హడావుడి చేసి మరోసారి తప్పులకు తావు ఇవ్వొద్దు. సాంకేతికంగా అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకొని.. తదుపరి మరమ్మతులపై నిర్ణయం తీసుకోవాలి" అని అధికారులకు నిర్దేశించారు.



కృష్ణా ప్రాజెక్టులపై అఖిలపక్షం

కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి వాటాలు, కృష్ణా ప్రాజెక్టులపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇప్పటిదాకా కృష్ణా జలాలకు సంబంధించి జరిగిన సమావేశాలు, వాటిలో తీసుకున్న నిర్ణయాలు, ఒప్పందాలన్నింటిపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి, అఖిలపక్ష సమావేశంలో చర్చిద్దామని తెలిపారు. "ఉమ్మడి రాష్ట్రానికి బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయిస్తే.. వాటిలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు ఇవ్వడానికి ఎందుకు అంగీకరించారు? గతంలో అధికారంలో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలకు కారకులెవరు? అనే అంశాలను తెలంగాణ ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉంది" అని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించినట్లు వస్తున్న ఆరోపణలపై చర్చ జరిగింది. కృష్ణా బేసిన్‌లో ఏ ప్రాజెక్టును అప్పగించేలా ఎవరూ సంతకాలు చేయలేదని సీఎంకు అధికారులు వివరణఇచ్చారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 45 రోజులే అయింది. ఈ కొద్ది రోజుల్లోనే కృష్ణా బోర్డుతో ఏయే మీటింగ్‌లు జరిగాయి? ఎవరు హాజరయ్యారు? ఏమేం నిర్ణయాలు తీసుకున్నారు? మీ విభాగం మీద ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మీరేం చేస్తున్నట్లు?" అంటూ అధికారులపై సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమకు ఎన్ని నీళ్లు పోతున్నాయి? కృష్ణా జలాల్లో ఎవరి వాటా ఎంత!? వాటాకు మించి నీటిని తోడుకుపోతుంటే పదేళ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏం చేసింది!? తదితర అంశాలను అఖిల పక్ష సమావేశంలో చర్చకు పెడదామని వివరించారు. ప్రాజెక్టులను కృష్ణా, గోదావరి బోర్డులకు అప్పగించే గెజిట్ 2021 జూలై 15వ తేదీన విడుదలైందని అధికారులు సీఎంకు నివేదించగా.. దాని విడుదలకు ముందు ప్రాజెక్టుల అప్పగింతపై జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలతోపాటు గెజిట్ విడుదల అనంతరం జరిగిన సమావేశాల వివరాలన్నీ అందించాలని సీఎం ఆదేశించారు.

తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులకు ప్రాధాన్యం

రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో పూర్తయ్యే ప్రాజెక్టుల జాబితాను తయారు చేసి, వాటికి అవసరమైన నిధుల విడుదలకు గ్రీన్ చానల్ విధానం అమలు చేయాలని సీఎం రేవంత్ నిర్దేశించారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనులను అత్యంత వేగంగా చేపట్టాలని, దీన్ని ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో చేర్చాలని, వీలైనంత త్వరగా టన్నెల్ పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. దీన్ని పూర్తి చేస్తే గ్రావిటీతో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఆయకట్టుకు నీరందించేదాకా పనులు చేపట్టాలని, ఎంతమేర నిధులు సమకూరిస్తే కొత్త ఆయకట్టుకు నీరందించగలమనే దానిపై నివేదిక అందించాలని నిర్దేశించారు. కల్వకుర్తి పనులన్నీ పూర్తి చేయాలని, భూసేకరణకు అవసరమైన నిధులను విడుదల చేయాలని తెలిపారు. కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని కూడా చేపట్టాలన్నారు. ప్రాజెక్టుల ఆయకట్టు వివరాల్లో స్పష్టత ఇవ్వాలని ఆదేశించారు.



కాంగ్రెస్ గూటికి తీగల కృష్ణారెడ్డి?

» సచివాలయంలో సీఎం రేవంత్‌తో భేటీ

హైదరాబాద్, మహేశ్వరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నేత మాజీ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పార్టీ మారబోతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తనకు మహేశ్వరం అసెంబ్లీ టికెట్ కేటాయించనందుకు కొంత కాలంగా అసంతృప్తిలో ఉన్న ఆయన త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సచివాలయంలో శనివారం ఆయన సీఎం రేంత్‌ను కలవడం ఇందుకు బలాన్ని చేకూర్చుతోంది. టీడీపీతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన కృష్ణారెడ్డి 2014లో మహేశ్వరం ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సబితారెడ్డి చేతిలో ఓడిపోయారు. తనకు ఎమ్మెల్సీ ఇస్తానని కేసీఆర్ మాట తప్పారని, ఎన్నికల్లో టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని తీగల తన అనుచరగణం వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

రేవంత్‌ది..జనరంజక పాలన: మోత్కుపల్లి

కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు సచివాలయంలో సీఎం రేవంత్‌ను కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు.

కేబినెట్‌లోకి కోదండరాం?

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత ఎమ్మెల్సీని చేస్తానంటూ అప్పట్లో హామీనిచ్చారు. ఈ మేరకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ సీటుకు కోదండ పేరును రేవంత్ సర్కారు ప్రతిపాదించింది. గవర్నర్ కూడా ఆమోదం తెలిపారు. అయితే కేసీఆర్ దూరం పెట్టినా.. కాంగ్రెస్ అక్కున చేర్చుకుని ఆయనను ఎమ్మెల్సీని చేస్తుండటంతో తెలంగాణ ఉద్యమకారులు, సానుభూతిపరుల్లో ఒక సానుకూల వాతావరణం ఏర్పడింది. లోక్‌సభ ఎన్నికల ముంగిట ఈ సానుకూలతను మరింత సుస్థిరం చేసుకుని ఓటు బ్యాంకుగా మలుచుకునే వ్యూహంలో భాగంగానే ఆయన్ను మంత్రివర్గంలోకి తీసుకునే యోచన చేస్తున్నట్టు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ వాదాన్ని బీఆర్ఎస్ మళ్లీ తెరపైకి తెచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యమ నేత కోదండరాంను మంత్రివర్గంలో తీసుకుని బీఆర్ఎస్ 'తెలంగాణ' అస్త్రానికి చెక్ పెట్టాలన్న ఆలోచనలో రేవంత్ ఉన్నారు. ప్రస్తుతం మంత్రివర్గంలో రేవంత్ సహా నలుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కాగా.. బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల నుంచి ఇద్దరు చొప్పున, ఎస్టీ.. బ్రాహ్మణ, వెలమ, కమ్మ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. మంత్రివర్గ విస్తరణలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓ నేతకు ఈ సారి అవకాశం దక్కవచ్చని సమాచారం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా తన వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక బీసీ, ఎస్సీ, ఎస్టీల నుంచి ఒక్కొక్కరిని తీసుకునేందుకు ఆస్కారం ఉందంటున్నారు. బీసీల్లో గౌడ సామాజిక వర్గం నుంచి పొన్నం ప్రభాకర్, మున్నూరుకాపు/పద్మశాలి సామాజిక వర్గాల నుంచి కొండా సురేఖను ఇప్పటికే క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. దీంతో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి పేరు మంత్రివర్గ విస్తరణలో ప్రముఖంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఇప్పటికే సీఎం రేవంత్, మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నారు. శ్రీహరి నియోజకవర్గం మక్తల్ కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఉంది. దీంతో మరికొందరు బీసీ ఎమ్మెల్యేల పేర్లనూ ఆయనతో పాటుగా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఇటు ఎస్టీల్లో ఆదివాసీ వర్గం నుంచి సీతక్క ఉన్న నేపథ్యంలో విస్తరణలో లంబాడా వర్గానికి ఈసారి చోటు దక్కనుందని సమాచారం. ఈ కోటాలో బాలూనాయక్ పేరు ప్రముఖంగా పరిశీలనలో ఉంది. ఇక ఎస్సీ వర్గీకరణ అంశాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిన నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గం నుంచి మరొకరిని తీసుకునే ఆలోచన చేస్తున్నట్లు కూడా తెలుస్తోంది. అయితే మాల సామాజిక వర్గం నుంచి పార్టీ ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గడ్డం వినోద్‌లు ఇప్పటికే పోటీలో ఉన్నారు. మాదిగ సామాజిక వర్గం నుంచి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యేలు, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్లను పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఈ ఇద్దరిలో ఎవరిని ఎంపిక చేసినా ఉమ్మడి నల్లగొండ నుంచి ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ముగ్గురికి చోటు దక్కినట్లవుతుంది. ఈనేపథ్యంలో ఎస్టీ కోటాలో బాలూనాయక్‌కు చోటు ప్రశ్నార్థకంగా మారనుంది. ఈ క్రమంలోనే వరంగల్‌కు చెందిన లంబాడా ఎమ్మెల్యే పేరూ పరిశీలిస్తున్నట్లు సమాచారం..

మరి ఆరో బెర్త్ ఎవరిది..?

ఇక ఆరో బెర్త్ ముస్లిం సామాజిక వర్గానికి కేటాయించాల్సి ఉండగా.. ఎమ్మెల్సీగా నామినేట్ అయిన ఆమీర్ అలీ ఖాన్‌ను మాత్రమే తీసుకునేందుకు వీలుంటుంది. కానీ పరిపాలన అనుభవం లేని ఆయన్ను మంత్రి వర్గంలోకి తీసుకునే యోచనలో రేవంత్ లేరని అంటున్నారు. ఇక అమీర్‌కు ఎమ్మెల్సీ, మాజీ మంత్రి షబ్బీర్ అలీకి క్యాబినెట్ ర్యాంకుతో ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చిన నేపథ్యంలో ముస్లిం మైనార్టీలకు విస్తరణలో చోటు దక్కక పోవచ్చన్న ప్రచారమూ సాగుతోంది. ఆరో బెర్త్‌ను ఇతర సామాజిక వర్గాలకు సర్దుబాటు చేస్తారా.. లేక పెండింగ్‌లో పెట్టి లోక్‌సభ ఎన్నికల తర్వాత దానిపై నిర్ణయం తీసుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది.

ఎమ్మెల్సీలుగా కోదండ, ఆమీర్!

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమీర్ అలీ ఖాన్‌ల నియామకంపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. గతంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నియమితులైన రాజేశ్వరరావు, ఫరూఖ్ హుస్సేన్‌ల పదవీకాలం ముగియడంతో కాంగ్రెస్ సర్కారు ఈ పోస్టులకు కోదండరాం, ఆమీర్ పేర్లను ప్రతిపాదించింది. వీటిని గురువారమే గవర్నర్ ఆమోదించినా.. గెజిట్ శనివారం విడుదలైంది. వీరు ఆరేళ్ల పాటు పదవుల్లో కొనసాగనున్నారు.

సీఎంను కలిసిన కొత్త ఎమ్మెల్సీలు

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన కోదండరాం, ఆమీర్‌అలీఖాన్ సచివాలయంలో సీఎం రేవంత్‌ను కలిశారు. ఎమ్మెల్సీలుగా తమ ఎన్నికకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా..ఎమ్మెల్సీ కోదండరాంను ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ లింబాద్రి, వైస్ ఛైర్మన్ వెంకటరమణ, ఎస్.కె.మహమ్మద్, ఉస్మానియా వీసీ డి.రవీందర్, శాతవాహన వీసీ స్.మల్లేశ్, పాలమూరు వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వీసీ కె.సీతారామారావు, ఎంజీ వర్సిటీ వీసీ సీహెచ్ గోపాల్‌రెడ్డి కలిసి సత్కరించారు.

పిల్ల పెండ్లికి 'తులం' బంగారం

కళ్యాణమస్తు, షాదీముబారక్‌కు నగదుతో పాటు అందించేందుకు సర్కారు నిర్ణయం

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కల్యాణమస్తు, షాదీముబారక్ పథకాల్లో భాగంగా రాష్ట్రంలో పెళ్లిళ్లు చేసుకునే ఆడబిడ్డలకు ఇకపై ఇందిరమ్మ కానుకగా తులం బంగారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బడ్జెట్‌ను రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలపై మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ కానుకగా తులం బంగారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థలన్నీ ఒకేచోట ఉండేలా ఇంటిగ్రేటెడ్ హబ్‌గా ఏర్పాటుచేయాలని సీఎం నిర్ణయించారు. ఇందుకోసం నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ హబ్‌ను నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని సంక్షేమ గురుకులాలు ఒకేచోట ఉంటే.. వాటి నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత మెరుగ్గా ఉంటుందని, ఎక్కువ మంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకోవడం ద్వారా వారిలో ప్రతిభాపాటవాలు, పోటీతత్వం పెరుగుతాయని సీఎం అభిప్రాయపడ్డారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణానికి సరిపడా స్థలాలను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. ఒకవేళ నియోజకవర్గ కేంద్రాల్లో వీటి ఏర్పాటుకు వీలుకాకుంటే.. అదే సెగ్మెంట్లోని మరో పట్టణం లేదా మండల కేంద్రాలను ఎంచుకోవాలని సూచించారు. ఇప్పటికే 20 ఎకరాలకు పైగా విస్తీర్ణమున్న స్కూల్ ప్రాంగణాల్లో మిగతా భవనాలు నిర్మించి హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలనూ పరిశీలించాలన్నారు. ఈ ఎడ్యుకేషన్ హబ్‌ల నిర్మాణానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద కార్పొరేట్ సంస్థలు, కంపెనీల సహకారం తీసుకోవాలని సూచించారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఇచ్చే దుప్పట్లు, పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాల కోసం సీఎస్ఆర్ నిధులను సమీకరించాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ గురుకుల పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని సీఎం ఆదేశించారు. సొంత భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, యుద్ధ ప్రాతిపదికన భవనాల నిర్మాణానికి సరిపడా స్థలాలను గుర్తించాలన్నారు. ఒక్కో స్కూల్ నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందనే విషయాన్ని కూడా అంచనా వేసి, బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మెటిక్ చార్జీలు, వంట బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. గ్రీన్ చానల్ విధానంలో వాటి చెల్లింపులు చేయాలని ఆదేశించారు. దీంతో పాటు పార్లమెంటు నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు అంశాన్ని అధ్యయనం చేయాలన్నారు. విదేశాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అందిస్తున్న మహాత్మ జ్యోతిబాపూలే ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని కూడా మరింత సమర్థంగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ పథకం కింద ప్రస్తుతం అందిస్తున్న దాని కంటే ఎక్కువ మంది అర్హులైన విద్యార్థులకు మేలు జరిగేలా చూడాలన్నారు. విదేశీ వర్సిటీల ర్యాంకింగ్స్ ఆధారంగా టాప్ వర్సిటీలను గుర్తించి.. ఫ్రేమ్‌వర్క్ తయారుచేయాలని, వాటిల్లో మన విద్యార్థులకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.

10 నుంచి ఖమ్మంలో

'ప్రజా రచయిత్రుల వేదిక' రాష్ట్ర మహాసభలు

ఏర్పాట్లను పరిశీలించిన సంఘం రాష్ట్ర నేతలు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 27 : స్త్రీలపై ట్రోలింగ్ సమస్య ఎజెండాగా ప్రజా రచయిత్రుల వేదిక(ప్రరవే) 17వ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలోని వేదిక ఫంక్షన్‌హాల్‌లో ఫిబ్రవరి 10, 11 తేదీల్లో జరుగనున్న విషయం విదితమే. ఈ సభల ఏర్పాట్లను 'ప్రరవే' రాష్ట్ర నాయకులు కాత్యాయిని విద్మహే, కేఎన్ మల్లీశ్వరి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నగరంలోని సాహితీవేత్తలు మువ్వా శ్రీనివాస్, రవి మారుత్‌తో పాటు కవయిత్రులు, మహిళా సంఘాల నేతలతో సన్నాహక సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ 'స్త్రీలపై ట్రోలింగ్ నిర్వచనం, మూలాలు, వర్తమానం' అంశంపై వీక్షణం మాసపత్రిక ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, 'ట్రోలింగ్ అంతర్జాతీయ, జాతీయ కళారంగాలు' అనే అంశంపై ప్రొఫెసర్ కె.సునీతారాణి, 'ట్రోలింగ్ సామాజిక రాజకీయ రంగాలు' అనే అంశంపై ప్రముఖ స్త్రీవాద కవి కొండేపూడి నిర్మల, 'ట్రోలింగ్ సాంస్కృతిక, కళారంగాలు' అనే అంశంపై సామాజిక కార్యకర్త కృష్ణకుమారి ప్రసంగిస్తారని తెలిపారు. ప్రశ్నించే స్త్రీల అనుభవాలతో ముద్రించిన ట్రోల్ పుస్తకాన్ని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా ఆవిష్కరిస్తారని తెలిపారు. 'నారి సారించిన నవల' పుస్తకంపై విమర్శకురాలు విమల, శీల సుభద్రాదేవి, శిలాలోలిత ప్రసంగిస్తారని తెలిపారు.

తమ్ముడిగా భావించి.. సీఎంగా మద్దతిచ్చారు

» సీనియర్ల ఎదుట రేవంత్ వ్యాఖ్య

» తెలంగాణను పునర్నిర్మిస్తాం

» బిల్డర్ల సదస్సులో రేవంత్ రెడ్డి



బిల్డర్ల సదస్సులో సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, కోమటిరెడ్డి

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వయసులో అందరికంటే చిన్నవాడినైనా.. తమ్ముడిగా భావించి, ముఖ్యమంత్రిగా మద్దతిచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి నాయకత్వం వహించే కీలకమైన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని, సహచర మంత్రుల సహకారంతో విధ్వంసమైన తెలంగాణను పునర్మిస్తామన్నారు. 31వ అఖిలభారత బిల్డర్ల సదస్సు శనివారం హెచ్ఐసీసీలో జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు, మెట్రోరైలు లాంటి కీలక నిర్మాణాలు రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలోనే జరిగాయన్నారు. బిల్డర్లు ఆర్థికంగా బలపడితేనే రాష్ట్రం బలపడుతుందని అభిప్రాయపడ్డారు. "హైదరాబాద్‌కు మూసీనది ఒక ఆస్తి. 55 కిలోమీటర్ల పొడవునా.. మూసీనదిని అద్భుతంగా తీర్చిదిద్దనున్నాం. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులతోపాటు తెలంగాణ మెగా మాస్టర్ ప్లాన్-2050లో బిల్డర్లు భాగస్వాములవ్వాలి" అని సీఎం కోరారు. విధ్వంసమైన తెలంగాణను పునర్నిర్మించేందుకు బిల్డర్ల సహకారం అవసరమని, వారి అనుభవాన్ని తెలంగాణ అభివృద్ధికి ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. బిల్డర్ల సమస్యకు సర్కారు పరిష్కారం చూపుతుందని హామీ ఇచ్చారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తమది ప్రజా ప్రభుత్వమని ముఖ్యమంత్రి, మంత్రులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారని, పాలన పారదర్శకంగా ఉంటుందని ఉద్ఘాటించారు. ఒక కాంట్రాక్టర్‌గా కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు తనకు తెలుసునని, వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని వివరించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరంతోపాటు మూడు ప్రాజెక్టులను బలహీనంగా నిర్మించిన గత ప్రభుత్వం ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిందన్నారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. తాను కాంట్రాక్టర్ కాదని, కాంగ్రెస్ ఫైటర్, కార్యకర్త అన్నారు. గతంలో కాంట్రాక్టులు చేసేవాడినని, ఇప్పుడు తాను హైదరాబాదులో అద్దె ఇంట్లో ఉంటున్నానన్నారు. బిల్డర్ల సంఘం ప్రతినిధులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.10వేలకోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

ఓయూ సహా పది వర్సిటీలకు కొత్త వీసీలు

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తులను సమర్పించాలని పేర్కొంది. ఉస్మానియా యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, డా. బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ, కాకతీయ యూనివర్సిటీ(వరంగల్), మహాత్మాగాంధీ యూనివర్సిటీ(నల్లగొండ), శాతవాహన యూనివర్సిటీ(కరీంనగర్), తెలంగాణ యూనివర్సిటీ(నిజామాబాద్), పాలమూరు యూనివర్సిటీ(మహబూబ్‌నగర్), జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ-హైదరాబాద్)కు వైస్ చాన్స్‌లర్లను నియమించనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నియామకాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం www.tsche.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సూచించారు.

కామన్ ఎంట్రెన్ టెస్టుల నిర్వహణ కన్వీనర్లు వీరే

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏడు కామన్ ఎంట్రెన్స్ టెస్టుల(సెట్‌లు)కు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్ఈ) కన్వీనర్లను నియమించింది. ఈమేరకు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, కార్యదర్శి ఉత్తర్వులను జారీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ సంబంధిత ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ సెట్‌లను నిర్వహిస్తారు. కన్వీనర్లుగా వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు నియమితులయ్యారు. టీఎస్ఈఏపీ కన్వీనర్‌గా జేఎన్‌టీయూహెచ్ ప్రొ. బి.డీన్‌కుమార్, టీఎస్ పీజీఈ సెట్ కన్వీనర్‌గా జేఎన్‌టీయూహెచ్ ప్రొ. ఎ.అరుణకుమారి, టీఎస్ ఐసెట్ కన్వీనర్‌గా కాకతీయ వర్సిటీ ప్రొ. ఎస్.నర్సింహాచారి, టీఎస్ ఈసెట్ కన్వీనర్‌గా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ.శ్రీరామ్ వెంకటేశ్, టీఎస్ లాసెట్, టీఎస్ పీజీ లాసెట్ కన్వీనర్‌గా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ. విజయలక్ష్మి, టీఎస్ ఎడ్‌సెట్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ నిర్వహిస్తుండగా కన్వీనర్‌గా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ. టి. మృణాళిని, టీఎస్ పీసెట్ శాతవాహన వర్సిటీ నిర్వహిస్తుండగా కన్వీనర్‌గా ఓయూ ప్రొ. రాజేశ్‌కుమార్ నియమితులయ్యారు.

నర్సింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్పెసిఫైడ్ స్కిల్డ్ వర్కర్స్ (ఎస్ఎస్‌డబ్ల్యూ)లో భాగంగా జపాన్‌లో పనిచేసేందుకు అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బందికి శిక్షణతోపాటు ఉద్యోగాలు కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మైత్రిప్రియ తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలశాఖ ఆధ్వర్యంలో ఇప్పటివరకు జపాన్‌లోని ప్రముఖ ఆస్పత్రులకు ఇప్పటివరకు రెండు బ్యాచ్‌ల్లో 31 మంది నర్సులను పంపించినట్లు చెప్పారు. ప్రస్తుతం 3వ బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. దీంతోపాటు తర్వాత బ్యాచ్‌ల అభ్యర్థుల ఎంపిక కోసం ఈనెల 29న శివం రోడ్డులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్ ట్రైనింగ్(ఎన్ఎస్‌టీఐ)లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8919047600, 6302292450 నంబర్లలో సంప్రదించాలని ఆమె వెల్లడించారు.

బీజేపీని గెలిపించేందుకు కాంగ్రెస్ డమ్మీలు

ఆ రెండు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయి: కేటీఆర్

యూసుఫ్‌గూడ/హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆ రెండు పార్టీలు అవగాహనతో పనిచేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ తరఫున డమ్మీ అభ్యర్థులను నిలిపి బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు హస్తం పార్టీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లబ్ధి చేకూర్చేలా బీజేపీ పనిచేసిందని తెలిపారు. శనివారం యూసుఫ్‌గూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ బూత్ కమిటీల విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నోటికొచ్చిన 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు హామీలు నెరవేర్చమంటే బీఆర్ఎస్ పార్టీని తిట్టే పనిలో నిమగ్నమయ్యారని మండిపడ్డారు. ఎన్నికల ముందు అదానీని తిట్టిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి రాగానే దావోస్ వెళ్లి ఆయనతో ఒప్పందాలు చేసుకొని వచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర అని తిరుగుతుంటే.. ఆ పార్టీ మిత్రపక్షాలు రాహుల్ ఛోడో అంటూ వదిలి వెళ్తున్నాయని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ అహంకారం వల్లనే ప్రతిపక్షాలు వదిలి వెళ్తున్నాయని, ఆ కూటమిలో మిగిలేది చివరికి రాహుల్ గాంధీ ఒక్కరేనని అన్నారు.



తెలంగాణ భవన్ వద్ద ఆటో డ్రైవర్‌కు డబ్బులు ఇస్తున్న కేటీఆర్

మోదీని అడ్డుకోవడం కాంగ్రెస్ వల్లకాదు..

ఢిల్లీలో ప్రధాని మోదీని అడ్డుకోవాలంటే కాంగ్రెస్ పార్టీతో కాదని కేటీఆర్ అన్నారు. బీజేపీని ఎదుర్కొనే శక్తి లేక.. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఇప్పటికే చేతులెత్తేసిందని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ, బిహార్‌లో నితీశ్‌కుమార్, పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీలాగే తెలంగాణలో కేసీఆర్ నాయకత్వానికి ప్రజలు మద్దతివ్వాలని కోరారు. ప్రాంతీయ పార్టీలు ఎక్కడికక్కడ గట్టిగా ఎదురునిలిచి పోరాడితేనే మోదీని ఎదుర్కోవడం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనా పరమైన కారణాలు చెప్పి హామీలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలోని కోటిన్నర మంది అర్హులైన మహిళలకు రూ.2500ను పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనారిటీలు వివక్షకు గురవుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం రేవంత్ మంత్రివర్గంలో మైనారిటీలకు స్థానం కల్పించడంలేదన్నారు. శనివారం బీఆర్ఎస్ మైనారిటీ విభాగం సమావేశంలో పార్టీ శ్రేణులనుద్దేశించి కేటీఆర్ ప్రసంగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మైనారిటీలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపినందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వారి గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. షబ్బీర్ అలీకి సలహాదారు పదవి ఇచ్చి చేతులు దులుపుకున్నారని, ఇది మైనారిటీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు. కాగా, అధికారం ఎవరి సొత్తూ కాదని, శాశ్వతం కాని అధికార అహంకారాన్ని సీఎం రేవంత్ నరనరాన ఎక్కించుకున్నారని బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, భిక్షమయ్యగౌడ్, శ్రీనివాస్ రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఆటోలో ప్రయాణించిన కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఆటోలో ప్రయాణించారు. మహిళలకు ఉచిత బస్సుల వల్ల తాము ఉపాధి కోల్పోతున్నామని ఆటో డ్రైవర్లు కేటీఆర్‌కు చెప్పడంతో.. వారి సమస్యలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి యూసుఫ్‌గూడ నుంచి బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్ వరకు ఆయన ఆటోలో వెళ్లారు. మార్గమధ్యంలో ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. కాగా, ఆటోల్లో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి ప్రభుత్వం తమకు రీయింబర్స్ చేస్తే బాగుంటుందని ఆటో డ్రైవర్లు తెలిపారు. దీంతో ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఒత్తిడి తెస్తామని కేటీఆర్ వారికి హామీ ఇచ్చారు.

హామీలు నెరవేర్చేదాకా పోరు: హరీశ్

సిద్దిపేట టౌన్, జనవరి 27: అధికారంలోకి వచ్చిన వెంటనే పలు హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఆ విషయంలో విఫలమైందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. డిసెంబరు 9న రైతు భరోసా డబ్బులు వేస్తామని చెప్పి, ఇప్పటికీ పూర్తి చేయలేదని విమర్శించారు. హామీలను ఎలా ఎగ్గొట్టాలని కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తున్నారని.. అందుకే అప్పులు, లంకె బిందెలంటూ సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే వరకు కాంగ్రెస్ సర్కారు వెంట పడతామని చెప్పారు. శనివారం సిద్దిపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ సిద్దిపేట నియోజకవర్గ సభలో హరీశ్‌రావు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోపు ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు..

టీఎస్‌పీఎస్సీ మరో సభ్యురాలి
రాజీనామా

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)లో మిగిలిన చివరి సభ్యురాలు కోట్ల అరుణ కుమారి శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు ఆమె తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదం కోసం పంపారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నానని, తన రాజీనామాను ఆమోదించాలని ఆమె కోరారు. దీంతో పాత సభ్యులందరూ కమిషన్ నుంచి వైదొలగినట్లయింది. తాజాగా టీఎస్‌పీఎస్సీకి కొత్త ఛైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డిని, ఇతర ఐదుగురు సభ్యులను కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే..

సీనియర్ ఐఏఎస్ నోటి దురుసు

- ఆయనపై సీఎం, డిప్యూటీ సీఎం, సీఎస్‌కు ఎస్టీ మహిళా అధికారి ఫిర్యాదు

హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అసభ్య పదజాలంతో తీవ్రంగా దూషిస్తున్నారంటూ సచివాలయంలో ముఖ్య కార్యదర్శి హోదాలో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారిపై గిరిజన మహిళా అధికారి ఈ నెల 24న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సీఎస్‌కు ఫిర్యాదుచేశారు. ఆయన బాధ్యతలు చేపట్టిన డిసెంబరు 13 నుంచి వేధింపులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. తాను తప్పు చేయకున్నా.. సీనియర్ ఐఏఎస్ దుర్భాషలాడుతున్నారని వాపోయారు. తనకు ఫైళ్లు పంపొద్దని కార్యాలయంలో ఆదేశాలు జారీ చేశారని వివరించారు. ఈ నెల 22న కీలక ఫైళ్లపై చర్చించాల్సి ఉందంటూ రాత్రి 9 గంటల దాకా కూర్చోబెట్టారని ఆరోపించారు. అయినా, తీవ్రంగా దుర్భాషలాడి 'ఫైళ్లు రేపు చూస్తా పో' అని పంపించి వేశారని తెలిపారు. అదే రోజు చాంబర్‌కు పిలిచి.. 'నీ ముఖం నాకు చూపించొద్దు' అని దూషించారని మహిళా అధికారి ఫిర్యాదులో వివరించారు. డిసెంబరులో తన కూతురిని స్కూల్ నుంచి తీసుకొచ్చేందుకు వెళ్లగా.. రాత్రి 8 గంటల సమయంలో ల్యాండ్ లైన్ నుంచి ఫోన్ చేసి వెంటనే సచివాలయానికి రావాలని ఆదేశించారని వాపోయారు.

ఉన్నత విద్యా సంస్థల గ్రేడింగ్‌కు స్వస్తి : న్యాక్

న్యూఢిల్లీ, జనవరి 27 : దేశంలోని ఉన్నత విద్యా సంస్థలకు అక్రెడిటేషన్ విధానం ద్వారా గ్రేడ్లు కేటాయించే పద్ధతికి న్యాక్(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్) స్వస్తి పలికింది. ఇకపై, అక్రెడిటెడ్, నాన్ అక్రెడిటెడ్‌గా ఆయా విద్యాసంస్థలను వర్గీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. అంతేకాక, అక్రెడిటెడ్ విద్యా సంస్థలను మరింత ప్రోత్సహించేందుకు ఇకపై 1 నుంచి 5 వరకు లెవెల్స్ కేటాయిస్తామని పేర్కొంది. ఈ రెండు విధానాలను దశల వారీగా అమలు చేయనున్నారు. బైనరీ అక్రెడిటేషన్(అక్రెడిటెడ్, నాన్ అక్రెడిటెడ్‌గా విభజన) విధానాన్ని నాలుగు నెలల్లోగా, మెచ్యూరిటీ బేస్డ్ గ్రేడెడ్ అక్రెడిటేషన్(లెవెల్ 1-5) విధానాన్ని డిసెంబరు నాటికి అమలు చేస్తామని న్యాక్ వర్గాలు తెలిపాయి.

సోమ్‌నాథ్ ఆలయం వద్ద ఆక్రమణల తొలగింపు

గిర్ సోమ్‌నాథ్, జనవరి 27: గుజరాత్‌లోని ప్రసిద్ధ సోమ్‌నాథ్ ఆలయం వెనుక నెలకొన్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. గిర్‌సోమ్‌నాథ్ జిల్లాలో సోమ్‌నాథ్ ఆలయ ట్రస్ట్, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మూడు హెక్టార్ల భూమిలో భారీగా ఆక్రమణలు నెలకొన్నాయి. అక్కడ 21 ఇళ్లు, 153 గుడిసెల్ని తొలగించినట్లు కలెక్టర్ హర్షి వాధ్వానియా తెలిపారు. 100 మంది రెవెన్యూ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం చేపట్టారు. భద్రతకు భారీ సంఖ్యలో పోలీసుల్ని నియమించారు. రెవెన్యూ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సోమ్‌నాథ్ ఆలయం గుజరాత్‌లోని వెరావల్ పట్టణానికి దగ్గరలో ప్రభాస్ పతన్ వద్ద అరేబియా సముద్ర తీరంలో ఉంది. శివుడి 12 జ్యోతిర్లింగాల్లో మొదటిది ఈ ఆలయంలో ఉంది.

జ్ఞానవాపిని హిందువులకివ్వండి: వీహెచ్‌పీ

న్యూఢిల్లీ, జనవరి 27: వారాణసీలోని జ్ఞానవాపి మసీదు స్థలాన్ని ముస్లింలు.. హిందువులకు అప్పగించాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. ఆ ప్రదేశంలో పురాతన ఆలయాన్ని కూల్చి మసీదు నిర్మించినట్లు ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక చెబుతున్నందున.. మసీదు నిర్వహణ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. వివాదాస్పద స్థలంలోని వాజుఖానాగా చెబుతున్న ప్రదేశంలో శివలింగాన్ని గుర్తించిన చోట పూజలు చేసుకునేందుకు హిందువులను అనుమతించాలని వీహెచ్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రార్థనా స్థలాల చట్టం 1991లోని సెక్షన్ 4 ప్రకారం కూడా జ్ఞానవాపి ప్రదేశాన్ని హిందూ ఆలయంగా ప్రకటించాలన్నారు. మసీదు నిర్వహణ బాధ్యతలు చూసే ఇంతెజామియా కమిటీ గౌరవప్రదంగా దీనిని హిందూ సొసైటీకి అప్పగించి, మసీదును మరో చోటకు తరలించుకోవాలన్నారు.

న్యాయ్ యాత్రకు సాయం చేయండి

న్యూఢిల్లీ, జనవరి 27: దేశం కోసం దానం చేయండి అంటూ ఇప్పటికే విరాళాల సేకరణను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ.. రాహుల్‌గాంధీ జోడో న్యాయ్ యాత్రకూ ఇలాంటి కార్యక్రమాన్నే చేపట్టింది. న్యాయ్ యాత్రకు సాయం చేయండి (డొనేట్ ఫర్ న్యాయ్) పేరిట తలపెట్టిన విరాళాల సేకరణను శనివారం పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, కోశాధికారి అజయ్ మాకెన్ ప్రారంభించారు. దాతలకు రాహుల్ సంతకంతో కూడిన లేఖ, ధ్రువపత్రం ఇవ్వనున్నారు. ఇక రూ.670 అంతకంటే ఎక్కువగా ఇచ్చినవారికి టీషర్ట్‌ను అందిస్తామని, రూ.67 వేల కంటే ఎక్కువ మొత్తం ఇచ్చినవారికి టీషర్ట్, బ్యాగ్, బ్యాండ్, బ్యాడ్జ్‌లతో కూడిన 'న్యాయ్ కిట్'ను ఇవ్వనున్నట్లు చెప్పారు. కేవలం రెండు గంటల్లోనే రూ.2 కోట్లు వచ్చినట్లు వివరించారు. విరాళాల సేకరణ ముఖ్య ఉద్దేశం కార్యకర్తల్లో ప్రేరణ కలిగించడమేనని.. డబ్బు కోసం కాదని తెలిపారు. డిసెంబరు 18న ఇచ్చిన 'దేశం కోసం దానం' పిలుపుతో రూ.20 కోట్లు వసూలైనట్లు పేర్కొన్నారు. బీజేపీ, ఆప్ ఇలాంటి పిలుపునిస్తే వాటికి రూ.కోటి కంటే ఎక్కువ రాలేదని మాకెన్ అన్నారు.

హమా‌స్‌కు ఐరాస ఏజెన్సీ సిబ్బంది సహకారం

జెరూసలేం, జనవరి 27: ఇజ్రాయెల్‌పై హమాస్ అక్టోబరు 7న జరిపిన దాడిలో ఐరాస అనుబంధ ఏజెన్సీ సభ్యులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. దాడిలో పాల్గొన్న యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనా రిఫ్యూజీస్ ఇన్ ద నియర్ ఈస్ట్(యూఎన్ఆర్‌డబ్ల్యూఏ)కు చెందిన 12 మంది సిబ్బంది వివరాలను గత నెలలోనే ఇజ్రాయెల్ ప్రభుత్వం ఐరాసకు అందజేసింది. శుక్రవారం యూఎన్ఆర్‌డబ్ల్యూఏ ఈ విషయాన్ని నిర్ధారించింది. 12 మంది సిబ్బందిని తొలగించామని, వారిపై ప్రాసిక్యూషన్ చేపడతామని ప్రకటించింది. మరోవైపు, ఐరాస సెక్రటరీ జనరల్ గుటెర్రస్ దీనిపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. హమా‌స్‌కు యూఎన్ఆర్‌డబ్ల్యూఏ సిబ్బంది సహకరించిన విషయం నిర్ధారణ అవ్వగానే.. పలు దేశాలు ఆ సంస్థకు నిధులను తాత్కాలికంగా నిలిపివేస్తామని ప్రకటించాయి. కాగా.. 1951 నుంచి పాలస్తీనాలో యూఎన్ఆర్‌డబ్ల్యూఏ సేవలను అందిస్తోంది.

భారతీయులున్న బ్రిటన్ నౌకపై హౌతీల దాడి

న్యూఢిల్లీ, జనవరి 27: ఎర్ర సముద్రంలో హౌతీలు మరోమారు రెచ్చిపోయారు. గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో మార్షల్ ఐలాండ్స్ జెండాతో చమురుతో వస్తున్న బ్రిటన్‌కు చెందిన కమర్షియల్ నౌకపై శుక్రవారం రాత్రి క్షిపణి దాడులు చేశారు. దీంతోపాటు.. ఎర్ర సముద్రంలో మోహరించిన అమెరికా యుద్ధనౌక- యూఎస్ఎస్ కార్నీపైనా దాడి చేశారు. బ్రిటన్ నౌక నుంచి ఎమర్జెన్సీ సమాచారం అందుకున్న భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్-విశాఖపట్నం సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. క్షిపణిదాడితో బ్రిటన్ నౌకకు మంటలు అంటుకున్నాయి. ఐఎన్ఎస్-విశాఖపట్నం సిబ్బంది వాటిని ఆర్పినట్లు భారత నౌకాదళం ఓ ప్రకటనలో తెలిపింది. బ్రిటన్ నౌకలో 22 మంది భారతీయులు, ఒక బంగ్లాదేశీ ఉన్నట్లు వివరించింది. వారంతా క్షేమమేనని చెప్పింది.



'ఇండియా'లో ఆరని మంటలు

యూపీలో 11 సీట్లే ఇస్తాం: అఖిలేశ్.. సీట్ల కోసమే కాంగ్రెస్ వల: డీఎంకే.. ముదిరిన అంతర్గత కుమ్ములాట

- ఐక్యతకు కృషి చేస్తున్నాం: ఖర్గే



బెంగళూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి), న్యూఢిల్లీ: 'ఇండియా' కూటమి పార్టీల ఐక్యత కోసం కృషి చేస్తానని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కూటమి పార్టీలు కాంగ్రె‌స్‌పై నిప్పులు చెరుగుతున్నాయి. ఇప్పటికే పంజాబ్‌లోని అధికార ఆప్, పశ్చిమ బెంగాల్‌లోని అధికార టీఎంసీలు పార్లమెంటు ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగుతామని స్పష్టం చేశాయి. ఇక ఇప్పుడు మరిన్ని పార్టీలు వ్యతిరేక గళం వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో సీట్లకోసమే తమ వెంట పడుతోందని తమిళనాడు అధికార పార్టీ డీఎంకే విమర్శలు గుప్పించగా, కేవలం 11 సీట్లకు మించి ఇచ్చేది లేదని యూపీ ప్రతిపక్ష పార్టీ సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తేల్చి చెప్పారు. దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

11తో మొదలు పెడదాం: ఎస్పీ

"మా సహృదయ కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి 11 సీట్లు ఇస్తున్నాం. ఇక్కడ నుంచి యుద్ధం మొదలుపెడదాం. ఇది విజయాన్ని అందించే ఫార్ములా. ఇండియా కూటమి చరిత్రను మారుస్తుంది" అని సమాజ్ వాదీ పార్టీ చీఫ్, మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఆ 11 స్థానాలు కూడా చాలా బలమైనవేనని చెప్పారు. అయితే.. దీనిపై కాంగ్రెస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అయితే, ఇంతలోనే ఎస్పీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన వచ్చింది. కాంగ్రెస్ పార్టీ గెలుపు గుర్రాలను చూపిస్తే మరిన్ని సీట్లు ఇచ్చేందుకు అఖిలేశ్ సిద్ధమేనని పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా ఇంకో ప్రకటన విడుదల చేసింది. పార్టీ సీనియర్ నేత అశోక్ గెహ్లోత్.. ఎస్పీ నేత అఖిలేశ్‌తో సీట్ల విషయంపై చర్చలు జరుపుతున్నారని తెలిపింది. దీనిపై స్పష్టత వచ్చిన తర్వాత వెల్లడిస్తామని వివరించింది. ఇదిలా వుంటే, శనివారం ఓ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై అఖిలేశ్ విమర్శలు గుప్పించారు. కూటమి పార్టీలతో ఏ విషయం కూడా చర్చించడం లేదని.. అసలు చర్చించే ఆలోచన కూడా కాంగ్రె‌స్‌కు ఉన్నట్టు కనిపించడం లేదని అన్నారు.

కాంగ్రె‌స్‌కు బలం లేదు: డీఎంకే

ఇండియా కూటమి పార్టీ, తమిళనాడు అధికార పార్టీ డీఎంకే కూడా మిత్రపక్షం కాంగ్రె‌స్‌పై విమర్శలు గుప్పించింది. సుదీర్ఘ చరిత్ర, అతి పెద్ద కేడర్ ఉన్న పార్టీనే అయినప్పటికీ.. ఇప్పుడు ఆ పార్టీ సత్తువ కోల్పోయిందని డీఎంకే నేత, మంత్రి రాజా కన్నప్పన్ అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల కోసమే పార్టీ తమ వెంట పడుతోందని దుయ్యబట్టారు. "కాంగ్రెస్‌ను గమనిస్తే సీట్ల కోసమే వారు పార్టీని నడుపుతున్నట్టుంది. కానీ, దానివల్ల ప్రయోజనమేంటి? కష్టపడి పనిచేయాలని, ప్రజలకు మంచి చేయాలని భావించి వారు పార్టీని నడపడం లేదు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలోనే వారు వస్తారు. ఈ తరహా ఆలోచన ప్రజల మధ్య పనిచేయదు" అని రాజా నిప్పులు చెరిగారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోందని, కానీ, తాము ఆ పార్టీని తరిమికొడతామని వ్యాఖ్యానించారు. ఇదిలా వుంటే, పార్లమెంటు ఎన్నికల్లో సీట్ల కేటాయింపుపై ఆదివారం డీఎంకే, కాంగ్రెస్ భేటీ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజా వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

కాంగ్రెస్ బట్టలూడదీశారు: బీజేపీ

ఇండియా కూటమి పార్టీల్లో కాంగ్రె‌స్‌పై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత నేపథ్యంలో బీజేపీ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "కూటమి పార్టీలన్నీ సమష్టిగా కాంగ్రెస్ బట్టలూడదీశాయి" అని తమిళనాడు బీజేపీ చీఫ్ కె. అన్నామలై ఎద్దేవా చేశారు. డీఎంకే మంత్రి రాజా చేసిన వ్యాఖ్యల వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసిన ఆయన.. కూటమి పార్టీలు వాస్తవాలు చెబుతున్నాయన్నారు. కాంగ్రె‌స్‌లో నేతలే తప్ప కేడర్ లేదని విమర్శించారు.

ఖర్గే ఏమన్నారంటే..

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం కలబురగి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. ఇండియా కూటమి ఐక్యత కోసం కలసి పనిచేద్దామని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీతోపాటు కూటమిలోని పార్టీ నేతలకు లేఖలు రాశానని తెలిపారు. బిహార్ సీఎం నితీశ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేసే విషయం తనకు తెలియదని, నితీశ్ గవర్నర్‌ను కలిశారో లేదో కూడా తెలియదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఐక్యత ముఖ్యమని తెలిపారు. కాగా, బిహార్‌లో చోటు చేసుకుంటున్న రాజకీయాలపై నితీశ్‌కుమార్‌తో మాట్లాడేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫోన్‌లో పలుమార్లు ప్రయత్నించినా ఆయన బిజీగా ఉండడంతో సాధ్యం కాలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో వెల్లడించారు.

23 రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌లు

- లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా బీజేపీ నియామకం

న్యూఢిల్లీ, జనవరి 27: లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ సర్వసన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఎన్నికల ఇన్‌చార్జ్‌లు, సహ ఇన్‌చార్జ్‌లను శనివారం నియమించింది. ఈ మేరకు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నియామకాలు చేపట్టినట్టు ప్రకటన వెలువడింది. వీరిలో బీజేపీ జాతీయ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డేను బిహార్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించారు. తావ్డే బిహార్‌లో బీజేపీ రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. యూపీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పార్టీ ఉపాధ్యక్షుడు బైజయంత్ పాండాను, జాతీయ జనరల్ సెక్రటరీ దుశ్యంత్ కుమార్ గౌతమ్‌ను ఉత్తరాఖండ్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. మధ్యప్రదేశ్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్సీ మహేంద్ర సింగ్ నియమితులయ్యారు.

30న ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ భేటీ

హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికలకుగాను రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల అభ్యర్థులకు సంబంధించి ప్రాథమిక వడపోత కోసం ఏఐసీసీ నియమించిన తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశం ఈ నెల 30న గాంధీభవన్‌లో జరగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఆశావహుల వడపోతకు మార్గదర్శకాలను రూపొందించనున్నారు.

రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు సిద్ధం

మంత్రి శ్రీధర్‌బాబుతో 'స్మైల్ డిజిటల్ హెల్త్' సీఈవో

హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నామని కెనడా ప్రధాన కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న స్మైల్ డిజిటల్ హెల్త్ ప్రకటించింది. కంపెనీ సీఈవో డంకన్ వెదర్‌స్టన్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం శనివారం ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో సచివాలయంలో సమావేశమయ్యారు. అనేక దేశాల్లో విస్తరించి ఉన్న తమ వ్యాపారాలను హైదరాబాద్ కేంద్రంగా భారత్‌లో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. ఆరోగ్యరంగంలో పెరుగుతున్న ఐటీ వినియోగానికి అనుగుణంగా తమకు భారత్ కీలకమైన మార్కెట్ అని, త్వరలో పెట్టుబడుల వివరాలు ప్రకటిస్తామని సీఈవో చెప్పారు. పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఉంటుందని శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు.

సయోధ్య కుదరని పని: మమత

బెంగళూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి), న్యూఢిల్లీ: టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కాంగ్రెస్ పార్టీతో సయోధ్య చేసుకునే పనిలేదని తేల్చి చెప్పారు. ఇది జరగని పనిగా ఆమె పేర్కొన్నారు. దీంతో పార్లమెంటు ఎన్నికల వేళ ఆమె కాంగ్రె‌స్‌కు తలుపులు మూసేసినట్టయింది. "భారత్ జోడో న్యాయయాత్ర మా రాష్ట్రంలోకి అడుగు పెట్టింది. కనీసం మాట మాత్రంగా కూడా మాకు చెప్పలేదు. నాకు రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు సోనియా, ప్రియాంక ఫోన్ చేసి పరామర్శించారు. కానీ, యాత్ర గురించి మాట మాత్రం నాకు చెప్పలేదు" అని మమత వ్యాఖ్యానించారు. శనివారం రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. "కాంగ్రె‌స్‌తో పొత్తు పెట్టుకోకూడదని అనుకున్నాం. దీనిపై పునరాలోచించే అవకాశం లేదు. ఆ పార్టీతో సయోధ్యకుదరని పని" అని మమత అన్నారు. "ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని నిర్ణయించుకున్నాక కూడా ఇండియా కూటమి పార్టీలు మాతో మాట్లాడలేదు. వాళ్లని విశ్రాంతి తీసుకోమనండి. ఏం చేయాలో ఎన్నికలయ్యాక చూద్దాం" అని వ్యాఖ్యానించారు. కాగా, బెంగాల్‌లో భారత్ జోడో న్యాయయాత్రలో పాల్గొనే వారికి తగిన భద్రత కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే మమతకు లేఖ రాశారు.

నేడు రాజీనామా.. ప్రమాణం!



(మొదటి పేజీ తరువాయి)

పార్టీ (రాం విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ భేటీ అయ్యారు. నితీశ్ సారథ్యంలోని జేడీయూకి బీజేపీతోపాటు మాజీ సీఎం జితన్‌రాం మాంఝీ నేతృత్వంలోని హిందుస్థానీ అవామీ మోర్చా కూడా మద్దతు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బీజేపీకి రెండు డిప్యూటీ సీఎం పదవులు, అసెంబ్లీ స్పీకర్ పదవితో పాటు మంత్రివర్గంలో ప్రాధాన్యం ఇచ్చేలా ఆ పార్టీతో జేడీయూకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ఆదివారం ఉదయం బీజేపీ, జేడీయూ విడివిడిగా ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేశాయి. ఎమ్మెల్యేలతో భేటీ అనంతరం నితీశ్ సీఎం పదవికి రాజీనామా చేస్తారని, ఆ తర్వాత తనకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు సమర్పించి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారని తెలుస్తోంది. ఈ మేరకు ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ సెక్రటేరియట్‌తోపాటు ఇతర ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలు తెరిచి ఉండాలని ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. కాగా, బిహార్ పరిణామాలపై జేడీయూ అధికార ప్రతినిధి కేసీ త్యాగి ఢిల్లీలో విలేకర్లతో మాట్లాడుతూ, కాంగ్రె‌స్‌లో కొందరు నేతలు నితీశ్‌ను పలుమార్లు అవమానించారని ఆరోపించారు. బెంగాల్, పంజాబ్‌లలోలాగే బిహార్‌లో కూడా ఇండియా కూటమి పార్టీల మధ్య పొత్తు ముగియనుందన్నారు. కాగా, జేడీయూ అధ్యక్షుడు నితీశ్‌కుమార్ వైఖరి లౌకిక ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేలా ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ విమర్శించారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం తర్వాత దేశవ్యాప్తంగా తన ప్రత్యర్థి రాజకీయ పార్టీలపై బీజేపీ బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు.

17న జీఎస్ఎల్వీ-ఎఫ్14

సూళ్లూరుపేట, జనవరి 27: ఇస్రో మరో ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ఫిబ్రవరి 17న జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ప్రయోగం చేపట్టనున్నారు. ఈ రాకెట్ ద్వారా రోదసిలోకి పంపే ఇన్‌శాట్-3డీ ఉపగ్రహం శనివారం షార్‌కు చేరింది. బెంగళూరులోని ఉపగ్రహ కేంద్రం నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో దీన్ని శ్రీహరికోటకు తీసుకొచ్చారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ప్రయోగించే జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తిచేస్తున్నారు. ఇన్‌శాట్-3డీ ఉపగ్రహాన్ని క్లీన్‌రూమ్‌లో ఉంచి తుది పరీక్షలు నిర్వహిస్తారు. కాగా, పోలార్ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్-3(పీవోఈఎం-3) విజయవంతమైందని ఇస్రో ప్రకటించింది.

కేరళ గవర్నర్‌కు జడ్ ప్లస్ భద్రత



తిరువనంతపురం, జనవరి 27: కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు కేంద్ర ప్రభుత్వం జడ్ ప్లస్ భద్రత కల్పించింది. అధికార పార్టీ సీపీఎం అనుబంధ విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ నిరసనలకు వ్యతిరేకంగా గవర్నర్ రోడ్డుపై రెండు గంటలు బైఠాయించిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అంతకుముందు.. శనివారం ఉదయం ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు కొల్లాం జిల్లాలో ప్రయాణిస్తున్న గవర్నర్.. రోడ్డుపక్కన ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు నల్ల జెండాలతో నిరసన తెలపడం గమనించి కారు ఆపాలని సిబ్బందిని ఆదేశించారు. కారు దిగి నేరుగా ఆందోళనకారుల వద్దకు నడుచుకుంటూ వెళ్లిన గవర్నర్.. రాష్ట్రంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను సీఎం విజయన్ ప్రోత్సహిస్తున్నారని, నిరసనకారులను అరెస్టు చేయడం లేదని నిందించారు. అధికారుల నుంచి స్పందన లేదంటూ నిరసనగా గవర్నర్ అక్కడే రెండు గంటలసేపు బైఠాయించారు. అయితే, తానేమీ నిరసన తెలపలేదని, ఎస్ఎఫ్ఐ నేతలపై చర్యలకు డిమాండ్ చేశానని, ఎఫ్ఐఆర్ కాపీని పోలీసులు తనకు అందించే వరకు అక్కడ వేచి ఉన్నానని గవర్నర్ తెలిపారు.

కరోల్‌కు 8.33 కోట్ల డాలర్లు చెల్లించండి

డొనాల్డ్ ట్రంప్‌ను ఆదేశించిన అమెరికా కోర్టు

న్యూయార్క్, జనవరి 27: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. లైంగిక వేధింపుల కేసులో రచయిత్రి ఇ.జీన్ కరోల్‌కు ఆయన 8.33 కోట్ల డాలర్లు (దాదాపు రూ.690 కోట్లు) నష్టపరిహారం కింద చెల్లించాలని మాన్‌హట్టన్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కొన్నేళ్ల క్రితం తనపై అత్యాచారం చేసిన ట్రంప్... ఇప్పుడు ఒక జర్నలిస్టుగా తన విశ్వసనీయతను దెబ్బతీసే వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కరోల్ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ఐదు రోజుల విచారణ అనంతరం మాన్‌హట్టన్ ఫెడరల్ కోర్టు న్యాయమూర్తులు శుక్రవారం మూడు గంటల్లోనే తీర్పును వెలువరించారు. కరోల్‌కు నష్టపరిహారం కింద 1.83 కోట్ల డాలర్లు చెల్లించాలని, అలాగే భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలతో ఆమెను కించపరచకుండా ఉండేందుకు మరో 6.5 కోట్ల డాలర్లు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. అయితే ఈ తీర్పుపై అప్పీలుకు వెళ్తామని ట్రంప్ ప్రకటించారు.

ఒక్కో ఎమ్మెల్యేకు 25 కోట్లు

- మా వాళ్లలో ఏడుగురికి బీజేపీ వల
- మద్యం కుంభకోణంలో నన్ను అరెస్టు చేసి ఢిల్లీ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర: కేజ్రీవాల్



న్యూఢిల్లీ, జనవరి 27 : ఢిల్లీ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ భారీ కుట్రలు చేస్తోందని ఆ రాష్ట్ర సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఒక్కొక్కరికి రూ.25 కోట్లు ఆశ చూపి ఆప్‌కు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ యత్నించిందని తెలిపారు. అంతేకాక, రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకే మద్యం కుంభకోణం కేసులో తనని అరెస్టు చేయాలని చూస్తున్నారని చెప్పారు. అయితే, కేజ్రీవాల్ చేసిన ఆరోపణలను బీజేపీ కొట్టిపారేసింది. తమపై నిందలు వేయడం కాదని ఎమ్మెల్యే కొనుగోలు యత్నానికి సంబంధించిన ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాలు విసిరింది. ఇందుకు స్పందించిన ఆప్ నేతలు తమ వద్ద ఉన్న ఆధారాలను, కాల్ రికార్డింగులను త్వరలోనే బయటపెడతామని కౌంటరిచ్చారు. ఎమ్మెల్యేల కొనుగోలు అంశంపై కేజ్రీవాల్ ఎక్స్(ట్విటర్)లో శనివారం ఓ పోస్టు పెట్టారు. తమ పార్టీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలను బీజేపీ వ్యక్తులు ఫోన్ ద్వారా సంప్రదించారని ఆ పోస్టులో పేర్కొన్నారు. కేజ్రీవాల్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని, ఆపై ఢిల్లీ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని సదరు వ్యక్తులు తమ ఎమ్మెల్యేలకు చెప్పారని అన్నారు. ఇప్పటికే 21 మంది ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరిపామని, మిగిలిన వారితోనూ మాట్లాడతామని ఆ తర్వాత ఆప్ ప్రభుత్వం లేకుండా చేస్తామన్నారని వివరించారు. తమతో కలిస్తే రూ.25 కోట్ల నగదు, బీజేపీ టికెట్ మీద పోటీ చేసే అవకాశం ఇస్తామని ప్రతిపాదన చేశారని పేర్కొన్నారు. అయితే, 21 మంది ఎమ్మెల్యేలతో ఇప్పటికే మాట్లాడామని ఆ వ్యక్తులు చెప్పిన మాటల్లో నిజం లేదని కేజ్రీవాల్ తెలిపారు. తమకున్న సమాచారం మేరకు ఏడుగురు ఎమ్మెల్యేలకే ఇలాంటి కాల్స్ వచ్చాయని, వారంతా బీజేపీ ప్రతిపాదనలను తిరస్కరించారని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు తొమ్మిదేళ్లుగా బీజేపీ ఎన్నో కుట్రలు చేసి విఫలమైందన్నారు.

ఆధారాలు బయటపెట్టు : ఢిల్లీ బీజేపీ చీఫ్

కేజ్రీవాల్ చేసిన ఆరోపణలు ఆయన దివాళాకోరు రాజకీయాన్ని, ఆప్‌లో అసహనాన్ని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు యత్నాలంటూ ప్రజలకు అబద్ధాలు చెప్పడం కాదని చేతనైతే తగిన ఆధారాలు బయపెట్టాలని సవాల్ విసిరారు. బీజేపీని అప్రతిష్ఠపాలు చేసేందుకు కేజ్రీవాల్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత రాంవీర్ సింగ్ బిధూరీ అన్నారు.

సరిహద్దు వివాదాల పరిష్కారానికి జాయింట్ సర్వే

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ధరణి కమిటీ కన్వీనర్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు ఎం.సునీల్‌కుమార్, మాజీ సీసీఎల్ఏ రేమండ్ పీటర్, కోదండరెడ్డి, మధుసూదన్, సీఎంఆర్వో ప్రాజెక్టు డైరెక్టర్ వి.లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ధరణిలో అటవీ భూముల మిస్సింగ్

సభ్యులు అడిగిన ప్రశ్నలకు అటవీ శాఖ అధికారులు ధరణి పోర్టల్‌తో తమకెలాంటి సంబంధంలేదని చెప్పారు. "అటవీ శాఖకు చెందిన భూముల వివరాలను అప్‌లోడ్ చేసేందుకూ మాకు అవకాశం లేదు. అందులో నమోదైన భూములను డిలీట్ చేసే అధికారం లేదు. అటవీశాఖకు సంబంధించిన అన్ని భూముల వివరాలు ధరణిలో కనిపించడం లేదు. మా రికార్డుల ప్రకారం చూస్తే ధరణిలో పెద్ద మొత్తంలో తేడాలున్నాయి" అని వివరించారు. కొన్ని అటవీ భూములు ధరణిలో కనిపించడంలేదన్నారు. రెవెన్యూ-అటవీ భూములకు సంబంధించి చాలాచోట్ల సరిహద్దు వివాదాలున్నాయని.. దీనివల్ల ధరణిలో కొన్ని సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్వోఎఫ్ఆర్ చట్టానికి లోబడి తాము పట్టాలు పంపిణీ చేసినట్లు వివరించారు. దీనికి ధరణి సభ్యులు స్పందిస్తూ.. రెవెన్యూ-అటవీ భూముల సమస్యకు జాయింట్ సర్వేతో పరిష్కరించవచ్చని అభిప్రాయపడ్డారు.

రెవెన్యూ డేటాతోనే రైతుబంధు

రైతుబంధుపైనా ధరణి కమిటీ వ్యవసాయ అధికారులపై ప్రశ్నలు వేసింది. "రైతుబంధు పంపిణీకి ప్రభుత్వం విధించిన గడువు (కట్ ఆఫ్ డేట్)ను దృష్టిలో పెట్టుకొని, రెవెన్యూ శాఖ ఇచ్చిన రైతుల వివరాలు, భూ విస్తీర్ణం డేటా ఆధారంగా రైతుబంధు పంపిణీ చేస్తున్నాం. ధరణి పోర్టల్‌పై మా శాఖకు ఎలాంటి అధికారం లేదు" అని అధికారులు వివరించారు. కౌలుదారులకు రైతుబంధు గురించి ప్రశ్నించగా.. ధరణి వచ్చాక కౌలుదారుల కాలమ్‌ను తొలగించారని, దాంతో ఆ కేటగిరీని గుర్తించడం లేదని చెప్పారు. కరువు, వరదలు వచ్చినప్పుడే సర్కారు ఆదేశాలతో పంటల సాగు, విస్తీర్ణాన్ని గుర్తిస్తున్నామన్నారు.

షెడ్యూల్డ్ ఏరియాలో సమస్యల్లేవు?

షెడ్యూల్డ్ ఏరియాల్లో ధరణి సమస్యలు, ఎల్‌టీఆర్ చట్టం అమలుపై గిరిజన సంక్షేమశాఖ అధికారులను ధరణి కమిటీ ప్రశ్నించింది. "షెడ్యూల్డ్ వర్గానికి చెందిన వ్యక్తులే ధరణి ద్వారా వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏ సమస్యలులేవు. భూమిని అనుభవిస్తూ, పట్టాదార్ పాసుపుస్తకాలు రాని వారెందరో ఉన్నారు. ధరణిలో వారి వివరాల నమోదుకు సంబంధిత కాలమ్‌లేదు. దాంతో ఎందరు భూములను అనుభవిస్తున్నారనేదాన్ని గుర్తించలేం"అని గిరిజన సంక్షేమ అధికారులు వివరించారు. కాగా ధరణి కమిటీ వచ్చే వారం లో సర్వే ఆఫ్ ల్యాండ్ సెటిల్‌మెంట్, దేవాదాయ శాఖ, వక్ఫ్‌బోర్డుతో సమావేశంకానుంది.


రూ. 17,102 కోట్లు

- 2024-25లో డిస్కమ్‌లకు భారీగా రాయితీని ప్రతిపాదించిన ఇంధన శాఖ

హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'గృహజ్యోతి' పథకం కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించే పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.17,102 కోట్లను సబ్సిడీగా అందించాల్సి ఉంటుందని ప్రతిపాదించింది. ఇందులో ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్)కు రూ.14,048 కోట్లు, దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్)కు రూ.3,654 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని లెక్కకట్టింది. ప్రస్తుతం డిస్కంలకు ఏటా రూ.11,500 కోట్లు సబ్సిడీగా ఇస్తున్నారు. ఇందుకు ప్రతి నెల రూ.958 కోట్లు విడుదల చేస్తున్నారు. డిస్కమ్‌లు నెలకు రూ.1,386 కోట్ల నష్టాల్లో నడుస్తున్నాయని ఇటీవల శ్వేతపత్రంలో సర్కారు ప్రకటించింది. రాయితీ పొందేవారి జాబితాలో గృహజ్యోతి వినియోగదారులూ చేరనున్నారు. వీరికే ఏటా రూ.3,431 కోట్ల వ్యయం అవుతుందని గుర్తించారు. దీంతో ఏటా రూ.17,102 కోట్లు సబ్సిడీగా అందిస్తేనే డిస్కమ్‌లు బతికిబట్టకడతాయని ఇంధనశాఖ ప్రతిపాదించింది. బడ్జెట్‌లో దీన్ని యథాతథంగా ఆమోదిస్తారా? కత్తిరింపులు చేస్తారా? అనేది త్వరలో తేలనుంది. ప్రభుత్వం 6 గ్యారంటీల్లో అత్యంత కీలకమైనదిగా గృహజ్యోతిని పరిగణిస్తోంది. వ్యయంపై వివరాలు కోరగా రూ.3,431కోట్ల దాకా అవుతుందని డిస్కమ్‌లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాయి. ఈఆర్సీకి డిస్కంలు ఇచ్చిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక 2023-24లోని ఫారం-12 ప్రకారం రాష్ట్రంలో గృహవిద్యుత్ కనెక్షన్లు 1.2కోట్లు. వీటిలో 1.05 కోట్ల కనెక్షన్లు నెలకు 200యూనిట్లలోపు వినియోగిస్తున్నాయి. ఇందులో కొన్ని 0-50 యూనిట్లలోపు, మరికొన్ని 51-100లోపు, ఇంకొన్ని 101-200 యూనిట్లలోపు విద్యుత్‌ను వాడుతున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

భావోద్వేగానికి లోనైన
తండ్రీకూతుళ్లు



'లాల్ సలామ్' ఆడియో వేడుకలో తండ్రీకూతుళ్లు రజనీకాంత్, ఐశ్వర్య భావోద్వేగానికి లోనయ్యారు. ఊహించని ఈ పరిణామాలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. రజనీకాంత్ ప్రత్యేకపాత్రలో విష్ణు విశాల్ కథానాయకుడిగా ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లాల్ సలామ్'. రీసెంట్‌గా జరిగిన ఈ చిత్రం ఆడియోవేడుకలో తన తండ్రి రజనీకాంత్‌పై వస్తున్న ట్రోల్స్‌పై ఐశ్వర్య స్పందిస్తూ.. 'ఈ మధ్యకాలంలో మా నాన్నని కొందరు 'సంఘీ' అంటూ విమర్శిస్తున్నారు. ఏదోఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇచ్చేవారిని 'సంఘీ' అంటారని తర్వాత తెలిసింది. ఈ వేదిక సాక్షిగా చెబుతున్నాను. మా నాన్న 'సంఘీ' కాదు. ఆయన అలాంటివారైతే నా 'లాల్ సలామ్'లో నటించేవారే కాదు. మొదట్నుంచీ సోషల్‌మీడియాకు నేను దూరం. ఇందులో వచ్చే విష ప్రచారాల గురించి నా టీమ్ ద్వారా తెలుసుకుంటూవుంటాను. మేమూ అందరిలాంటివాళ్లమే. కాస్త కంట్రోల్లో ఉండండి..' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు ఐశ్వర్య. అదే వేడుకలో రజనీకాంత్ మాట్లాడుతూ.. 'విజయ్ నా బిడ్డలాంటి వాడు. నా కంటిముందు పెరిగిన వాడు. టాలెంట్‌తో, పట్టుదలతో కష్టపడి ఈ స్థాయికి వచ్చినవాడు. అతడ్ని టార్గెట్ చేస్తూ నేను మాట్లాడాననీ, 'జైలర్' ఈవెంట్‌లో 'అర్థమైందా రాజా..' అని నేను అన్నది విజయ్‌నే ననీ, విజయ్‌పై పరోక్షంగా మాటల దాడి చేశానని ఇష్టం వచ్చినట్టు రాశారు. యూట్యూబ్ ఛానల్స్‌లో వీడియోలు కూడా పెట్టారు. నిజంగా చాలా బాధపడ్డాను. నా అభిమానులకు నేను చెప్పేదొక్కటే. నేను ఎవరికీ పోటీ కాదు. నాకెవరూ పోటీ లేరు. నాకు నేనే పోటీ. నన్ను వేరేవాళ్లతో పోల్చి చూడొద్దు' అంటూ ఉద్వేగంగా మాట్లాడారు రజనీకాంత్.

మెగా కోడలా.. మజాకా..



లావణ్య త్రిపాఠి, వరుణ్ ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే.. ఏనాడో ప్రేమలో పడ్డ ఈ జంట.. వారి ప్రేమ వ్యవహారం బయటికి పొక్కకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక్కసారంటే ఒక్కసారి కూడా మీడియా కెమెరాలకు వీరిద్దరూ చిక్కకపోవడం నిజంగా గ్రేట్. ఏదిఏమైనా పెద్దల అంగీకారంతో ఇద్దరూ పెళ్లాడేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరంగా తన పెళ్లి ముచ్చట్లను చెప్పుకొచ్చారు మెగా కోడలు లావణ్య త్రిపాఠి. ఈ సందర్భంలో 'ఇంతకీ ఆడపడుచు కట్నం ఎంతిచ్చారేంటి?' అని యాంకరమ్మ ఆడిగిన ప్రశ్నకు లావణ్య సమాధనమిస్తూ.. 'తనకు నేనేం ఇవ్వలేదు. తను మా ఇంటి పిల్ల. కావాలంటే తనకు ఏమైనా ఇస్తాను. ఈ మధ్య నిహారిక సొంతగా ప్రొడక్షన్ స్టార్ట్ చేసిందికదా.. మంచి కథ ఉంటే తన బ్యానర్‌లో పైసా తీసుకోకుండా నటిస్తాను కూడా' అంటూ చెప్పుకొచ్చారు లావణ్య త్రిపాఠి. లావణ్య సమాధానం విన్న మెగాఫ్యాన్స్. 'మెగా కోడలా మజాకా..' అంటూ కితాబులిచ్చేస్తున్నారట.

ఊహలకందని ఫాంటసీ
విశ్వంభర

సోషియో ఫాంటసీలు చిరంజీవికి కొత్తేం కాదు. పున్నమినాగు, యముడికిమొగుడు, జగదేకవీరుడు-అతిలోక సుందరి, అంజి.. ఈ సినిమాలన్నీ ఫాంటసీ సినిమాలే. ఓ విధంగా చెప్పాలంటే ఇప్పుడున్న హీరోల్లో చిరంజీవి చేసినన్ని ఫాంటసీ సినిమాలు ఏహీరో చేయలేదన్నది నిజం. అలాంటి సూపర్‌స్టార్‌తో సోషియో ఫాంటసీ తీస్తున్నాడు దర్శకుడు వశిష్ఠ. ఆయన తీసిన గత చిత్రం 'బింబిసార' కూడా సోషియో ఫాంటసీనే కావడం విశేషం. మరి మెగాస్టార్‌తో చేస్తున్న



'విశ్వంభర'లో కొత్తదనం ఏంటి? ఈ ఫాంటసీ కథ నేపథ్యం ఏంటి? అనేది ఇప్పుడు అభిమానుల్లో తలెత్తుతున్న ప్రశ్న. హీరో అయిదు లోకాలు తిరుగుతాడని, అయిదుగురు హీరోయిన్లు ఉంటారని, దేవకన్యల నేపథ్యంలో ఎన్టీయార్ 'జగదేకవీరునికథ' లాగా ఉంటుందని చాలామంది వార్తలు రాశారు కూడా.



కానీ.. వశిష్ఠ తీసుకున్న కాన్సెప్ట్ వీటన్నింటికీ అతీతమైందని తెలుస్తోంది. ఊహలకు అందని స్థాయిలో ఈ ఫాంటసీ కథ ఉంటుందని యూనిట్ వర్గాల టాక్. దేవలోకాలూ, దేవకన్యలూ ఈ సినిమా ఉండరట. ఓ కొత్త జానర్‌లో సృష్టి నేపథ్యంలో రోమాంచితమైన సన్నివేశాలతో, వెండితెరపై మునుపెన్నడూ చూడనటువంటి పాత్రలతో మరో లోకంలోకి తీసుకెళ్లేలా 'విశ్వంభర' ఉండబోతోందని సమాచారం. మిగతా వివరాలు తెలియాల్సివుంది.

రాధిక కామెంట్ ఆ సినిమా గురించేనా?..



సీనియర్ నటి రాధిక తన ఎక్స్(ట్విటర్)లో పెట్టిన చిన్న కామెంట్ ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశమైంది. 'ఈ మధ్య ఏ సినిమా అయినా మీకు చిరాకు పుట్టించిందా..? నాకైతే ఓ సినిమా చాలా చిరాకు పుట్టించింది. మధ్యలోనే ఆపేయాలన్నంత కోపం తెప్పించింది' అంటూ సినిమా పేరు చెప్పకుండా ఎక్స్(ట్విటర్)లో కామెంట్ పెట్టారు రాధిక. అప్పట్నుంచి మొదలైంది నెటిజన్స్‌లో మథనం. రాధిక మాట్లాడింది ఫలానా సినిమా గురించని కొందరు, కాదు ఫలానా సినిమా గురించని మరికొందరు. అయితే ఎక్కువమంది ఓట్లు మాత్రం 'యానిమల్' సినిమాకే పడ్డాయి. రాధిక మాట్లాడింది కచ్చితంగా 'యానిమల్' గురించే అయ్యుంటుందని చాలామంది అనుమానం వెలిబుచ్చారు. ఆ అనుమానాలను బలపరిచే అంశం కూడా లేకపోలేదు. ఈ గణతంత్రదినోత్సవం సందర్భంగా ఈ నెల 26న 'యానిమల్' ఓటీటీ స్ట్రీమింగ్ మొదలైంది. ఈ నేపథ్యంలో రాధిక నుంచి ఈ కామెంట్ రావడంతో ఆమె మాట్లాడింది 'యానిమల్' గురించేనని చాలామంది అంటున్నారు. రాధిక కూడా ఈ విషయంపై మౌనంగా ఉండటం గమనార్హం.

అభిషేక్ పోస్ట్ ఐశ్వర్య గురించేనా?..

సోషల్ మీడియా పుణ్యమా అని చిన్న హింట్ దొరికితే చాలు, వార్తలు రాసేయడం కొందరు నెటిజన్స్‌కి పరిపాటైపోయింది. చేతిలో ఫోన్ ఉన్న ప్రతివాడూ ఇప్పుడు జర్నలిస్టే అన్నట్టు తయారైంది ప్రపంచం. అభిషేక్, ఐశ్వర్య వైవాహిక సంబంధంపై గత కొన్ని రోజులుగా రకరకాల వార్తలు వినిపిస్తూనేవున్నాయి. వాళ్లు విడివిడిగా బతుకుతున్నారనీ, లీగల్‌గా తెగతెంపులు చేసుకోవడమే ఆలస్యం అనీ.. రకరకాలుగా వార్తలు సోషల్‌మీడియా వండి వారుస్తోంది. వాటన్నింటినీ బ్రేక్ చేస్తూ ఇటీవలే తన కుమార్తె స్కూల్ ఫంక్షన్‌కి హాజరయ్యారు ఐశ్వర్యరాయ్. అలాగే ప్రో కబడ్డీ ఈవెంట్‌కి తన మామ అమితాబ్‌తో కలిసి హాజరై నెటిజన్స్ నోళ్లు మూయించారామె. ఇదిలావుంటే.. ఇటీవల ఓ ప్రైవేటు వేడుకకు హాజరైన అభిషేక్, తన పెళ్లి ఉంగరం లేకుండా కనిపించారు. దాంతో ఇప్పుడది కొత్త చర్చకు దారితీసింది. ఎప్పుడూ ఉంగరంతో కనిపించే అభిషేక్ ఇప్పుడు ఉంగరం లేకుండా ఎందుకు బయటకొచ్చారంటూ వార్తలు రాయడం మొదలుపెట్టారు. దీనికి ఆజ్యం పోస్తూ.. తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టాడు అభిషేక్. 'పరాజయం కలలను నాశనం చేస్తుంది.. కానీ ఆ ఓటమిని గుణపాఠంగా తీసుకుని ముందుకెళ్తే, కలలు నిజమవుతాయ్' అనేది ఆ పోస్ట్ సారాంశం. ఈ పోస్ట్ కూడా ఐశ్వర్యను దృష్టిలో పెట్టుకొనే అభిషేక్ పెట్టాడని కొందరి వాదన. మరి వీటికి బ్రేక్ ఎప్పుడు పడుతుందో చూడాలి.




హనుమంతుడిగా సన్నీడియోల్



బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారి రామాయణ గాథను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్, విభీషణుడిగా విజయ్ సేతుపతి నటించే ఈ చిత్రం షూటింగ్ మార్చి నెలలో ప్రారంభమై మే నెలాఖరు వరకూ జరుగుతుంది. మొత్తం రామాయణ కథను మూడు భాగాలుగా ప్రేక్షకులకు అందించనున్నారు నితిన్ తివారీ. అయోధ్యలో రామమందిరం ప్రారంభం కావడంతో దేశమంతా ఇప్పుడు రామనామం ప్రతిధ్వనిస్తోంది. ఇటువంటి చారిత్రక నేపథ్యంలో అందరి దృష్టీ ఇప్పుడు నితిన్ 'రామాయణ్' చిత్రం మీదే ఉంటుందనడంలో సందేహం లేదు. రామాయణ గాథలో మరో కీలకమైన పాత్ర హనుమంతుడు. ఈ పాత్రను ఎవరు పోషిస్తారా అని చాలామంది ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే అంతకుముందు నటుడు దారాసింగ్ హనుమంతుడి పాత్రను అద్భుతంగా పోషించి ప్రశంసలు అందుకున్నారు. ఈ తరం నటుల్లో అటువంటి శక్తిమంతమైన పాత్రను ఎవరు పోషిస్తారా అని అందరూ అనుకుంటున్న తరుణంలో 'నేను' అంటూ ముందుకు వచ్చారు సన్నీడియోల్. ఇటువంటి పాత్రను పోషించే అవకాశం జీవితంలో ఒక్కసారే వస్తుంది కనుక దాన్ని మిస్ చేసుకోకూడదని సన్నీ భావించి అంగీకరించినట్లు సమాచారం. మే నెలలో హనుమంతుడి గెటప్ వేసుకుని సన్నీ కెమెరా ముందుకు వస్తారట. 2025 దీపావళికి ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలన్నది నిర్మాతల ఆలోచన.

ఫ్లాష్‌బ్యాక్

రాజబాబుని విభిన్నంగా చూపించిన తిరపతి



హాస్యనటుల్లో రాజబాబుది ఓ శకం. ఓ దశాబ్దం పాటు ఆయన చిత్ర పరిశ్రమను ఏలేశారు. తెరపై ఆయన కనిపిస్తే చాలు జనం ఆనందంతో ఈలలు వేసేవారు. గోలగోల చేసేవారు. సినిమాలో హీరో ఎవరైనా హాస్యనటుడిగా మాత్రం రాజబాబు ఉండాల్సిందే. ఆ రోజుల్లో ఆయనకు ఉన్న ఫాలోయింగ్, పాపులారిటీ అలాంటిది. దర్శకుడు దాసరి నారాయణరావు, రాజబాబు మధ్య చక్కని అనుబంధం ఉండేది. దాసరిని ఆయన 'బావా' అని పిలిచేవారు.

ఇటువంటి పాపులర్ కమెడియన్‌ను 'తాత-మనవడు' చిత్రంతో హీరోగా పరిచయం చేశారు దాసరి. దర్శకుడిగా దాసరికి అదే తొలి చిత్రం. 'తాత-మనవడు' చిత్రం ఘన విజయం సాధించింది. ఆ తర్వాత దాసరి దర్శకత్వంలోనే రాజబాబు మరోసారి 'తిరపతి' చిత్రంలో హీరోగా నటించారు.

రాజబాబునీ, ఆయన టాలెంట్‌ను దృష్టిలో పెట్టుకుని 'తిరపతి' పాత్ర తయారు చేశారు దాసరి. వయసు వచ్చినా మానసికంగా ఎదగని పాత్ర అది. తిరపతి పుట్టినప్పుడు పుట్టెంట్రుకలు తిరుపతిలో ఇవ్వాలని అతని తల్లి అనుకుంటుంది. అయితే ఎప్పటికప్పుడు తిరుపతి ప్రయాణం వాయిదా పడుతుంటుంది. చివరికి 25 ఏళ్ల వచ్చినా ఆ మొక్కు తీరక పోవడంతో జుట్టు బాగా పెరగడంతో జడ వేసుకుని తిరుగుతుంటాడు తిరపతి. అతనికి ఓ చెల్లెలు. ఈ పాత్రను జయసుధ పోషించారు. చెల్లెలు పెళ్లి చేయడం కోసం డబ్బు సంపాదించడానికి పట్నం వెళ్లిన తిరపతి ఎటువంటి ఇబ్బందులు పడ్డాడన్నదే మిగిలిన కథ.



ఈ సినిమాలో రాజబాబుకు బారిస్టర్ పార్వతీశాన్ని పోలిన గెటప్ ఇచ్చారు. బారెడు జడ, పంచె కట్టు, చేతిలో గొడుగు, ముఖంలో అమాయకత్వం.. విభిన్నంగా కనిపించిన రాజబాబుని చూడడానికి థియేటర్లకు ఎగబడ్డారు జనం.

ఈ సినిమాలో అల్లు రామలింగయ్య అతిథి పాత్ర పోషించారు. 'దేశం పన్నెండు సార్లు తిరిగానే నారాయణమ్మా' అనే పాటను ఆయనతోనే పాడించారు దాసరి. రామలింగయ్య, గిరిజపై ఈ పాట చిత్రీకరించారు.

1974 ఆగస్టు 15న 'తిరపతి' విడుదల కావాలి. కానీ సెన్సార్ సమస్య కారణంగా విడుదల ఆగింది. చివరకు అక్టోబర్ 5న సినిమా విడుదల చేశారు. ఆ రోజుల్లో ఎన్టీఆర్ చిత్రాలకు వచ్చే భారీ ఓపెనింగ్స్ 'తిరపతి' చిత్రానికి రావడం గమనార్హం. అయితే సినిమా అనుకున్న విధంగా విజయం సాధించలేదు.

రూ. 100 కోట్లు.. పదిహేనోసారి!



బాలీవుడ్‌లో ప్రస్తుతం దీపికా పదుకోన్ పేరు మారుమోగిపోతోంది. వరుస విజయాలతో మిగిలిన హీరోయిన్ల కంటే ఆమె ముందు ఉన్నారు. బాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్ కూడా దీపికనే. ఆమె తాజా చిత్రం 'ఫైటర్' కూడా బాక్సాఫీసును దున్నేస్తోంది. హృతిక్ రోషన్ హీరోగా నటించిన ఈ చిత్రం విడుదలైన మూడు రోజులకే ప్రపంచ వ్యాప్తంగా రూ. 100 కోట్లు వసూలు చేసి రికార్డ్ సృష్టించింది. 'ఫైటర్' సినిమాతో మరో రికార్డ్ నెలకొల్పారు దీపిక. అదేమిటంటే ఆమె ఇంతవరకూ 25 చిత్రాల్లో నటిస్తే, వాటిల్లో 15 సినిమాలు రూ. వంద కోట్లు సాధించాయి. ఆమె కెరీర్‌లో ప్రపంచ వ్యాప్తంగా రూ. వంద కోట్లు సాధించిన తొలి చిత్రం 'ఓం శాంతి ఓం'. 2007లో దీపావళి సందర్భంగా విడుదలైన ఈ సినిమా సాధించిన విజయం ఆమె కెరీర్‌కు బలమైన పునాది వేసింది. ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'కల్కి 2898 ఎడి' చిత్రంలో దీపిక నటిస్తోంది. వైజయంతీ మూవీస్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాతోనే దీపిక తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు ఈ చిత్రంలో.



కూతురు హీరోయిన్‌గా సీక్వెల్

దర్శకుడు శేఖర్ కపూర్ 1983లో రూపొందించిన క్లాసిక్ 'మాసూమ్'. నసీరుద్దీన్ షా , షబానా అజ్మీ, ఊర్మిళ(బాలనటి) తదితరులు ఇందులో నటించారు. ఎరిక్ సీగల్ రాసిన 'మ్యాన్, ఉమన్ అండ్ చైల్డ్' నవల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. నలభై ఏళ్ల తర్వాత ఆ చిత్రానికి సీక్వెల్ రూపొందించనున్నారు శేఖర్ కపూర్. 'మాసూమ్.. ది న్యూ జనరేషన్' పేరుతో రూపుదిద్దుకొనే ఈ చిత్రంతో శేఖర్ కపూర్ కుమార్తె కావేరి హీరోయిన్‌గా పరిచయం కానుంది. ఈ విషయాన్ని శేఖర్‌కపూర్ మాజీ భార్య, నటి సుచిత్రా కృష్ణమూర్తి కన్‌ఫర్మ్ చేశారు. త్వరలో ఈ సినిమా గురించి శేఖర్‌కపూర్ అధికారికంగా ప్రకటించనున్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● ఆదివారం 28 జనవరి 2024

తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డా.బీ.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో అయిదోతరగతి(ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఆర్‌ఏజీ-ఫిఫ్త్ సెట్(ప్రవేశ పరీక్ష)2024 ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. విద్యార్థులు తమ సొంత జిల్లా గురుకులంలో ప్రవేశానికి మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. విద్యార్థులు తాము చేరదలచుకొన్న గురుకుల పాఠశాల వివరాలను దరఖాస్తులో నమోదు చేయాలి. దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరవాత మార్పులకు అవకాశం లేదు. ఈ గురుకులాల్లో చేరిన బాలబాలికలకు విద్య, వసతి పూర్తిగా ఉచితం. క్రీడలు సహా వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన శిక్షణ అందిస్తారు.

ఏపీ గురుకులాల్లో అయిదో తరగతి అడ్మిషన్స్



అర్హత: ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2022-23 సంవత్సరంలో మూడోతరగతి పూర్తిచేసి 2023-24 సంవత్సరంలో(ప్రస్తుతం) నాలుగోతరగతి చదువుతున్న బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.1,00,000 మించరాదు.

వయసు: జనరల్, బీసీ, కన్వర్టెడ్ క్రిస్టియన్ విద్యార్థులు 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.

సీట్ల వివరాలు: రాష్ట్రంలో జిల్లాలవారీగా ఉన్న 186 గురుకులాల్లో మొత్తం 15,020 సీట్లు ఉన్నాయి. ఎస్సీ అభ్యర్థులకు 11,266 సీట్లు, కన్వర్టెడ్ క్రిస్టియన్లకు 1876, ఎస్టీ అభ్యర్థులకు 938, బీసీ అభ్యర్థులకు 752, జనరల్ అభ్యర్థులకు 188 సీట్లు కేటాయించారు.

రిజర్వేషన్ వివరాలు: ఎస్సీ విద్యార్థులకు 75 శాతం, బీసీ-సీ(కన్వర్టెడ్ క్రిస్టియన్) విద్యార్థులకు 12 శాతం, ఎస్టీ విద్యార్థులకు 6 శాతం, బీసీ విద్యార్థులకు 5 శాతం, ఇతరులకు 2 శాతం సీట్లు ప్రత్యేకించారు.

- కర్మాగారాల్లో పని నుంచి తీసేసిన పిల్లలు, అనాథలు, సైనికోద్యోగుల పిల్లలకు 15 శాతం; వికలాంగులకు 3 శాతం సీట్లు కేటాయించారు. వీరు సంబంధిత సర్టిఫికెట్‌ను దరఖాస్తుకు జతచేయాలి.
- ప్రతి కేటగిరీలో 3 శాతం సీట్లను సఫాయి కర్మచారి విద్యార్థులకు ప్రత్యేకించారు.
- ఏదైనా కేటగిరీలో సీట్లు మిగిలితే వాటిని ఎస్సీ విద్యార్థులకు కేటాయిస్తారు.

బీఆర్‌ఏజీ-ఫిఫ్త్ సెట్ 2024 వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. తెలుగు, ఇంగ్లీష్, మేథమెటిక్స్ సబ్జెక్టులనుంచి ఒక్కోదానిలో 10; ఈవీఎస్‌లో సైన్స్, సోషల్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన నాలుగోతరగతి సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లూ/బ్లాక్ పెన్‌తో గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. మొత్తం మార్కులు 50. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు లేదు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 23
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మార్చి 3 నుంచి
- **బీఆర్‌ఏజీ-ఫిఫ్త్ సెట్ 2024 తేదీ:** మార్చి 10
- **వెబ్‌సైట్:** https://apbragcet.apcfss.in

ఐఐటీ గాంధీనగర్‌లో స్పెషల్ పీహెచ్‌డీ

గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ జీఎన్) - స్పెషల్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని దివ్యాంగులు, ఓబీసీ(ఎన్‌సీఎల్), ఎస్సీ, ఎస్టీ కేటగిరీల అభ్యర్థులకు ఉద్దేశించారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



విభాగాలు: బయలాజికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కాగ్నిటివ్ అండ్ బ్రెయిన్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎర్త్ సైన్సెస్-ఎర్త్ సిస్టమ్స్ సైన్స్-ఆర్కియలాజికల్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్-సొసైటీ అండ్ కల్చర్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత విభాగంలో కనీసం 55/60 శాతం మార్కులతో ఎంఏ/ఎమ్మెస్సీ/బీటెక్/ఎంటెక్/బీఎస్(ఐసర్/ఐఐఎస్సీ)/బీఎస్-ఎంఎస్(ఐసర్) ఉత్తీర్ణులై ఉండాలి. నెట్/గేట్ అర్హత ఉన్నవారికి; సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులకు; ఐఐటీలు, ఐసర్లు, ఐఐఎస్సీ నుంచి 8 సీజీపీఏతో పీజీ/ఎంఎస్ పూర్తిచేసినవారికి సంస్థ ఫెలోషిప్ ఇస్తుంది.

ఫెలోషిప్: మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత నెలకు రూ.42,000ల ఫెలోషిప్ చెల్లిస్తారు. విదేశీ యూనివర్సిటీల్లో నాలుగు నుంచి ఆర్నెల్లపాటు రీసెర్చ్ వర్క్ చేసేందుకుగాను 12,500 యూఎస్ డాలర్లు ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లలో రీసెర్చ్ వర్క్ ప్రజంటేషన్ కోసం రూ.2,00,000 వరకు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** ఓబీసీ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 21
- **ఇంటర్వ్యూకి ఎంపికైనవారి లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 3
- **ఇంటర్వ్యూలు, రిటెన్ టెస్ట్:** ఏప్రిల్ 8 నుంచి 22 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 15
- **వెబ్‌సైట్:** iitgn.ac.in

ఫరీదాబాద్‌లోని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ అండ్ పవర్ స్టడీస్(ఎన్‌పీటీఐ)- ఎంబీఏ ఇన్ పవర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 120 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 41, ఎస్సీ అభ్యర్థులకు 16, ఎస్టీ అభ్యర్థులకు 8, ఓబీసీ(ఎన్‌సీఎల్) అభ్యర్థులకు 28, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 12, స్పాన్సర్డ్ అభ్యర్థులకు 15 సీట్లు కేటాయించారు. జాతీయ పరీక్ష స్కోర్/ఎన్ఏటీ 2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎన్‌పీటీఐలో ఎంబీఏ పవర్ మేనేజ్‌మెంట్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్/మ్యాట్/ఎక్స్‌ఏటీ/సీమ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేని పక్షంలో ఎన్‌పీటీఐ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్(ఎన్ఏటీ) 2024 రాయాల్సి ఉంటుంది. స్పాన్సర్డ్ అభ్యర్థులకు ఎటువంటి స్కోర్ అవసరం లేదు. వీరికి నిర్దేశించిన మేరకు అనుభవం తప్పనిసరి.

వెయిటేజీ: జాతీయ పరీక్ష స్కోర్/ఎన్ఏటీ 2024 స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కి 10 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- స్పాన్సర్డ్ అభ్యర్థుల ఎంపికలో అకడమిక్ ప్రతిభకు 60 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కి 10 శాతం, అనుభవానికి గరిష్ఠంగా 10 శాతం వెయిటేజీ ఇస్తారు.



- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్(ఎన్ఏటీ) 2024 రాసేవారికి మార్చి 4; జాతీయ పరీక్ష స్కోర్ ఉన్నవారికి ఏప్రిల్ 10
- **ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్(ఎన్ఏటీ) 2024 తేదీ:** మార్చి 12
- **ఎన్ఏటీ ఫలితాలు విడుదల:** మార్చి 19
- **గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 27, 28
- **కౌన్సెలింగ్:** మే 29
- **వెబ్‌సైట్:** www.npti.gov.in

జాబ్ కార్నర్

బీడీఎల్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

ఖాళీలు 361

భారత ప్రభుత్వరంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్).. నాలుగేళ్ల ఫిక్స్‌డ్ టర్మ్(కాంట్రాక్ట్) ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. ఇంటర్వ్యూకు హాజరు కాబోయే అభ్యర్థులు ఫిబ్రవరి 14 లోపు సంస్థ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

పని ప్రదేశం: బీడీఎల్ కార్పొరేట్ ఆఫీస్(హైదరాబాద్), బీడీఎల్ కంచన్‌బాగ్ యూనిట్(హైదరాబాద్), బీడీఎల్ ప్రాజెక్ట్ ఆఫీస్ ఏడీఈ(బెంగళూరు), భానూర్ యూనిట్(సంగారెడ్డి జిల్లా), విశాఖపట్నం యూనిట్ (ఆంధ్రప్రదేశ్).

1. ప్రాజెక్ట్ ఇంజనీర్/ఆఫీసర్: **136 పోస్టులు**
2. ప్రాజెక్ట్ డిప్లొమా అసిస్టెంట్/అసిస్టెంట్: **142 పోస్టులు**
3. ప్రాజెక్ట్ ట్రేడ్ అసిస్టెంట్/ఆఫీస్ అసిస్టెంట్: **83 పోస్టులు**

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, కెమికల్, ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్, ఫైనాన్స్, సివిల్, మెటలర్జీ, ఫిట్టర్, రేడియో మెకానిక్, టర్నర్, వెల్డర్, ఎలక్ట్రో ప్లేటింగ్, కంప్యూటర్స్, ఎలక్ట్రీషియన్, మిల్ రైట్, డీజిల్ మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్, ప్లంబర్.

అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ, బీటెక్, బీఎస్సీ, డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ ఎంఈ, ఎంటెక్, ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ, పీజీ డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ఫిబ్రవరి 14 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు

వేతనం: నెలకు ప్రాజెక్ట్ ఇంజనీర్/ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు రూ.30,000- రూ.39,000. ప్రాజెక్ట్ డిప్లొమా అసిస్టెంట్/ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.25,000- రూ.29,500. ప్రాజెక్ట్ ట్రేడ్ అసిస్టెంట్/ప్రాజెక్ట్ ఆఫీస్ అసిస్టెంట్‌కు రూ.23,000- రూ.27,500.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీలు: 2024 ఫిబ్రవరి 17, 18, 21, 22, 25

వేదిక: బీడీఎల్ కంచన్‌బాగ్(హైదరాబాద్), బీడీఎల్ భానూర్(సంగారెడ్డి), బీడీఎల్ విశాఖపట్నం యూనిట్

వెబ్‌సైట్: https://bdl-india.in/

ఎన్‌ఎల్‌సీలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 632

నైవేలి(తమిళనాడు)లోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్)...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: **314**
2. టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్: **318**

విభాగాలు: మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఫార్మసీ.

శిక్షణ వ్యవధి: ఏడాది

స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.15028; టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.12524

అర్హతలు: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ లేదా టెక్నాలజీలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: అకడమిక్ స్కోరు ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31

అభ్యర్థుల ఎంపిక జాబితా వెల్లడి: ఫిబ్రవరి 19

అప్రెంటిస్‌షిప్ ప్రవేశ తేదీలు: ఫిబ్రవరి 23 నుంచి 29 వరకు

వెబ్‌సైట్: https://www.nlcindia.in/

ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు

ఖాళీలు 38

న్యూఢిల్లీలోని బసాయిదరాపూర్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ.. తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.



పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్

విభాగాలు: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీతో పాటు టీచింగ్/రీసెర్చ్ విభాగంలో పని అనుభవం తప్పనిసరి.

వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.2,22,543, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,47,986, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,27,141.

ప్రదేశం: డీన్ ఆఫీస్, 5వ ఫ్లోర్, ఎంఎస్ ఆఫీస్ బిల్డింగ్, ఈఎస్ఐ-పీజీఐఎమ్ఎస్ఆర్, బసాయిదరాపూర్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://esic.gov.in/

కడపలో జనరల్ డ్యూటీ అటెండెంట్‌లు

ఖాళీలు 68

కడపలోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం...వైఎస్ఆర్ జిల్లా ఆరోగ్య సంస్థల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. జనరల్ డ్యూటీ అటెండెంట్: **50 పోస్టులు**
2. డేటా ఎంట్రీ ఆపరేటర్: **4 పోస్టులు**
3. బార్బర్: **2 పోస్టులు**
4. ధోబీ: **2 పోస్టులు**
5. జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్: **4 పోస్టులు**
6. ఓ.టీ.అసిస్టెంట్: **6 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, డిగ్రీ, డిప్లొమా, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 42 సంవత్సరాలు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, పుట్లంపల్లి, కడప, వైఎస్ఆర్ జిల్లా చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 30

వెబ్‌సైట్: kadapa.ap.gov.in/

చిట్టీల్స్



మీకు తెలుసా?

చూడచక్కని అందం.. పసుపు పచ్చరంగు.. నల్లటి చుక్కల శరీరం.. పక్కన రెక్కలు.. చూడటానికి ఓ పెట్టెలా ఉండే ఈ చేపను 'ఎల్లో బాక్స్ ఫిష్' అని పిలుస్తారు.

- పది ఇంచుల నుంచి 24 ఇంచుల పొడవు ఉంటుంది.
- హిందూ మహాసముద్రం, అరబిక్ మహాసముద్రం, అట్లాంటిక్ మహాసముద్రంలో ఇవి కనపడతాయి.
- నాచు, చిన్న చేపలను తిని బతికే ఈ చేపకు అద్భుతమైన డిఫెన్స్ మెకానిజం వీటికి ఉంటుంది.




- ఆస్ట్రాక్‌టాక్సిన్ అనే పదార్థాన్ని వెదజల్లుతుంది. ఇది నీటిలోకి చేరిన తర్వాత విషంగా మారుతుంది. మనిషి లేదా ఏ ఇతర జీవుల రక్తకణాలపై దీని ప్రభావం ఉంటుంది. అందుకే అందంగా ఉందని దీన్ని తాకినా.. లేక ఈ మాంసాన్ని తిన్నా మనుషులకు ప్రమాదమే మరి.
- చిన్న నోరు ఉండే ఈ చేపకు ఏమి దొరికినా గుటుక్కున మింగేస్తుంది. ఇంతకీ ఈ చేప ఇలా పెట్టెలా ఉండటానికి కారణం దాని శరీరంలోని ఎముకల నిర్మాణమే కారణం.
- సాల్ట్‌వాటర్‌లోనే ఉండే ఈ చేపను ఇంట్లో కూడా పెంచుకోవచ్చు. అయితే దాని ముట్టుకోవటం చేయకూడదు. కేవలం అందం కోసం ఆక్వేరియంలో పెంచుకోవచ్చు.
- ఇవి నిదానంగా ఈదుతాయి. అందుకే చూడటానికి అందంగా కనపడతాయి.
- డైట్ విషయంలో కూడా జాగ్రత్తగా ఉంటాయి. ముఖ్యంగా సముద్రంలో ఉండే రాళ్లను పళ్లతో పట్టుకుని వేలాడుతుంటాయి.
- ఇవి పదేళ్ల వరకూ జీవిస్తాయి.
- మనదేశంలోని లక్షద్వీప్, అండమాన్ నికోబార్, కేరళ తీర ప్రాంతాల్లో కూడా ఈ చేపలు నివసిస్తాయి.
- మెర్సిడెస్ బెంజ్‌కార్ ఈ చేప స్ఫూర్తితో బయోనిక్ కార్‌ను తయారు చేయటం విశేషం.
- కొన్ని చేపలకు కొమ్ములు కూడా ఉంటాయి.
- వయసు పెరిగే కొలదీ వాటికి ఉండే పసుపుపచ్చ రంగు షేడ్ తగ్గుతుంది.


రంగులు వేయండి



6 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



	6		7	1	4			2
	5							4
				6		3		7
			4			8	3	
			5		6			
	3	2			9			
3		7		5				
2							5	
5			9	7	3		2	

డైలీ సుడోకు - 215

సుడోకు - 214 సమాధానం

1	7	5	3	6	8	2	9	4
9	4	6	1	2	7	5	8	3
3	2	8	4	5	9	1	6	7
4	6	3	5	9	2	7	1	8
2	8	7	6	1	3	9	4	5
5	1	9	7	8	4	3	2	6
8	5	2	9	3	6	4	7	1
7	9	1	8	4	5	6	3	2
6	3	4	2	7	1	8	5	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.